సోమవారం
14•08•2017

హైదరాబాద్
• వెల.5 రూ.

• సంపుటి 7 • సంచిక 68
• పేజీలు : 16 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

పంద్రాగస్టున సాహితీ సంబురం



సుద్దాల అశోక్‌తేజ



జయరాజ్




శ్రీభాష్యం విజయసారథి

ముగ్గురు ప్రముఖులకు విశిష్ట పురస్కారం

సినీ గేయ రచయిత సుద్దాల, పాటల రచయిత జయరాజ్, సంస్కృత విద్వాంసులు విజయసారథిలకు సాహిత్య అవార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాహిత్యరంగంలో విశేష సేవలను అందించిన సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, పాటల రచయిత జయరాజ్, సంస్కృత విద్వాంసులు శ్రీభాష్యం విజయసారథిలకు తెలంగాణ ప్రభుత్వం విశిష్ట సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. గోల్కొండ కోటలో మంగళవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వీరికి పురస్కారాలను అందజేసి సన్మానించనున్నారు. ఒక్కొక్కరికి రూ.1,00,116 చెక్కు, జ్ఞాపిక, శాలువాలను ఇచ్చి సత్కరించనున్నారు.

2



గోల్కొండ ముస్తాబు | పంద్రాగస్టు వేడుకల కోసం ఆదివారం గోల్కొండ కోటలో త్రివర్ణ పతాకాలతో రిహార్సల్ చేస్తున్న విద్యార్థినులు

12

ఎక్సలెంట్ ఐఏఎస్‌లు



టీ చిరంజీవులు



గౌరవ్ ఉప్పల్



జ్యోతి బుద్ధప్రకాశ్



ప్రశాంత్ జే పాటిల్



రాజీవ్‌గాంధీ హనుమంతు



ఏ శరత్



వెంకటరామరెడ్డి



సురేంద్రమోహన్



ఏ మురళి



ఏ దేవసేన

సివిల్ సర్వీసెస్ అధికారులకు ఎక్సలెన్స్ అవార్డులు

ఇన్నోవేషన్, సాధారణ విభాగాల్లో ఎంపిక

ఆదిలాబాద్ కలెక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌కు రెండు పురస్కారాలు

12



యోగితారాణా

ఐటీఐఆర్ నిధులేవీ?

నాలుగేండ్ల కిందట ఆమోదించినా.. నిధుల విడుదల జాప్యంతో గందరగోళం

ప్రాజెక్టుపై విధానపరమైన స్పష్టత ఇవ్వండి ▪ కేంద్ర ఐటీశాఖ మంత్రికి రాష్ట్ర మంత్రి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) ప్రాజెక్టుకు వెంటనే నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టుకు నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని విన్నవించారు. ప్రాజెక్టుకు అనుమతిచ్చి నాలుగేండ్లయినా నామమాత్రపు నిధులనే విడుదల చేశారని, ఈ జాప్యంతో ప్రాజెక్టుపైనే అనుమానాలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు జాతీయ సగటుకన్నా అధికంగా ఉన్నాయని, సర్కారు తీసుకొచ్చిన కొత్త సంస్కరణలతో అంతర్జాతీయస్థాయి కంపెనీలు సైతం హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయని వివరించారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు మంత్రి కేటీఆర్ లేఖ రాశారు. '2013 సెప్టెంబర్‌లో ప్రతిష్ఠాత్మక ఐటీఐఆర్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతిచ్చినా.. ఇప్పటివరకు నామమాత్రపు

మిగతా 2వ పేజీలో



16, 17 తేదీల్లో భారీ వర్షాలు

- ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి
- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- నేడు, రేపు ఓ మోస్తరు వాన: వాతావరణ కేంద్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ మీదుగా ద్రోణి ఏర్పడిన నేపథ్యంలో 16, 17 తేదీల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. దీనికితోడు బంగాళాఖాతంలో కోస్తాంధ్రాతీరం వెంబడి సముద్రమట్టానికి 3.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొని ఉన్నదని తెలిపారు. ఈ ప్రభావంతో సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులతోపాటు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించారు. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావాలతో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని, 16, 17 తేదీల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని ముందస్తుగా హెచ్చరించారు. గత

మిగతా 12వ పేజీలో

డిసెంబరే డెడ్‌లైన్!

ఎల్లంపల్లి-మిడ్‌మానేరు పనులు పూర్తికావాలి ▪ కొత్త సంవత్సరంలో నీళ్లుపడాలి

ప్యాకేజీలవారీగా పనులకు గడువు ఖరారు ▪ కాళేశ్వరం పనుల సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఎల్లంపల్లి-మిడ్‌మానేరు పనులను డిసెంబర్ చివరికల్లా పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త సంవత్సరం వచ్చేసరికి ఎల్లంపల్లి నీళ్లు మిడ్‌మానేరులో పడాలని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిని మంత్రి ఆదివారం జలసౌధలో సమీక్షించారు. ఏడు పాత జిల్లాల రైతుల జీవితాలు ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్నందున అత్యధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ప్యాకేజీ-6, 7, 8 పనులను వేగిరపరిచేందుకు వారానికి రెండ్రోజులు సైట్‌కు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డిని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు చెందిన వివిధ పనులకు డెడ్‌లైన్లను మంత్రి ఖరారు చేశారు. నవంబర్ నాటికి పంపుహౌజ్, టన్నెల్ పనులు, ఇతర నిర్మాణాలు, నవంబర్ చివరికి ఎల్క్ట్రికల్, మెకానికల్ పనులు, డిసెంబర్ నాటికి సర్జ్‌పూల్ పనులు పూర్తిచేసి

మిగతా 2వ పేజీలో



ఆఖరాటలో తడబాటు

4X100 మీటర్ల రిలేలో బోల్ట్‌కు నిరాశ

గాయంతో రేసు పూర్తిచేయలేకపోయిన జమైకా చిరుత



- వివరాలు ఖేల్‌లో

హార్దిక్ అదరహో..

ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు
8వ నంబర్ బ్యాట్స్‌మన్‌గా ఫాస్టెస్ట్ సెంచరీ

గోరఖ్‌పూర్ హీరో

5

మనసున్నడాక్టర్!

పిల్లల కోసం తండ్లాడిన కఫీల్ అహ్మద్
సొంత డబ్బులతో ఆక్సిజన్ సిలిండర్ల కొనుగోలు
అయినా.. విధుల నుంచి తప్పించిన ప్రభుత్వం



గజ్వేల్‌లో విద్యాలయాలు జిగేల్

అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ విద్యాసంస్థలు
పాఠశాల నుంచి డిగ్రీ వరకు ప్రత్యేక బోధన
బాలబాలికలకు వేర్వేరుగా వసతిగృహాలు
యూనివర్సిటీ స్థాయిలో నలుగురికి ఒక గది
స్వయంగా రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
689 గదులు.. 5,906 మంది విద్యార్థులు

ఉమ్మడిరాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అంటే పెచ్చులూడే భవనాలు, నేలపై చదువులకు నిలయాలుగా ఉండేవి! నేటి విద్యార్థులే రేపటి ఆస్తిగా గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం.. నాణ్యమైన ప్రభుత్వ విద్యపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా ఆధునిక సౌకర్యాలతో వెయ్యికిపైగా గురుకులాలు ఏర్పాటుచేసింది. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో ప్రయోగాత్మకంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కార్పొరేట్ సౌకర్యాలను తలదన్నేలా, మినీ యూనివర్సిటీని తలపించేలా దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎడ్యుకేషనల్ హబ్ తయారవుతున్నది. బాలబాలికలకు వేర్వేరుగా నిర్మిస్తున్న అత్యాధునిక భవనాల్లో కొన్ని పూర్తికాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుత సౌకర్యాలను సర్దుబాటు చేసుకొని ఇప్పటికే తరగతులు కొనసాగుతున్నాయి. ఇక్కడి వసతులు భూతలస్వర్గాన్ని తలపిస్తున్నాయి. చదివితే తెలంగాణ సర్కారు బడుల్లోనే చదువాలనిపించేలా ఏర్పాటవుతున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎడ్యుకేషనల్ హబ్‌పై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.. 6వ పేజీలో

హిమాచల్‌లో పెను విషాదం

కొండ చరియల కింద 46 మంది సజీవ సమాధి

- రెండు బస్సులపై మట్టిపెళ్లల రూపంలో వచ్చిపడ్డ మృత్యువు..
- మృతుల్లో ఇద్దరు తెలంగాణవాసులు
- ప్రయాణికులు అల్పాహారం కోసం ఆగినప్పుడు ఘటన
- 250 మీటర్ల పొడవున రహదారి ధ్వంసం.. ట్రాఫిక్ మళ్లింపు

5



హిమాచల్‌ప్రదేశ్ మండి జిల్లాలో కొండచరియలు విరిగిపడి నుజ్జునుజ్జయిన వాహనాలు

మొక్కలు పెంచితే మార్కులు!

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ పాఠశాల వినూత్న ప్రయత్నం

ట్విట్టర్‌లో అభినందించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం ఒద్యారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల వినూత్న ప్రయత్నానికి మంత్రి కేటీఆర్ అభినందనలు దక్కాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకాన్ని పాఠశాల ఉపాధ్యాయులు విశేషంగా ప్రోత్సహిస్తున్నారు. మొక్కలు నాటి, వాటికి నీళ్లు పోసి సంరక్షించిన విద్యార్థులకు మార్కులు ఇవ్వడం ప్రారంభించారు. ఒక్కో మొక్క బాధ్యతను ఒక్కో విద్యార్థికి అప్పగించారు. ప్రతి మొక్కకు ఒక ట్యాగ్‌ను తగిలించారు. దానిలో ఆ మొక్క సంరక్షణ బాధ్యతను చూసే విద్యార్థి వివరాలు ఉంటాయి. ఈ విషయం మంత్రి కేటీఆర్ దృష్టికి రావడంతో తన వ్యక్తిగత ట్విట్టర్ ఖాతాలో పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను మెచ్చుకొంటూ ఫొటోను పోస్టు చేశారు. 'ఒద్యారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్కులు ఇవ్వడం ప్రారంభించారు' అని మంత్రి ట్వీట్ చేశారు.



కరీంనగర్ జిల్లా ఒద్యారం పాఠశాల ఉపాధ్యాయులను అభినందిస్తూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

ఐటీఐఆర్ నిధులేవీ?

మొదటిపేజీ తరువాయి...

నిధులనే విడుదల చేశారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఐటీఐఆర్ ప్రాజెక్టు జాతీయస్థాయిలో ఆసక్తి రేకెత్తించింది. కానీ నాలుగేండ్లలో కేంద్రం నుంచి సరైన మద్దతు లేకపోవడంతో ఈ ప్రాజెక్టు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారయింది. కేంద్రానికి ఈ ప్రాజెక్టుపై స్పష్టత లేకపోవడం వల్ల అనేక అనుమానాలు నెలకొన్నాయి. వీటివల్ల గందరగోళం తలెత్తింది. ఐటీఐఆర్ ప్రాజెక్టుపై విధానపరమైన స్పష్టత ఇవ్వడంతోపాటు ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా నాలుగేండ్ల కిందట ఆమోదించిన నిధులను వెంటనే విడుదల చేయండి' అని మంత్రి కేటీఆర్ లేఖలో కోరారు. 'ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు 2008లో కేంద్రం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐటీఐఆర్లను మంజూరుచేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) ఇవ్వాల్సి ఉంది. ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్‌లోని 202 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఐటీఐఆర్ చేపట్టాలని తెలంగాణ ఐటీ శాఖ 2010లోనే ప్రతిపాదన చేసింది. దీంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఐటీఐఆర్‌ను మంజూరుచేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటీఐఆర్ డీపీఆర్‌ను రెండుసార్లు కేంద్రానికి సమర్పించాం. మౌలిక వసతుల కల్పనకు రెండుదశల్లో రూ.4,863 కోట్లు సాయంచేయాలని ఐటీశాఖ కోరింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించి కేంద్రం రూ.3,275 కోట్లు (మొదటిదశలో రూ.165 కోట్లు, రెండోదశలో రూ.3,110 కోట్లు) మంజూరు చేస్తామని తెలిపింది. ఇప్పటికే అనేకసార్లు విజ్ఞప్తిచేసినా పూర్తిస్థాయి నిధుల విడుదల కాలేదు. నేను స్వయంగా కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్‌ను కలిసి ఐటీఐఆర్‌కు సహకరించాల్సిందిగా కోరాను' అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఐటీ, అనుబంధ రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని సైతం అందులో వివరించారు. తెలంగాణ ఐటీ ఎగుమతులు.. జాతీయ సగటు కన్నా అధికంగా ఉన్నాయని, 2016-17 సంవత్సరానికి జాతీయ సగటు కన్నా నాలుగు శాతం అధికంగా ఐటీ ఎగుమతులను రాష్ట్రం చేసిందని లేఖలో తెలిపారు. గత మూడేండ్లలో ఐటీరంగంలో ప్రత్యక్ష ఉపాధి 3,23,396 మంది నుంచి 4,31,891 మందికి పెరిగిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ విధానం ద్వారా ప్రపంచ ప్రసిద్ధ సంస్థలైన గూగుల్, యాపిల్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్ వంటి అత్యుత్తమ కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయని కేటీఆర్ లేఖలో వివరించారు. ఇలా తెలంగాణ దేశంలోనే పెట్టుబడులకు అనువైన కేంద్రంగా మారిందని చెప్పారు. మరోవైపు ఇన్నోవేషన్ రంగంలో తెలంగాణ దూసుకుపోతున్నదని, దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ టీ హబ్‌ను ఏర్పాటుచేశామని, దీన్ని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ గత ఏడాది స్వయంగా సందర్శించి, స్టార్టప్‌లపై ప్రశంసలు కురిపించారని గుర్తుచేశారు. తెలంగాణ యువతకు వృత్తి నైపుణ్యం అందించడానికి టాస్క్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఐటీ పరిశ్రమ బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నదని వివరించారు. ఐటీఐఆర్ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేస్తే రాష్ట్రంలో పరిశ్రమల ప్రగతి మరింత ముందుకు పోతుందన్నారు. హైదరాబాద్ నగరానికి మరిన్ని పెట్టుబడులు వస్తే, యువతకు ఉద్యోగాలు వస్తాయని, తద్వారా దేశ ఆర్థిక ప్రగతికి ఇది తోడ్పడుతుందని మంత్రి కేటీఆర్ తన లేఖ ద్వారా కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మెట్రోరైలు వచ్చేస్తున్నది

నాగోల్ టు మియాపూర్ మీదుగా పరుగులు

నవంబర్ చివర్లో ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభం

- 30 కిలోమీటర్ల మేర ఆపరేషన్స్
- ఆదేశాలు జారీచేసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ నగర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెట్రోరైలు కల త్వరలో నెరవేరనున్నది. ట్రాఫిక్ ప్రతిబంధకాలు లేకుండా నిమిషాల్లో అల్లంతదూరం తీసుకెళ్లే మెట్రోరైలు పరుగులు పెట్టేందుకు సిద్ధమవుతున్నది. నాగోల్ నుంచి మియాపూర్ వరకు 30 కిలోమీటర్ల మేర ఆపరేషన్స్ చేపట్టాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. నవంబర్ చివర్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభం కానున్నది. దీనికి సంబంధించిన సంకేతాలు, ఆదేశాలు సీఎం కేసీఆర్ ఇచ్చినట్లు మెట్రో ఒక ప్రకటనలో తెలిపింది. మియాపూర్ నుంచి నాగోల్ వరకు ఏకబిగిన ప్రయాణికులకు సేవలందించేవిధంగా రెండుకారిడార్లను పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొంది. కారిడార్ 1లోని మియాపూర్-అమీర్‌పేట 13 కిలోమీటర్లు, కారిడార్ 3కి సంబంధించిన అమీర్‌పేట-నాగోల్ 17 కిలోమీటర్ల మార్గాన్ని అనుసంధానించడానికి వీలుగా అమీర్‌పేట్ స్టేషన్‌ను త్వరితగతిన పూర్తిచేయనున్నారు. ఈ బాధ్యతలను పర్యవేక్షించాలని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారక రామారావుకు సీఎం సూచించారు. అమీర్‌పేట్ ఇంటర్‌ చేంజ్ స్టేషన్ నిర్మాణానికి ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో సుమారు 800 మంది కార్మికులు 24 గంటలు కృషిచేస్తున్నారు. ఈ స్టేషన్లో సుమారు 92 అడుగుల ప్లాట్‌ఫాం, 112 అడుగుల ఎత్తైన పైకప్పు నిర్మిస్తున్నారు. విమానాశ్రయాలను ప్రతిబింబించేలా తిరుచిరాపల్లిలోని ప్రత్యేక నిర్మాణ ఏజెన్సీకి చెందిన అధునాతన ఉక్కు స్తంభాలు, రూఫింగ్ పరికరాలతో ఈ స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.



ఆదివారం హైదరాబాద్‌లో మెట్రో రైలు పనులను తనిఖీ చేస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ కీలకం

దేశంలోనే అత్యంత పెద్ద మెట్రోస్టేషన్‌గా అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ స్టేషన్ ఆవిర్భవించనున్నది. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎన్నో ప్రత్యేక వసతులతో దీన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులను ఆదివారం ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తనిఖీ చేశారు. కారిడార్ 1, కారిడార్ 3 రవాణా అవసరాలను అనుసంధానం చేస్తూ రెండు కారిడార్లు ఒకదానిపై మరొకటి వెళ్లేందుకు అనువుగా ఉండేలా నిర్మాణం చేస్తున్నారు. కాంకోర్స్ స్థాయిలో సాంకేతిక గదులు, ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ గేట్లు, టికెటింగ్ గదులు ఉంటాయి. ప్రధాన ప్రాంతాన్ని జగ్వార్ గోధుమవర్ణం గ్రానైట్ ఫ్లోరింగ్‌తో అద్భుతంగా నిర్మిస్తున్నారు. ఈ స్టేషన్‌కు ఇరువైపులా 16 లిఫ్టులు,12 ఎస్కలేటర్లు, 12 మెట్లదారులు ఉన్నాయి. ఒక కారిడార్ నుంచి మరొక కారిడార్‌లోకి మారడానికి అనువుగా ప్రయాణికులకు విశాలమైన మెట్లు, స్కైవేస్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చెయ్యాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు మారడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మంది ఉపయోగించుకునే విధంగా, 6 వేల మంది ప్రయాణికులు ఏ సమయంలోనైనా సులువుగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పాదచారుల సౌకర్యానికి పెద్దపీట వేయనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఈ స్టేషన్‌కు సులభంగా చేరుకోవడానికి వీలుగా గ్రీన్‌ల్యాండ్స్, పంజాగుట్ట, యూసుఫ్‌గూడ, మైత్రీవనం, ఎస్సార్‌నగర్ జంక్షన్లన్నింటినీ అమీర్‌పేట మెట్రోస్టేషన్‌కు అనుసంధానం చేయాలని ఎండీ ఇంజినీర్లను ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితోపాటు ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంపీ నాయుడు, ముఖ్య ఇంజినీరు డీవీఎస్ రాజు, ఎస్‌ఈ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఎన్ రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆదివారం జలసౌధలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

డిసెంబరే డెడ్‌లైన్!

మొదటిపేజీ తరువాయి...

డ్రై రన్ కూడా నిర్వహించాలని స్పష్టంచేశారు. ఆయా ప్యాకేజీలకు చెందిన టన్నెల్స్, కాల్వల లైనింగ్ పనులు అక్టోబర్, నవంబర్ వరకు పూర్తి చేసుకోవాలన్నారు. డిసెంబర్ నాటికి 6, 7, 8 ప్యాకేజీల పనులన్నీ పూర్తి కావల్సిందేనని చెప్పారు. పనులన్నీ ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని మంత్రి కోరారు. అలాగే మేడారం రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలని, రైతులకు పంట పరిహారం వెంటనే చెల్లించాలని మంత్రి చెప్పారు. క్రాప్ హాలీడే ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌ను ఆదేశించారు. ఈ సమీక్షలో నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఈఎన్సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఎన్ వెంకటేశ్వర్లు, భూసేకరణ సలహాదారు జీ మనోహర్, ఈఈ నూనె శ్రీధర్, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది చివరినాటికి రైతు సమాఖ్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు క్షేత్రస్థాయి నుంచి సంస్కరణలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అన్నదాతలను సంఘటితంచేసే రైతు సమాఖ్యలను ఈ ఏడాది చివరినాటికి ఉనికిలోకి తీసుకురావాలని భావిస్తున్నది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఖరారుచేసే పనిలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో వీటిని ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే రైతు సమగ్ర సర్వేను పూర్తి చేసి, వివరాలను విశ్లేషిస్తున్నారు. సన్న, చిన్న, మధ్య, ధనిక రైతుల వివరాలను ఈ సర్వే ద్వారా గుర్తించారు. అలాగే జిల్లాకు 100 మంది చొప్పున ఆదర్శ రైతులను సర్కారు ఎంపిక చేసింది. మొత్తం మూడువేల మంది రైతులతో సీఎం కేసీఆర్ త్వరలో విడుతలవారీగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశాలకు సంబంధించిన తేదీలను త్వరలో ఖరారు చేయనున్నారు.


ముహూర్తం

సూర్యోదయం: 6.02 గంటలకు

సూర్యాస్తమయం: 6.39 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, సప్తమి రాత్రి 7.48 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: అశ్విని తె. 5.05 వరకు, తదుపరి భరణి. అమృత ఘడియలు: రాత్రి 11.23 నుంచి 12.59 వరకు, రాహుకాలం: ఉదయం 7.37 నుంచి 9.12 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.55 నుంచి 12.46 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.17 నుంచి 4.07 వరకు, వర్జ్యం: ఉదయం 6.36 నుంచి 8.12 వరకు.

లోకం పోకడ



సాహితీసేవకు సత్కారం

తెలంగాణ సాహితీ ప్రముఖులకు దక్కిన గౌరవం..

సుద్దాల, విజయసారథి, జయరాజ్‌కు విశిష్ట సాహిత్య పురస్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సాహిత్యరంగంలో సేవలను అందించినందుకు తెలంగాణ సర్కారు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, పాటల రచయిత జయరాజ్, సంస్కృత విద్వాంసులు శ్రీభాష్యం విజయసారథిలను రాష్ట్ర విశిష్ట సాహిత్య పురస్కారాలకు ఎంపికచేసింది. ఈ సందర్భంగా రచయితలు 'నమస్తే తెలంగాణ'తో తమ అనుభూతులను పంచుకున్నారు. వారి సాహిత్య జీవిత విశేషాలు, ఇంటర్వ్యూలు..

నల్లగొండ సాహిత్య 'తేజ'ం



సుద్దాల అశోక్‌తేజ పూర్వనల్లగొండ జిల్లా సుద్దాల గ్రామంలో హనుమంతు, జానకమ్మ దంపతులకు జన్మించారు. సినిమా పాట ఆయువుపట్టును పట్టుకున్నారు. దాశరథి, సినారెల వారసుడిగా సినిమారంగంలో ఉన్నా.. నవల, గేయ కావ్యాలు, నృత్యరూపకాల రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. తెలుగు సినిమా పాటకు జాతీయస్థాయిలో ఉత్తమ సినిమా గేయ రచయిత పురస్కారాన్ని అందుకున్న తొలి తెలంగాణ కవి కూడా ఈయనే. నిరుపేద కుటుంబంలో పుట్టినా అంచెలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు ఉత్తమ సినిమా గేయ రచయితగా నంది అవార్డులు అందుకున్నారు. సుద్దాల 'శ్రమకావ్యం' పేరుతో వచన గేయకావ్యాన్ని రచించారు. ఈయన గాయకుడు కూడా. ఇప్పటివరకు 31 సభల్లో 'శ్రమకావ్యం'ను పాడారు. వెలుగురేఖలు (నవల), బతుకుపాటలు, వీరతెలంగాణ సాంఘిక యక్షగానం, నా పాటలు వంటి పుస్తకాలను వెలువరించారు. గ్రామంలో తల్లిదండ్రుల పేరిట 'సుద్దాల ఫౌండేషన్'ను ఏర్పాటుచేసి సేవారంగంలో కృషి చేస్తున్నారు. ఏడేండ్లుగా 'అమ్మ ఒడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఇదో గొప్ప గౌరవం..

ప్ర. ప్రభుత్వ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రకటించడంపై మీ స్పందన?

జ. సినిమా పాటల రచయితతోపాటు తెలుగు సాహిత్యరంగంలో చేస్తున్న కృషికిగాను పురస్కారానికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు. ఇది గొప్ప గౌరవం. దీన్ని జాతీయస్థాయిలో వచ్చిన గౌరవంతో సమానంగా భావిస్తున్నా. సీఎం కేసీఆర్‌కు చాలా భాషల సాహిత్యాలతో పరిచయం ఉన్నది. ఆయనతో మాట్లాడిన సందర్భంలోనే 'అమ్మ ఒడి' కార్యక్రమం గురించి చర్చించాం. ఆయన ఆలోచనలతోనే ఏడేండ్ల కిందట మా స్వగ్రామం సుద్దాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. దీనికి సీఎం నాకు స్ఫూర్తి.

ప్ర. తెలంగాణ సాయుధపోరాట వీరుడు హనుమంతు వారసుడిగా.. సాహిత్య సేవను ఎలా కొనసాగిస్తారు?

జ. నేను రాసే ప్రతి అక్షరం అమ్మానాన్నల ఆశీర్వాదంతో రాస్తున్నదే. వారి వారసుడిగా సాహిత్య రంగంలో కృషిచేస్తున్నా. సేవారంగం అభివృద్ధికి ప్రయత్నిస్తున్నా. సీఎం కేసీఆర్‌కు నా భార్యపిల్లలు కుటుంబసభ్యులందరి తరఫున కృతజ్ఞతలు.

పురస్కారాల నిధి.. శ్రీభాష్యం విజయసారథి



ప్రముఖ సంస్కృత పండితులు, జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర విద్వాంసులు శ్రీభాష్యం విజయసారథిది కరీంనగర్ జిల్లాలోని చేగుర్తి గ్రామం. నరసింహాచార్య, గోపమాంబ దంపతులకు 1936 మార్చి 10న ఆయన జన్మించారు. సంస్కృత సాహిత్య పండితులుగా, పరిశోధకులుగా సేవలందించారు. విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, వరంగల్‌లో ఉపన్యాసకులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. మందాకినీ కావ్యం, భారత భారతి, రోచిష్మతి, రాసకేళి, సంగీత మాధవమ్, శారదా పదకింకిణి, శబరీ పరిదేవనమ్, ఉదాహరణాని, ఆవాహనమ్ ప్రవీణ భారతమ్, విషాదలహరి, పరివాదిని రచనలతోపాటు శతాధిక సంస్కృత కావ్యరచనలు చేశారు. ఈయన సాహితీ సేవకు కేకే బిర్లా ఫౌండేషన్ వాచస్పతి పురస్కారం, తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్ వారి ఇందిరా గోల్డ్ మెడల్ అవార్డు, ఆంధ్ర సాహిత్య అకాడమీ వారి సృజనాత్మక సంస్కృత సాహిత్య పురస్కారం, మాజీ ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్ చేతుల మీదుగా స్వర్ణకంకణం తదితర పురస్కారాలను అందుకున్నారు. ప్రహేళికలు 2 భాగాలు తదితర పుస్తకాలు రచించారు.

సొంతగడ్డపై పురస్కారం గౌరవప్రదమైంది


ప్ర. తెలంగాణ ప్రభుత్వ విశిష్ట సాహిత్య పురస్కారంపై మీ స్పందన ఏంటి?

జ. సంస్కృత భాషకు చేసిన సేవలకు మంచి గౌరవమే లభించింది. అత్యుత్తమ పురస్కారాలు వచ్చాయి. వాటిన్నింటిలో తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారం చాలా గౌరవప్రదమైనది. ఎందుకంటే సొంతగడ్డ మీద తీసుకుంటున్న పురస్కారం కదా.

ప్ర. సంస్కృత భాషా వ్యాప్తికి ఇంకేం చేయొచ్చు?

జ. సంస్కృత పండితులే సంస్కృతం అంటే భయపడేలా చేశారు. తెలుగులో మాట్లాడుకునే తొంభై శాతం మాటలు సంస్కృతపదాలే. ఉదాహరణకు విలేకరి పదం సంస్కృతపదమే. సంస్కృతమంటే భయం పోగొట్టాలి. సీఎం తలచుకుంటే రాష్ట్రంలో సంస్కృత భాషా వ్యాప్తికి కృషి చేయగలరు. నాకు ఆ నమ్మకం ఉంది.

పల్లె జనం నోట.. జయరాజ్ పాట



మహబూబాబాద్‌లోని నిరుపేద వ్యవసాయ కుటుంబంలో కిష్టయ్య, చెన్నమ్మ దంపతులకు జయరాజ్ జన్మించారు. రెండున్నర దశాబ్దాల్లో నాలుగువందల పాటలు రాసిన ఈయన తెలంగాణ మట్టిపరిమళాలను ప్రతిపాటలో ఆవిష్కరించారు. 'పచ్చని చెట్టును నేనురా- పాలుగారే మనసు నాదిరా' అనే పల్లవితో చెట్టుపై రాసిన పాట తెలంగాణను చుట్టి వచ్చింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఈ పాట ప్రతినోటా వినిపిస్తున్నది. 'చెరువే ఊరికి ఆదరువు, చెరువే బతుకుదెరువు, చెరువు కల్పవల్లి ' అనే పాట జయరాజ్‌కు పేరుప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం హైదరాబాద్ సింగరేణి కాలరీస్ కార్యాలయంలో టెక్నీషియన్‌గా ఉద్యోగబాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పంచభూతాలపై ఈయన రాసిన పాటలు పల్లెల్లో మారుమోగుతున్నాయి. ఉద్యమంకోసం చాలా పాటలు రాశారు, 'విముక్తి పాటలు' పుస్తకంతో ఆయన సాహిత్య లోకానికి పరిచయమయ్యారు. వందనాలమ్మా, జయరాజ్ పాటల సంకలనం - 1, 2, వసంతగీతం-1, -2 పేరుతో పాటల పుస్తకాలను వెలువరించారు. జ్ఞాపకాల పేరుతో ఆయన రాసిన జీవితానుభవాల పుస్తకం మంచి గుర్తింపు పొందింది. జయరాజ్ 20 సినిమాలకు పాటలను రాశారు. 'అడవిలో అన్నలు' సినిమాలో రాసిన 'వందనాలమ్మా.. వందనాలమ్మా' పాట ఆయనకు మంచి పేరును తీసుకొచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వరుస కరువులతో విలవిలలాడుతున్న సమయంలో 'వానమ్మా వానమ్మా.. ఒక్కసారి వచ్చిపోవమ్మా' అంటూ రాసిన పాట కంటతడిపెట్టించింది.

మట్టి మనిషికి లభించిన మాణిక్యం

ప్ర. తెలంగాణ ప్రభుత్వ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని అందుకుంటుండటంపై..?

జ. మట్టిమనిషికి లభించిన మాణిక్యం ఈ పురస్కారం. తెలంగాణ వస్తే ఏమొస్తది అని ప్రశ్నించినవాళ్లకు ఈ అవార్డు ఒక సమాధానం. తెలంగాణ సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి, అవార్డుకు ఎంపికచేసిన పెద్దలకు కృతజ్ఞతలు.

ప్ర. మీ పాటలలో పాపులర్ పాట ఏదీ.?

జ. 'నాయనా- నాయనా నీ మట్టికాళ్లకు దండం పెడుతున్నా' అనే పాటతో నాన్న నిస్సహాయతను పాటరూపంలో చెప్పే ప్రయత్నం చేశా. ఇది చాలా పాపులర్ అయింది. ఆరుదశాబ్దాల వలసపాలకుల కాలంలో తెలంగాణలో తల్లిదండ్రుల బాధలను, నిస్సహాయతను ఆవిష్కరించిన పాట అది. ప్రస్తుతం మనం చూస్తున్న తెలంగాణ వెలుగుల తెలంగాణ.

నీటి కాలుష్యంపై పీసీబీ నజర్

- నదులు, కొలనులు, చెరువుల్లో నాణ్యత పరీక్షలు
- 43 ప్రాంతాల్లో శాంపిళ్ల సేకరణకు ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా నీటి కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి దృష్టిసారించింది. నీటి స్వచ్ఛతను పరిశీలించేందుకు పరీక్షలు నిర్వహించనున్నది. రాష్ట్రంలో 43 ప్రాంతాల్లో నీటి నాణ్యతను పరీక్షించేందుకు నదులు, పుణ్యక్షేత్రాల్లోని కొలనులు, కుంటలు, చెరువుల్లో పరీక్షలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి రాష్ట్ర పీసీబీ వర్గాలు ప్రతిపాదనలు పంపించాయి. ప్రతిపాదనలకు ఆమోదం ముద్ర పడితే, పరీక్షలకయ్యే వ్యయాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి భరించనున్నది.

నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించే ప్రాంతాలు:

నదులు ప్రవహించే ప్రాంతాలు: పాలేరు జలాశయం(ఖమ్మం), మున్నేరు వాగు-ప్రకాశ్‌నగర్ (ఖమ్మం), ఉదయసముద్రం రిజర్వాయర్ - పానగల్ (నల్లగొండ), మూసీనది -లంగర్‌హౌజ్(రంగారెడ్డి), మూసీనది - రుద్రవెల్లి బ్రిడ్జి (యాదాద్రి), అలీసాగర్ రిజర్వాయర్ - ఎల్లారెడ్డి (నిజామాబాద్), లోయర్ మానేర్ డ్యాం (కరీంనగర్), మానేరు రిజర్వాయర్- బైపాస్ రోడ్ (కరీంనగర్), సింగూరు జలాశయం(సంగారెడ్డి), నాగార్జునసాగర్ డ్యాం స్పిల్‌వే (నల్లగొండ)

ఐదు పుణ్యక్షేత్రాలు: వేములవాడ గుడి చెరువు (రాజన్న సిరిసిల్ల జిల్లా), కొండగట్టు కోనేరు (జగిత్యాల), యాదాద్రి కోనేరు (యాదాద్రి భువనగిరి), జోగులాంబ దేవాలయం (జోగులాంబ గద్వాల), ఏడుపాయల దుర్గాభవాని దేవాలయం (మెదక్).

చెరువులు, కుంటలు: పొచ్చెర జలపాతం(ఆదిలాబాద్), ఇబ్రహీం చెరువు- రాజేంద్రనగర్(రంగారెడ్డి), నెక్నాంపూర్ చెరువు (రంగారెడ్డి), కిష్టాయిపల్లి చెరువు జిన్నారం (సంగారెడ్డి), రాయంచెరువు -బొంతపల్లి(సంగారెడ్డి), కోమటిచెరువు (సిద్దిపేట), గడ్డపోతారం చెరువు-జిన్నారం (సంగారెడ్డి), ఉందాసాగర్ లేక్-శంషాబాద్ (రంగారెడ్డి), కాముని లేక్- శంషాబాద్‌లేక్ (రంగారెడ్డి), నాచారం పెద్దచెరువు (రంగారెడ్డి), ముల్లకత్వ చెరువు -హైటెక్‌సిటీ (రంగారెడ్డి), అమీన్‌పూర్ చెరువు (సంగారెడ్డి), రుద్రారం చెరువు-పటాన్‌చెరు (సంగారెడ్డి), మహబూబ్‌సాగర్ చెరువు- (సంగారెడ్డి), మత్తంగి చెరువు-పటాన్‌చెరు (సంగారెడ్డి), చిత్కుల్ ట్యాంక్- పటాన్‌చెరు (సంగారెడ్డి), లకుడారం చెరువు-పటాన్‌చెరు (సంగారెడ్డి), ఇస్నాపూర్ చెరువు - పటాన్‌చెరు (సంగారెడ్డి), యర్ధనూరు చెరువు(సంగారెడ్డి), మల్లేపల్లి చెరువు-కొండాపూర్ (సంగారెడ్డి), పాశమైలారం చెరువు- (సంగారెడ్డి), ముచ్చర్ల నాగారం చెరువు-(వరంగల్), కోటి చెరువు- హన్మకొండ(వరంగల్), రంగసముద్రం (వరంగల్)

డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాల్లో పురోగతి

రూ.3344 కోట్ల హడ్కో రుణం

రూ.595 కోట్ల రాజీవ్ స్వగృహ బకాయి చెల్లింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో తెలంగాణ సర్కారు చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో పురోగతి కనిపిస్తున్నది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 2,66,936 ఇండ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అన్ని విభాగాల సమన్వయంతో గృహనిర్మాణశాఖ కృషి చేస్తున్నది. నిర్మాణాల్లో జాప్యాన్ని నివారించేందుకు నిధుల సమీకరణపై దృష్టి పెట్టింది. కేంద్ర గృహనిర్మాణ పథకాల నుంచి రెండేండ్లలో రూ.242.11 కోట్లు మంజూరు కాగా.. మరో రూ.3344.76 కోట్ల రుణాన్ని హడ్కో నుంచి తీసుకున్నది. ఈ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందించడంతోపాటు సిమెంటు బస్తా ధర రూ.230గా నిర్ణయించింది. మూడేండ్లపాటు ఇదే ధరకు విక్రయించాలని సిమెంటు పరిశ్రమలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష ఇండ్లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గం పరిధిలో 1.66 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించనున్నది. గ్రామీణ ప్రాంతాల మాదిరిగా హైదరాబాద్‌లో ఇండ్ల నిర్మాణంకోసం ఎక్కువ స్థలం దొరకదు కాబట్టి.. మూడు నుంచి తొమ్మిది అంతస్తుల వరకు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద కట్టడాలకు వినియోగించే మైవాన్ టెక్నాలజీని వాడుకునేందుకు నిర్మాణ సంస్థలకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాజీవ్ స్వగృహ బకాయిల చెల్లింపు

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన రాజీవ్ స్వగృహ నిర్మాణ బకాయిలు అప్పటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా పేరుకుపోయాయి. 2009 నాటికి రూ.919.311 కోట్ల బకాయిలు, వడ్డీ రూ.124.106 కోట్లతో కలిపి మొత్తం రూ.1043.417 కోట్లు అయ్యాయి. కాగా ఈ మొత్తాన్ని రాష్ట్ర విభజన సమయంలో మన రాష్ట్రంపై మోపారు. ఈ మొత్తం నుంచి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.595కోట్లు చెల్లించింది. మిగతా బకాయిలను చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నది. పలు చోట్ల ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన రాజీవ్ స్వగృహ నిర్మాణాలు వృథాగా ఉన్నాయి. గత పాలకులు వీటిని వినియోగంలోకి తేవడంపై దృష్టి పెట్టకపోవడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. ఈ నేపథ్యంలో గృహనిర్మాణశాఖ పరిధిలో సమస్యల పరిష్కారంకోసం మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే విధంగా క్యాబినెట్ సబ్ కమిటీ కసరత్తు చేస్తున్నది. ప్రభుత్వంపై భారం తగ్గించడంతోపాటు ఆదాయం సమకూర్చుకునేందుకు కమిటీ సూచనలకు అనుగుణంగా గృహనిర్మాణశాఖ కార్యాచరణ ప్రారంభించింది. వివిధ కారణాలవల్ల ఆగిపోయిన జాయింట్ వెంచర్లలోని ఫ్లాట్లు, విల్లాల రిజిస్ట్రేషన్లను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఈ ఫ్లాట్ల అమ్మకం ద్వారా రూ.545కోట్లు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మీ సేవ కేంద్రం ఇక్కడుంది..!

సమీప కేంద్రం గుర్తింపునకు యాప్‌ను రూపొందిస్తున్న ఐటీశాఖ

మ్యాపింగ్ ద్వారా నాలుగు వేల కేంద్రాల అనుసంధానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడానికి టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఐటీశాఖ మరో కీలక నిర్ణయం తీసుకున్నాయి. ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించడంతోపాటు వాటిని చేరవేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు చర్యలు చేపడుతున్నాయి. మీ సేవ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సేవలను ప్రజలకు అత్యంత వేగంగా.. సులభంగా అందిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజల అభిప్రాయాల మేరకు వారి ఇబ్బందులను తొలిగించేందుకు ఐటీశాఖ మరిన్ని చర్యలు చేపడుతున్నది. కొత్త ప్రాంతాలకు వెళ్లిన వారికి మీ సేవ కేంద్రాన్ని గుర్తించడంలో ఇబ్బందులు తలెత్తకుండా సరికొత్త యాప్‌ను రూపొందించారు. వినియోగదారులు తాము ఉన్న ప్రాంతానికి సంబంధించిన లొకేషన్‌ను యాప్‌లో ఎంటర్ చేసి.. సర్చ్ చేస్తే అక్కడికి సమీపంలో ఉన్న మీ సేవ కేంద్రం వివరాలు తెలుస్తాయి. అలాగే కస్టమైజ్డ్ సెర్చ్ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఏ ప్రాంతంలోని మీ సేవ కేంద్రం వివరాలైనా తెలుసుకునే అవకాశం ఉంటుంది. త్వరలోనే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఐటీశాఖ అధికారులు చెప్తున్నారు. రాష్ట్రంలోని నాలుగువేల మీ సేవ కేంద్రాలను మ్యాపింగ్ ద్వారా అనుసంధానిస్తున్నామని, యాప్ సహాయంతో వాటి సేవల వివరాలు, చిరునామాలను పొందవచ్చని వివరించారు.



ఆల్మట్టి డ్యాం(ఫైల్)

కర్ణాటక నీటి విడుదలపై ఉత్కంఠ

- ఆల్మట్టికి వరద తగ్గుతుండటంతో తర్జనభర్జన
- సంప్రదింపులు ముమ్మరంచేసిన తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా బేసిన్‌లో నెలకొన్న సంక్లిష్ట పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది. ముఖ్యంగా హైదరాబాద్, నల్లగొండ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కర్ణాటకతో సంప్రదింపులు కొనసాగిస్తున్నది. ఆల్మట్టికి గత కొన్నిరోజులుగా ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం పట్టడంతో తొలుత సానుకూలంగా ఉన్న కర్ణాటక ఇప్పుడు తర్జనభర్జనలు పడుతున్నదంటూ వస్తున్న వార్తలతో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కర్ణాటకతో సంప్రదింపులను మరింత ముమ్మరం చేసింది.

రాష్ట్రంలో ఇదీ పరిస్థితి..

ఈ సంవత్సరం ఆశించిన వర్షాలు లేక నాగార్జునసాగర్ నీటిమట్టం 500.4 అడుగులకు చేరింది. ఈ స్థాయిలో హైదరాబాద్ నీటికి ఆధారమైన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసే పరిస్థితి ఉండదు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ముందుచూపుతో పుట్టంగండి వద్ద కృష్ణా అత్యవసర మోటార్లను ఏర్పాటు చేసి ప్రస్తుతానికి 400 క్యూసెక్కుల నీటిని ఏఎమ్మార్పీ అప్రోచ్ చానెల్‌లో పోస్తున్నది. దీనికితోడు ప్రాజెక్టులో ఒక మోటారు నడుపుతూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పోస్తున్నది. మొత్తానికి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 520 క్యూసెక్కులను సర్దుతున్నారు. అయితే నల్లగొండ, దాని పరిధిలోని 230కి పైగా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే ఉదయసముద్రం పరిస్థితే దయనీయంగా మారింది. ప్రస్తుతమున్న నిల్వ 10–12 రోజులకు సరిపోతుందంటున్నారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం పెరిగితే ఉదయసముద్రంకు నీరు ఇవ్వవచ్చు.

కర్ణాటక నీటికోసం యత్నం..

రాబోయే సమస్యను ముందే గుర్తించిన మంత్రి హరీశ్‌రావు నారాయణపూర్ రిజర్వాయర్‌నుంచి 15 టీఎంసీల నీరు విడుదల చేయాలని కర్ణాటక జల వనరులశాఖ మంత్రి పాటిల్‌కు లేఖ రాశారు. దీనికి అక్కడ సానుకూల వాతావరణం కనిపించింది. ఎన్సెస్పీ చీఫ్ ఇంజినీర్ సునీల్ అక్కడికి వెళ్లి జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, కృష్ణా భాగ్య జల్‌నిగమ్ బోర్డు ఎండీని కలిసి ఇక్కడి పరిస్థితిని వివరించారు. అన్ని వివరాలు సేకరించిన తర్వాత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తాగునీటి అవసరాలు కాబట్టి గెజిట్ కూడా జారీ చేయాల్సిన అవసరంలేదనే అభిప్రాయానికీ అక్కడి అధికారులు వచ్చారు. అయితే ఈలోగా ఆల్మట్టికి ఇన్‌ఫ్లోలు తగ్గిపోవడంతో నీటి విడుదల ప్రక్రియ కొంతమేర నెమ్మదించినట్లు తెలిసింది. ప్రస్తుతం నీటి విడుదల అంశం కర్ణాటక ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిసింది.

సెటిల్మెంట్ పోలీసులపై కొరడా

- భూ దందాలో ఇరుక్కున్న రాయదుర్గం అదనపు డీసీపీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్.. కేసు నమోదు
- 16 గంటలపాటు బాధితుడి నిర్బంధం.. బలవంతంగా చెక్కులపై సంతకాలు
- సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్యను కలిసి గోడు వెళ్లబోసుకున్న బాధితుడు
- మాదాపూర్ ఏసీపీ ఆధ్వర్యంలో విచారణ



డీసీపీ పులిందర్‌రెడ్డి



ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్



ఎస్సై రాజశేఖర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భూదందాలో ఓ బాధితుడిని బలవంతంగా నిర్బంధించి, చెక్కులు, తెల్లకాగితాల మీద సంతకాలు తీసుకొని ప్రైవేట్ సెటిల్మెంట్ చేసిన పోలీస్ అధికారులపై ప్రభుత్వం కొరడా ఝులిపించింది. బాధితుడు శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యను కలిసి గోడు వెళ్లబోసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సీపీ ఆదేశాలతో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం పీఎస్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ పుప్పాల్‌గూడకు చెందిన అబుబాకర్, అబ్దుల్లా, అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్యరెడ్డి కలిసి సంగారెడ్డి జిల్లా ముత్తంగి ప్రాంతంలో ఉన్న 2.27 ఎకరాల స్థలాన్ని రూ.1.10 కోట్లకు అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసుకున్నారు. ముగ్గురూ కలిసి అడ్వాన్స్ కింద రూ.10 లక్షలు చెల్లించారు. మిగితా రూ.కోటి చెల్లింపునకు 45 రోజుల గడువు తీసుకున్నారు. గడువు తీరడంతో స్థల యజమాని ఆ భూమిని గంగాధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి అనే వ్యక్తులకు అమ్మేశారు. అయితే అబుబాకర్ తమను మోసం చేశాడని, అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసుకున్న స్థలాన్ని యజమాని ద్వారా వేరే వారికి అమ్మేసి కమీషన్ తీసుకొని నమ్మక ద్రోహం చేశాడని జూలై నెలలో ఐశ్వర్యరెడ్డి రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి గత నెల 25వ తేదీన అబుబాకర్ ఇంటికి వెళ్లి తమకు రావాల్సిన డబ్బు ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని హెచ్చరించారు. మరుసటి రోజు (26వ తేదీన) ఉదయం 6 గంటలకు పోలీసులు అబుబాకర్‌ను ఇంటి నుంచి తీసుకొచ్చి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. రాత్రి 10 గంటల సమయంలో అతడితో ఐదు చెక్కులపై రూ.60 లక్షలకు సంతకాలు చేయించుకున్నారు. అతని వద్ద ఉన్న రూ.49 వేల నగదును కూడా లాగేసుకున్నారు. కొన్ని ఖాళీ కాగితాల మీద సంతకాలు చేయించుకొని వదిలిపెట్టారు. బాధితుడు అబుబాకర్ శనివారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యను కలిసి జరిగిన వ్యవహారం గురించి వివరించారు. ఐశ్వర్యరెడ్డి తమకు నగదును ఇవ్వకున్నా స్నేహితురాలు కావడంతో అగ్రిమెంట్ ఆఫ్ సేల్‌లో ఆమె పేరును చేర్చామని, అడ్వాన్స్ ఇచ్చామని, వచ్చిన ఆదాయంలో ముగ్గురం పంచుకునేలా ఒప్పం దం కుదుర్చుకున్నామని చెప్పారు. గడువు తీరడంతో డిఫాల్ట్ అయ్యామన్నారు. కానీ ఐశ్వర్యరెడ్డి తండ్రి పులిందర్‌రెడ్డి తనను బెదిరించి, కిడ్నాప్ చేసి రూ.60 లక్షలు ఇవ్వాలని రాసుకున్నాడని వివరించారు.

విచారణాధికారిగా ఏసీపీ రమణకుమార్

ఈ ఘటనపై దర్యాప్తు బాధ్యతలను సీపీ సందీప్ శాండిల్య మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ అప్పగించగా, ఆయన మాదాపూర్ ఏసీపీ రమణకుమార్‌ను విచారణకు ఆదేశించారు. బాధితుడు అబుబాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సై రాజశేఖర్‌తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీసీపీ తెలిపారు. నిందితులపై సెక్షన్ 447 (అనుమతి లేకుండా ఇంట్లోకి ప్రవేశించడం), 365 (కిడ్నాప్), 384(బెదిరింపులకు పాల్పడి చెక్కులపై సంతకాలు తీసుకోవడం), 452 (అక్రమంగా నిర్బంధించడం), 147,149ల కింద కేసు నమోదు చేశారు. వీరికంటే ముందు ఆ స్థలాన్ని ముజీబ్ అనే వ్యక్తి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసుకొని రూ.10 లక్షలు అడ్వాన్స్ చెల్లించారని, డిఫాల్ట్ అయ్యాడని చెప్పారు. కేసు విచారణలో భాగంగా ప్రధాన నిందితులతోపాటు అగ్రిమెంట్ ఆఫ్ సేల్‌లో ఉన్నవారందరినీ విచారిస్తామని స్పష్టం చేశారు.

పరిధి కాకున్నా సెటిల్మెంట్.. డీవీఆర్ సీజ్

ఈ వ్యవహారంలో రాయదుర్గం పోలీసులు, రాచకొండ పోలీసు కమిషనరేట్ ఏఆర్ పులిందర్‌రెడ్డి పరిధి దాటారని స్పష్టమవుతున్నది. వివాదాస్పద స్థలం సంగారెడ్డి జిల్లా ముత్తంగి ప్రాంతం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. కాబట్టి ఐశ్వర్యరెడ్డి అక్కడ ఫిర్యాదు చేయాల్సి ఉంది. కానీ ఆమె తండ్రి అదనపు డీసీపీ కావడంతో.. అధికార బలంతో రాయదుర్గం పీఎస్‌లో కేసు నమోదు చేయించారు. దీంతో నిందితుల కుట్ర బహిర్గతమైంది. విచారణలో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు రాయదుర్గం పీఎస్‌లోని సీసీ కెమెరాల పుటేజీలను భద్రపరిచే డీవీఆర్‌ను సీజ్ చేశారు. జూలై 26న బాధితుడు అబుబాకర్‌ను ఉదయం 6 గంటలకు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, ఆ రోజు రాత్రి 10 గంటల వరకు స్టేషన్‌లో ఉంచిన దృశ్యాలు అందులో రికార్డయ్యి ఉన్నాయి. దీంతో నిందితులు వాటిని తొలిగించకుండా ఉండేందుకు పోలీస్ ఉన్నతాధికారులు డీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు కాగానే బాధితుడు అబుబాకర్ నుంచి బలవంతంగా రాయించుకున్న రూ.60 లక్షలు విలువ చేసే చెక్కులను నిందితులు తిరిగి ఇచ్చేశారని విచారణాధికారి మాదాపూర్ ఏసీపీ రమణకుమార్ తెలిపారు. ఈ వ్యవహారంలో పలువురు కానిస్టేబుళ్ల ప్రమేయం ఉన్నట్టు సమాచారం. ఏసీపీ నివేదిక అనంతరం ప్రధాన నిందితులతోపాటు, మిగతా నిందితుల అరెస్టులు, శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలుస్తున్నది.

రాష్ట్రానికి పెరుగనున్న కంపా నిధుల వాటా

- త్వరలో కొత్త మార్గదర్శకాలు
- తక్షణం 30 శాతం వాటా ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: అటవీభూములకు బదులుగా ఆయా సంస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించే నష్టపరిహారంపై కేంద్ర ప్రభుత్వం ఆధిపత్యం చాలా వరకు తగ్గనున్నది. తద్వారా రాష్ట్ర వాటా కింద వచ్చే నిధులు పెరుగనున్నాయి. కాంపెన్సేటరీ అండ్ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కంపా) కింద జమైన నిధులను ఆయా రాష్ట్రాల ఖాతాల్లో నేరుగా వేయడానికి వీలుగా కేంద్రం చట్టాన్ని చేసింది. ఏటా విడుదల చేసే నిధుల వాటాను కూడా పెంచడానికి కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నది. ఇప్పటివరకు జమైన మొత్తంలో కేవలం 10 శాతం నిధులు కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయిస్తున్నది. త్వరలో విడుదల కానున్న కొత్త మార్గదర్శకాల ప్రకారం అది 30 నుంచి 40 శాతానికి పెరుగనున్నది. కంపా కింద జమైన నిధుల్లో తమకు రావాల్సిన వాటాను వెంటనే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరింది. తమ వాటా కింద రూ.162 కోట్లు రావాలని అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగురామన్న కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు తెలిపారు. కొత్త మార్గదర్శకాలు వచ్చే వరకు 30 శాతం నిధులను ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు రూ.50 కోట్లు మాత్రమే విడుదల చేశారని మంత్రి కేంద్రానికి తెలియజేశారు. వెంటనే మిగిలిన నిధులను విడుదల చేయడంతోపాటు పెరుగనున్న వాటా ప్రకారం కనీసం రూ.300 కోట్లను మంజూరు చేయాలని కోరారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హర్షవర్ధన్ హామీ ఇచ్చారు.

కంపాలో తెలంగాణ నిధులు రూ.1,620 కోట్లు

వాస్తవానికి సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలు, ఇతర అవసరాలకు.. వ్యక్తులైనా, సంస్థలైనా, ప్రభుత్వాలైనా అటవీభూములను సేకరిస్తే 'కంపా' చట్టం కింద భారీ నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఇందులో ఎలాంటి మినహాయింపు లేదు. క్షీణించిన (డీగ్రేడెడ్ ఫారెస్ట్) అడవుల్లో ఒక హెక్టారు భూమికి రూ.6 లక్షలు, రిజర్వ్‌ఫారెస్ట్‌కు రూ.8 లక్షలు, దట్టమైన అడవుల్లో రూ.10 లక్షల చొప్పున నెట్ ప్రాఫిట్ వాల్యు కింద చెల్లించాల్సి ఉంటుంది. ఇలా తెలంగాణ ఖాతాలో రూ.1,620 కోట్లు జమయ్యాయి.

మార్గం చూపిన ములకలకాలువ

- 10 రోజుల్లో భూరికార్డుల నవీకరణ
- సీఎం ప్రకటనతో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక
- రైతులతో గ్రామ సభల నిర్వహణ
- రైతుల సమక్షంలో రికార్డుల ప్రక్షాళన
- 666 ఖాతాల్లో 492 పక్కా ఖాతాలుగా నిర్ధారణ
- మంగళవారం నుంచి ఇంటింటికి స్టిక్కరు- 1(బి) రికార్డుల పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ములకలకాలువలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు.. (ఇన్‌సెట్) సర్వే స్టిక్కర్



ములకలకాలువ గ్రామం

ములకల కాలువ ముందడుగు వేసింది. భూమి రికార్డుల నవీకరణ (ప్యూరిఫికేషన్)ను కేవలం 10 రోజుల్లో పూర్తి చేసి, రెవెన్యూ రికార్డులలో తప్పులు లేని గ్రామంగా నిలిచింది. సీఎం కే చంద్రశేఖర్‌రావు తలపెట్టిన భూ సమగ్ర సర్వే అమలుకు మార్గం చూపించింది. రైతులు, అధికారుల పరస్పర సహకారంతో సర్వే నిర్వహించి గ్రామంలో ఉన్న 666 ఖాతాల్లో 492 పక్కా ఖాతాలుగా నిర్ధారించారు. మంగళవారంనుంచి గ్రామంలో కొత్త రికార్డులు పంపిణీ చేయబోతున్నారు. భూసమగ్ర సర్వేకింద మిర్యాలగూడ డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ములకల కాలువతో పాటు మరిన్ని గ్రామాల్లో సర్వే విజయవంతంగా పూర్తవుతున్నది.

ఇలా మొదలైంది..

రాష్ట్రంలో భూ రికార్డుల జమాబందీ ఎప్పుడో నిజాం కాలంలో జరిగింది. ఆ తర్వాత నవీకరణ జరుపలేదు. దీనితో భూమి ఎవరి చేతుల్లోఉంది? రికార్డులో ఎవరి పేరు ఉంది? అన్నది గజిబిజిగా మారింది. రైతుల ఖాతాల నిర్వహణ అధ్వానంగా ఉంది. వచ్చే ఏడాది నుంచి రైతులు సాగుచేసే భూమికి ఎకరానికి రూ.8 వేలు పెట్టుబడి ఇస్తున్న నేపథ్యంలో భూ రికార్డులన్నీ నవీకరించేందుకు సమగ్ర భూసర్వే చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు మిర్యాలగూడ డివిజన్ రెవెన్యూ అధికారులు పైలట్ ప్రాజెక్టుగా ములకలకాలువ గ్రామాన్ని ఎంచుకున్నారు. ఆగస్టు 1 నుంచి తహసీల్దార్ మాలి కృష్ణారెడ్డి, వీఆర్వో సతీశ్ గ్రామ రైతుల సహకారంతో ఇంటింటా సర్వే నిర్వహించి అనంతరం గ్రామసభ జరిపారు. 10 రోజుల వ్యవధిలో రికార్డులను పూర్తి స్థాయిలో నవీకరించి భూమి రికార్డుల్లో తప్పులు లేని గ్రామంగా (ఎర్రర్ ఫ్రీ విలేజ్)గా ప్రకటించారు. మంగళవారం నుంచి భూమి యజమాన్య హక్కులు కల్పించే 1(బి) పట్టా సర్టిఫికెట్ ఇస్తూ, ఇలా సర్టిఫికెట్ ఇచ్చిన ప్రతి ఇంటికి భూమి రికార్డు నవీకరణ జరిగిందని తెలిపే స్టిక్కర్‌ను అంటించాలని నిర్ణయించారు. ఇదే విధంగా కిష్టాపురం, గోగువారిగూడెం, కొత్తగూడెం, కాల్వపల్లి, నర్సింహులుగూడెం,యాద్గార్‌పల్లి గ్రామాల్లో కూడా నవీకరణ జరుగుతున్నది.

రికార్డుల నవీకరణ ఇలా.....

ములకలకాలువ గ్రామ రికార్డుల నవీకరణకు 1954–55 సంవత్సరం కాస్ర పహణీ ఆన్‌లైన్ పహణీ ప్రింట్‌ను, మ్యానువల్ రికార్డును తీసుకున్నారు. వీటిని పోల్చినపుడు కొన్ని సర్వే నంబర్లలో ఉన్న భూమి కంటే రికార్డులో ఎక్కువగా ఉంది. కొన్ని చోట్ల తక్కువగా ఉన్నది. ఇలా 53 సర్వేనంబర్లలో తేడాలు గుర్తించారు. తరువాత వీఆర్వో ప్రతి రైతు ఇంటికి వెళ్లి పాస్ పుస్తకాలు సేకరించారు. దీనితో పాటు వారికున్న భూమి ఎంత? వారసత్వంగా వచ్చింది ఎంత? కొనుగోలు చేసింది ఎంత? కొనుక్కున్న భూమి రిజిస్టర్ చేసుకున్నారా? లేదా? వంటి వివరాలు కూడా నమోదు చేశారు. వీటన్నింటిని క్రోడీకరించినపుడు రికార్డుల్లోని అక్షర దోషాలు, సర్వే నెంబర్లలో పొరపాట్లు, భూమిని విక్రయించిన తర్వాత కూడా పాతఖాతా కొనసాగడం, భూమిని కొన్న రైతు అనుభవదారుడిగానే ఉండటం వంటి తప్పులు బయటపడ్డాయి. ఆర్డీఓ, ఎమ్మార్వో, ఆర్ఐ, వీఆర్వోలు రైతులతో గ్రామ సభ నిర్వహించి సరి చేసిన రికార్డులను వారిముందు వినిపించారు. 20 నుంచి 30 మంది రైతులను ర్యాండమ్‌గా తీసుకొని భూవివరాలు అడిగి రికార్డులను నిర్ధారించుకున్నారు. భూ రికార్డుల నవీకరణకు ముందు ఆన్‌లైన్‌లో 666 ఖాతాలు, మ్యానువల్ పరిశీలనలో 558 ఖాతాలు ఉండేవి. అధికారుల సర్వేలో వాస్తవ రైతుల ఖాతాలు 492 మాత్రమేనని వెల్లడైంది..గ్రామ సభలో వాటికి రైతుల ఆమోదం పొంది రికార్డుల నవీకరణను ఖరారు చేశారు. ఈ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. యజమాన్య హక్కులను ధ్రువీకరించే 1(బి) పట్టాలకు రెండేసి ప్రింట్లు తీయించారు. మంగళవారం నుంచి ఇంటింటికి తిరిగి ఇందులో ఒక పట్టాను రైతుకు ఇచ్చి... మరో పట్టా కాగితంపై సంతకం తీసుకొని కార్యాలయంలో భద్రపరుచనున్నారు.

ములకలకాలువ ముఖచిత్రం

- గ్రామంలో మొత్తం భూమి 1260 ఎకరాల 37 గుంటలు
- సాగయ్యే భూమి 881 ఎకరాల 24 గుంటలు
- సాగు కాని భూమి 379 ఎకరాల 13 గుంటలు
- ప్రభుత్వ భూమి 116 ఎకరాల 18 గుంటలు
- గ్రామకంఠం 15 ఎకరాల 21 గుంటలు
- నది, వాగులు, చెరువుల కింద భూమి188 ఎకరాల 15 గుంటలు

జమాబంది జరుగకే సమస్య



1983–84 వరకు ఏటా రైతు సమక్షంలో జమాబంది జరిగేది. భూమిని కొనుక్కున్నా... అమ్ముకున్నా రికార్డుల్లోకి ఎక్కేది. కానీ పట్వారి వ్యవస్థ రద్దు అయిన తరువాత జమాబందీ లేకుండా పోయింది. దీంతో రికార్డుల నవీకరణ జరుగలేదు. ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డులకు డిలిట్ ఆప్షన్ లేకపోవడం మరో సమస్యగా మారింది. దీనితో రైతు భూమిని పూర్తిగా అమ్మిన తరువాత అతని ఖాతా డిలీట్ కాదు. భూమి లేకున్నా ఆ ఖాతా ఉంటుంది. ఆన్‌లైన్‌లో భూమి ఉన్నట్లు చూపిస్తుంది. ఇంకో వైపు ఒక భూమి లావాదేవీ 2017లో జరిగినా ఆన్‌లైన్‌లో 2007 చూపిస్తున్నది. ఇదో సాంకేతిక సమస్య.

– మిర్యాలగూడ ఎమ్మార్వో మాలి కృష్ణారెడ్డి

చానా సంతోషంగుంది



ఎప్పటి నుంచో భూమిని సాగు చేస్తున్నగాని పట్టా లేదు. రుణం తెచ్చుకుందామంటే బ్యాంకు ఇయ్యక ఇబ్బందులు పడ్డ. ఇప్పుడు అధికారులు సర్వే చేసి భూమి నీకు ఎట్లా వచ్చింది, కబ్జాలో నువ్వే ఉన్నావా అని విచారించి పట్టా ఇచ్చిండ్రు. చానా సంతోషంగా ఉన్నది.

– చింతలచెర్వు వెంకన్న, రైతు

నా భూమి రికార్డులోకి ఎక్కింది



భూమి మీద నేనే కబ్జాల ఉన్న. కంప్యూటర్ పహణీ లేక కష్టాలు పడ్డ. రాత పహణీ ఉన్నాగాని బ్యాంకులకు పోతే కంప్యూటర్ పహణీ అడుగుతరు. దానికోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా పనికాలేదు. ఇపుడు సర్వే చేసి కంప్యూటరులో నా భూమిని నమోదు చేసినరు.

– జానిపాషా, రైతు



ప్రేమలో ఇద్దరు, ఏకాంతంగా..
ప్రపంచం నుంచి విడివడి ..
ఎంత సుందరమో!

మిలన్ కుందేరా

కవి సంధ్య



ఎప్పుడో ఓసారి
జ్ఞాపకాలను నెమరేసుకోవాలి
కాలం పేజీలన్నింటిని
వెనుకకు తిప్పిచూసుకోవాలి!

తగిలిన గాయాల్ని
మానిన మరకల్ని
తడిమి తడిమి చూసుకోవాలి
బాధనట్లా భద్రపరుచుకోవాలి!

చేరిన ఎత్తుల్నీ
చిందిన స్వేదాన్నీ
పొందిన ఫలాన్నీ
మననం చేసుకోవాలి!

తలనిమిరిన వాళ్ళనీ
భుజం తట్టిన వాళ్ళనీ
జారిపోతున్నప్పుడు చేయూతనిచ్చిన వాళ్ళనీ
కొంతసేపు కళ్ళకద్దుకోవాలి!

ఉడికిపోయిన వాళ్ళనీ
అసూయతో కుళ్ళిపోయినవాళ్ళనీ
కనిపించినప్పుడల్లా
మనసారా నమస్కరించుకోవాలి!

జీవితంలో పూలనే కాదు రాళ్ళను ముల్లను ప్రేమించాలి
అవి జ్ఞానదంతాలవంటివి
తాత్కాలికంగా బాధించినా పాఠాన్ని బోధిస్తాయి!


నలుగుట్ల కూర్చొని
మనసు విప్పినప్పుడల్లా
ఎదురుగుండేవాళ్ళు ఎదలోనుండే వాళ్ళు
గుండెల్లో నిద్రిస్తానున్నవాళ్ళూ ప్రత్యక్షమవుతారు!

నా జీవితాదర్శం
ఒక అంచనాకు రావాడానికి
నీవు ఎదిగావో దిగజారావో
నీకు మరొకరు చెప్పాలా?

నడిచొచ్చిన దారి
అద్దమై ఎదురొస్తది
ముఖం ముద్దుగుంటే
అది అద్దం గొప్పతనం కాదు!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 94402 33261
(9-7-17 సాహిత్య అకాడమీ
'కవిసంధ్య'లో పాల్గొన్న అనుభూతితో)

వెన్నెల్లో..



తెల్లని బొండుమల్లె తీగ
కిటికీలోంచి కైవారగా చూస్తోంది

నా గుండె గదిలో దాని
పరిమళం ఆకాశమంత
పరచుకుంది
వెన్నెల రేయికి తన
తావుల్ని
గంధంగా పులమాన!
ఆరవిచ్చిన మల్లెల రేకులను
జాబిలికి కానుకగా ఈయనా!!

నక్షత్ర కాంతిలో
నవ్వుతున్న నా నవ జవ్వనికి
మమతల మల్లెల మధువులనొంచనా!
తూరుపు సింధూరమై
వడలిన మల్లెలకి మదిలో కైమోడ్పులందించనా!!

- ధనరాజ జ్ఞానేశ్వర్, 94905 42185

అభినవ కాళిదాసు కృష్ణమాచార్యులు

శ్రీ శిరిశిన హల్ కృష్ణమాచార్యులు తొలి తెలంగాణ శతావధానిగా పేర్కొనవచ్చు. ఆయన 1929లో 'కళాశాలాభ్యుదయం' అనే కవితా సంపుటిని వెలువరించారు. అపారమైన పాండిత్యం, అనర్గళమైన వాక్చాతుర్యం కలిగిన తొలితరం కవికులజుడు, విశిష్టాద్వైతావలంబికులు శిరిశిన హల్ కృష్ణమాచార్యులు నిజాం రాజ్య తొలి శతావధానిగా పేరొందారు.

ఈయన నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్ గ్రామంలో వేంకటాచార్యులు,రంగనాయకమ్మ దంపతులకు 1905 ఆగస్టు, 13న జన్మించారు. వీరి పితామహులు పెద్దపల్లి నుంచి మోర్తాడ్‌కు వలసవెళ్లారు. వీరి తాతగారైన సింగరదేశికులు ఆచార్యులకు ఐదవ ఏటనే ఉపనయనం గావించారు. వీరి జన్మ కుండలిలోని గ్రహస్థితిని పరిశీలించి, 'పుత్రులకు, శిష్యులకు విశేషాభివృద్ధి కల్గునని' భవిష్యవాణి వినిపించారట. వారన్నట్లుగానే కొడుకులను గొప్ప పండితులుగా తీర్చిదిద్దారు. ఆధ్యాత్మిక, సాహితీరంగంలో వారి జీవితాన్ని సాఫల్యం చేసుకున్నారు.

కృష్ణమాచార్యులు శతావధానిగా అనేక అవధాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయనకు తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాల్లో అనేకమంది శిష్యులున్నా రు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామంలో విశాలమైన 'గడీ'లో పొనుగోటి మంగారావు దేశ్‌ముఖ్ నివసిస్తుండేవాడు. కృష్ణమాచార్యుల అసమానమైన పాండిత్యానికి అబ్బురపడి తన గడీకి ఆహ్వానించి తన కూతురు ఆనందమాంబకు సంగీతం, సాహిత్యం, సంస్కృత భాషలందు ప్రవీణురాలును చేయవలసిందిగా కోరాడు. అందుకు అంగీకరించిన ఆచార్యుల వారు మూడు నెలలు గడీలోనే ఉండి, సంగీతం, సాహిత్యం, సంస్కృతం, శతావధాన ప్రక్రియల యందు నిష్ణాతురాలిని చేశాడు. చల్‌గల్ గడీ దేశ్‌ముఖ్ అయిన శ్రీ ధర్మ జలపతిరావు గారి సమక్షంలో జగిత్యాలలో ఆనందమాంబ గారిచే 'అష్టావధానం' నిర్వహించినట్లు తన స్వీయ చరిత్రలో ఆచార్యుల వారు పేర్కొన్నారు. ఆనందమాంబ 'సతీలలామ'అను మొదటి స్త్రీవాద కావ్యం రచించినట్లు తెలుస్తున్నది.

కృష్ణమాచార్యులు ఆదిలాబాద్, నిర్మల్, కోరుట్ల, ఆర్మూర్, మోర్తాడ్, మెట్‌పల్లి మొదలైన ప్రాంతాల్లో పురాణ కాలక్షేపం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవాడు. ప్రతి చోట ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కృష్ణమాచార్యులు రాసిన గ్రంథాలు మహాకవి కాళిదాసును అనుకరించినట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా కాళిదాసు విరచితములైన రఘువంశం, మేఘసందేశం, కుమారసంభవంలను అనుసరిస్తూ గురువంశం, మనఃసందేశం, సంపత్కుమార సంభవం వంటి కావ్యాలను రచించారు. అందుకనే ఆయనను 'అభినవ కాళిదాసు' అని సాహితీ అభిమానులు పిలుచుకుంటారు. అంతేగాక 'ఆంధ్ర మహా నాటకం' పేరుతో హనుమత్ చరిత్ర, గాంధీతాత నీతి శతకం, మనోజ విజయభాణ వంటి సంస్కృత కావ్యాలు రచించారు.

నిజానికి ఆయన పండితులకే పండితుడు. కాళిదాసు అంతటివాడు. ఆంధ్ర వలసపాలకుల ఆధిపత్యంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అణచివేతకు గురై ఆచార్యుల వంటి ఉద్ధండ పండితులు మరుగన పడ్డారు. నిజాం రాజ్యంలో తెలుగు, సంస్కృత భాషలకు అంతగా ప్రాధాన్యం లేదనే విషయం తెలిసిందే. తెలంగాణ సిద్ధించిన ప్రస్తుత తరుణం లో ఆయన రచనలు వెలికితీసి పాఠ్య పుస్తకాల్లో చేర్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

ఆంధ్రమహా నాటకం అను కావ్యానికి విశేషమైన నేపథ్యం ఉన్నది. ఈ కావ్యాన్ని స్వయానా హనుమంతుడు రాసెనని, దీన్ని రాతి ఫలకలపై చెక్కి, సముద్రంలో వేశారని ప్రతీతి. సముద్ర స్నానానికి వెళ్లిన భోజ మహారాజు వాటిని కనుక్కొని వెలికితీయించగా 'మిశ్రదామోదరుడు' అను పండితుడు గ్రంథస్థం చేసి, ప్రచారానికి తెచ్చినట్లు తెలుస్తున్నది. ఇంతటి మహత్తరమైన కావ్యాలను రచించిన కృష్ణమాచార్యులు తెలంగాణ వాసి అవడం మన అదృష్టం!

కరీంనగర్ జిల్లా గురించి తన 'కళాశాలాభ్యుదయం' కావ్యంలో ఇలా చెప్పారు...

కందం: **'కరివర వరదను భక్తా**
కరమగుటన్ ప్రాంత భూప కమనీయ భజత్
కరకం నికరములను గన
కరినగరం బనగ సాక్షికమై యొప్పున్..'

భావం: కరి వరదుడగు హరిభక్తులకు ఆవాసమట కరీంనగర్. అంతేగాక కరములు గలది. కరికరములు అంటే పన్నులు, రాజుకు పన్నులు చెల్లించే సంపన్నులు గలది గనుక కరీంనగరమని పేరు.

పెద్దపల్లిలోని నంబులాద్రి నరసింహస్వామి వారి కుల దైవం. కావ్యారంభంలో స్వామి వారి స్మరణతో రచనకు ఉపక్రమించేవారు. తన ప్రథమ పుత్రునకు నంబులాద్రి ఆచార్యులుగా నామకరణం చేశారు. నంబులాద్రి గారు హరికథా విశారదులుగా రాష్ట్రంలో అనేక చోట్ల హరికథా కాలక్షేప కార్యక్రమాలు నిర్వహించేవారు. ద్వితీయ కుమారులు సంపత్కుమారాచార్యులు విద్యాలయం నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. తృతీయపుత్రుడు వేంకటాచార్యులు కూడా అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. నాలుగోవాడు నర్సింహమూర్తి సంప్రదాయ విద్యాకోవిదుడు, సంస్కృత పండితుడు. ఐదవ వాడు శ్రీనివాసులు విదేశాల్లో స్థిరపడ్డాడు. కూతుళ్లు రమామణి గూర్చి సమాచారం లేదు. క్షమామణి ఉపాధ్యాయినిగా సేవలందించి, పదవీ విరమణ పొందారని తెలిసింది.

ఉభయ వేదాంతిగా, నిజాం రాజ్య తొలి శతావధానిగా, సంస్కృతాంధ్రంలో మహా పండితుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, అభినవ కాళిదాసుగా కీర్తిగడించిన శిరిశిన హల్ కృష్ణమాచార్యులు 1992 ఏప్రిల్, 15న తన 86వ ఏట పరమపదించారు.

నిజానికి ఆయన పండితులకే పండితుడు. కాళిదాసు అంతటివాడు. ఆంధ్ర వలసపాలకుల ఆధిపత్యంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అణచివేతకు గురై ఆచార్యుల వంటి ఉద్ధండ పండితులు మరుగన పడ్డారు. నిజాం రాజ్యంలో తెలుగు, సంస్కృత భాషలకు అంతగా ప్రాధాన్యం లేదనే విషయం తెలిసిందే. తెలంగాణ సిద్ధించిన ప్రస్తుత తరుణంలో ఆయన రచనలు వెలికితీసి పాఠ్య పుస్తకాల్లో చేర్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

వీరి గ్రంథాలపై డాక్టర్ సముద్రాల శ్రీనివాసాచార్య గారు 'కృష్ణమాచార్యులు శతావధాని-తెలుగు రచనలు-పరిశీలన' అను పరిశోధన గ్రంథం ప్రచురించి డాక్టరేట్ పొందారు.

- మల్లారపు రాజు, 90149 25716
(ఆగస్టు 13న
శిరిసిన హల్ కృష్ణమాచార్యులు జయంతి)

మంచుతెరలు తొలిగాక..

మంచిదారిని తిరస్కరించాక
ఇక మిగిలింది చెడ్డదారే తప్ప మధ్యంతర మార్గాలుండవు..
మంచివైపో.. చెడువైపో.. స్థిరంగా నిలబడాలి
మనిషికి స్పష్టత కావాలి
మంచో.. చెడో.. తామెంటువైపో ఇతమిద్ధంగా నిర్ణయించుకోలేని
మధ్యంతర మనుషులే ఇప్పుడంతా..!
మంచివైపు నిల్చుంటే చెడ్డవారితో ఇబ్బందనే
మధ్యంతరపు ఊగిసలాటే ఇప్పుడంతా..
అలాగని.. తాము పూర్తిగా చెడు బృందంలో ఉన్నామని
అనిపించుకోవడం ఇష్టంలేక ఒక కాలటు.. ఇంకో కాలిటు..
రెండు పడవల ప్రయాణమే ఇప్పుడంతా.. రెంటికి చెడిన రేవడే ఇప్పుడంతా..!
మంచితో.. చెడుతో.. ఏకకాలంలో సంధి చేస్కోవడం కుదరదు
రక్తిని.. ముక్తిని.. ఒకేసారి సాధించటం కుదరదు
నరాల్లో తుపానులా విరుచుకుపడుతున్న రక్తిని తొక్కిపెట్టి
భక్తిని ముఖంపై పులుముకుంటే ముక్తి రాదు!
పేగుల్ని ఆకలి పిండేస్తున్నా.. బలహీనత శరీరాన్ని గుంజేస్తున్నా
జింకని స్వాధీనంలోకి తెచ్చుకునేదాకా పులి ఆరాటం ఆగదు
సముద్రపు అట్టడుగు లోతుల్ని చీల్చుకుని వెళ్లేదాకా ఆణిముత్యం దొరకదు
ఒకరాత్రి తాలూకు సుదీర్ఘ చీకటిని ఎదుర్కొనే ఓపికుంటేనే..
ఎర్రని నులివెచ్చని ఉషోదయాలు ప్రత్యక్షమవుతాయి..
ఎదురౌతున్న వరుస ఓటముల్నుంచి తదుపరి పోరాటానికి
తనను తాను సన్నద్ధం చేసుకున్న వీరుడికే విజయాలు వరిస్తాయి..
బాధల తర్వాత లభించే సుఖాలు రసవత్తరంగా ఉంటాయి
కష్టాల కడలి లాంటి జీవితంలో
ఎదురీదే కళను ఔపోసన పట్టినోడికే
తీరాలు స్వాగతం పలుకుతాయి...

-షేక్ రఫీ, 8106271810



'దిమాక్ ఖరాబ్' ఆవిష్కరణ సభ

మోహన్‌రుషి కవితాసంపుటి 'దిమాక్ ఖరాబ్' 2017 ఆగస్టు 20న ఉదయం 10 గంటలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పి క్యాంపు పక్కన ఉన్న మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో జరుగుతుంది. ఆవిష్కరణ సభలో కట్టా శేఖర్‌రెడ్డి, సుబ్బారావు సార్, అంబటి సురేంద్రరాజు, గోరటి వెంకన్న, కార్టూనిస్ట్ శంకర్, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, వేనేపల్లి పాండురంగారావు, పున్నా కృష్ణమూర్తి తదితరులు పాల్గొంటారు.

'సహజవాక్యం' ఆవిష్కరణ

మూడుతరాల కవిసంగమం (కవిసంగమం సిరీస్-34) ఆధ్వర్యంలో హైదరాబాద్, ఆబిడ్స్, గోల్డెన్ థ్రెషోల్డ్‌లో 2017 ఆగస్టు 20న సాయంత్రం 6 గంటలకు అశోక్ ఆవారి కవితాసంపుటి 'సహజవాక్యం' ఆవిష్కరణ ఉంటుంది. జూపల్లి ప్రేమ్‌చంద్, వనపట్ల సుబ్బయ్య, రజిత కొమ్ము, ధర్ మురళి, గరిగె రాజేశ్ పాల్గొంటారు.

-కవి సంగమం

కవయిత్రుల అధ్యయన శిబిరం

తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్వర్యంలో వర్ధమాన కవయిత్రుల అధ్యయన శిబిరం ఆగస్టు 27,28 తేదీల్లో జరుగుతుంది. 15నుంచి 40 ఏళ్లలోపు వర్ధమాన కవయిత్రులకు కవితా రచనలో మెళకువలు బోధించటం జరుగుతుంది. భాష, వస్తువు, శిల్పం తదితర అంశాల్లో ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణ ఇస్తారు. ఆసక్తి గలవారు తమ పూర్తి వివరాలు, ఇ-మెయిల్ ఐడీ, సెల్ నెంబర్ రాసి, ఇటీవల రాసిన ఒక కవితను జతపరిచి ఆగస్టు 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎంట్రీలను ఇ-మెయిల్ ద్వారాగానీ, స్వయంగా గానీ అందజేయాలి. చిరునామా: తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, ఆబిడ్స్, హైదరాబాద్-1. ఇ-మెయిల్: telanganasaraswathaparishath@ gmail. co-m, ఫోన్: 040-24753724

- డాక్టర్ జె. చెన్నయ్య, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి

మనసంస్కృతి-చరిత్ర, భిన్నకోణాలు ఆవిష్కరణ సభ

శైలజ బండారి రచించిన 'మన సంస్కృతి-చరిత్ర, భిన్న కోణాలు' ఆవిష్కరణ సభ 2017 ఆగస్టు 18న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి, సుందరయ్య విజ్ఞానకేంద్రం షోయబ్ హాల్‌లో జరుగుతుంది. జె.వి.వి. రమేష్ అధ్యక్షతన జరుగు సభలో అతిథులుగా కొండవీటి సత్యవతి, కాసుల ప్రతాపరెడ్డి హాజరవుతారు. పాశం యాదగిరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. శిలాలోహిత తొలిప్రతి స్వీకరిస్తారు.

-పాలపిట్ట బుక్స్, హైదరాబాద్

'ది ఆర్డినరీనెస్ ఆఫ్ ట్రుత్' ఛాయాచిత్ర ప్రదర్శన

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సామాన్య శాస్త్రం గాలరీలో 2017 ఆగస్టు 19న సాయంత్రం 6 గంటలకు 'ది ఆర్డినరీనెస్ ఆఫ్ ట్రుత్' ఛాయాచిత్ర ప్రదర్శన ఉంటుంది. అందరికీ ఆహ్వానం.


-కందుకూరి రమేష్‌బాబు, 9948077893

వ్యాసరచన పోటీ ఫలితాలు

తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల ఫలితాలు న్యాయనిర్ణేతలు ప్రకటించారు. మొదటి బహుమతి-తుమ్మల మోహన్‌రావు(హైదరాబాద్), ద్వితీయ బహుమతి-శివరాత్రి శ్రీనివాస్(నర్సంపేట), తృతీయ బహుమతి-రమ్యశ్రీ చింతరెడ్డి(హన్మకొండ) గెలుచుకున్నారు. చిందం రమేష్, కె. మధునయ్య, సీహెచ్. ఆకాంక్షలను కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారు. విజేతలకు ఈ నెల చివరి వారంలో బహుమతులు అందజేస్తారు.

- రావుల రాజేశం, నేత్ర స్వచ్ఛంద సంస్థ, 9848811429
- గడీల సుధాకర్‌రెడ్డి, తెసారసం, అధ్యక్షుడు
- పర్వీన్ బేగం, తెసారసం, కోశాధికారి

రైతేడ్సిన ఎవుసం



ఎవుసాయం పుట్టినప్పటినుంచే
నేను ఎద్దేడ్సినంత దీనంగా ఏడుత్తన్న

అడవిల చెట్టుమీదాకోలే బతికినప్పుడు
గుండెలు కాలే ఈ బాధే లేదు
పిట్టో-మెకమో తనువు చీల్చి తినమన్నప్పుడు
కరువు పిడుగులు వడి బూడిదైన కథలే లేవు.
ఎవుసాయం నేర్సినంకనేనా-
ఎన్ను పూసిరిగిపోయింది?

కడుపులో కాసిన ఆకటెండల మీద - ఇన్ని కన్నీళ్లు చల్లి
రాజుల కోశాగారాలను నింపినోన్ని
నా జాతినీ-నీతినీ నిలువునా చేతికర్రతో చెరబడుతున్నా
దొరల బొర్రల్నిండా మెతుకు దీపాలెత్తిన వాణ్ణి
మట్టి గుండెను ముట్టుడు సుర్వుజేసినంకనే గదా!
మట్టిల గల్సుడు మొదలైంది?
గిప్పటికీ గదే మట్టి పానమైతంది
పానం కంటే ఎక్కువైతంది
ధర్మజుడు జూదంల అన్నీ పోగొట్టుకున్నట్టు
నేను ఎవుసాయ పద్మవ్యూహంల జిక్కి పిచ్చోన్నయిన
నా తాత ముత్తాల లెక్కనే.

'అన్నదాత సుఖీభవ'
మరి నా దుఃఖానికి కారణమెవడు?
నా తలరాత మీద
ఇంతటి విషాన్ని చిమ్మిందెవడు?
అన్నం బెట్టేటోనికి సున్నం బెట్టుండ్రయ్యా!
మీరీ దేశాన్ని అమ్ముకోండ్రి
నేను ఎద్దెవుసాన్ని అమ్ముతన్న
బిడ్డలారా!
ఇగ మీ బువ్వ మీరు వండించుకోండ్రి!

- తోకల రాజేశం, 9676761415

జీవన సారాన్ని చెప్పే సామెతలు..

సామెతలు సాహిత్యానికి సొబగులు-2

'సుస్తీ సబ్ భీమారీయోం కీ జడీ హై'
సోమరితనమే అన్ని రోగాలకు మూలం. నడక లేకపోతే పడకే గతి అన్నమాట.

'సస్తారోయే బార్ బార్ మెహంగా రోయే ఏక్‌బార్'
చవకగా కొనుక్కున్న వాడు రోజూ ఏడుపే. అధిక ధరకు కొన్నవాడు ఒక్కసారే ఏడుస్తాడు.

'కల్ కర్నే కా ఆజ్ కర్'
రేపటి పని ఈరోజే పూర్తిచేయి. జీవితం బుద్బుధమైన బుడగ కదా ఎపుడు చిట్లిపోతుందో ఎవరికేం తెలుసు అన్న లోతైన తాత్త్విక చింతన నుంచి ఈ సాదాసీదా సామెత పుట్టుకొచ్చింది.

'ఆఫ్తాబ్ కో చిరాగ్ దిఖానా'
ఆఫ్తాబ్ అంటే సూర్యుడి వెలుగు. చిరాగ్ అంటే దీపం. సూర్యుడి ముందు దివిటీ అవసరమా? హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేసినట్లు!

'బహతే దరియా మే హాత్ దోనా'
ప్రవహించే నీళ్లల్లో చేతులు కడుక్కో! దీపం ఉన్నపుడే ఇల్లు చక్కబెట్టుకో. అవకాశాలు ఉన్నపుడే అందిపుచ్చుకో అనే దానికి ఉదాహరణే ఈ సామెత.

'బద్ అచ్చా బద్నాం బురా'
జీవితంలో దెబ్బతిన్నా ఫర్వాలేదు కానీ చెడ్డపేరు మాత్రం తెచ్చుకోవద్దు. మనం నష్టపోయినా ఫరవాలేదు కాని పరువు మాత్రం పోగొట్టుకోవద్దని చెప్పే సూక్తి ముక్తావళి ఇది.

'బగల్ మే చురి మూమే రాం రాం'
మేక వన్నె పులులకు ఈ మాట సరిపోతుంది. కనబడకుండా కడుపులో కత్తులు దాచుకుని పెదాల మీద మాత్రం రామనామం జపించేవారు.

'బందర్ క్యా జానే అద్రక్ కా స్వాద్'
గాడిదకేం తెలుసు గంధపు చెక్కల సువాసన ఈ సామెతకు సరిపోతుంది. కొంచెం చమత్కారంగా 'కాకి కేమి తెలుసు సైకో ఎనాలిసిస్' అని శ్రీశ్రీ అన్నాడు.

'బినా రోయే మా భీ దూద్ నహీం దేతీ'
ఏడవకపోతే అమ్మ కూడా పాలు ఇవ్వదు.

'కత్రే కత్రేసే దరియా బన్తా హై'
బిందువు బిందువు సింధువగును. పైసాపైసా కూడబెడితేనే పెన్నిధి అవుతుంది. ఓపికగా ఒక్కొక్క అడుగు వేస్తేనే అంతిమ లక్ష్యం చేరుకుంటాం.

'కామ్ కామ్ కో సిఖాతాహై'
ఒక పనిని ప్రారంభిస్తే ఆ పని ఎలా పూర్తి చేయాలో ఆ పనే అర్థం చేయిస్తుంది. నేర్పుతుంది. అందుకోసమే పాత కాలంలో కొత్తగా సర్కారీ నౌఖరీలో చేరిన నయా బకరాలకు సీనియర్లు 'పహలే కుర్సీమే బైఠ్ నా సేకో బాద్ మే కుర్సీ హీ కామ్ సిఖాతా హై' అని సలహా ఇచ్చేవాళ్లు. అట్లా ముందు కదలకుండా కూచోవటం అలవాటైతే పని దానంత అదే వస్తది. అపుడు 'టర్న్ ది పేజ్ లర్న్ ది వర్క్' షురూ అవుతది. ఇది తజ్రుబా (అనుభవం) నుంచి పుట్టిన ముహావరా (సామెత).

'గూడ్ ఖానేసే మూ మిఠా నహీం హోతా'
ఇదొక పరోక్ష సామెత. బెల్లం తింటే నోరు తియ్యగా ఔతుంది కాని హృదయం అవుతుందా అన్నది ప్రశ్న. మాట మధురం కావాలంటే మనసు స్వచ్ఛంగా ఉంచుకోవాలి. లేకపోతే మూ (నోరు) గూడ్ (బెల్లం) తిన్నా మాట మాత్రం ఖడ్వా (చేదు) గానే ఉంటుంది.

'జిస్ ఘర్ మే బేర్ హోతో వహాం పత్తర్‌తో ఆతే హై'
కాసిపూసే చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతుంటవి. సుఖఃదుఖాలు నాణానికి రెండు ముఖాలు అని చెప్పటమే ఈ సామెత సందేశం.

'చిరాగ్ తలే అంధేరా'
దీపం కింద నీడ సహజమే కదా. వెలుగు నీడల సమాహారమే జీవితం కదా. జగానికి వెలుగు ఇచ్చే దీపం కిందనే చీకటి ఉన్నపుడు సుఖం తర్వాత దుఖం కూడా ఉంటుందనే ఒక హెచ్చరిక.

'దోషేర్ ఏక్ జంగల్ మే నహీం రహ సక్తే'
వీధికొక్క వీరుడే ఉండాలని దీని అర్థం. ఇద్దరుంటే వారికి సమస్యే.

'కమ్ బోలో లేకిన్ బేదడక్ బోలో'
తక్కువగానే మాట్లాడు కాని స్పష్టంగా మాట్లాడు.

'బడా సర్ తోడీ అకల్'
తల గుమ్మడి కాయ అంత. తెలివి నువ్వు గింజంత.

'బిల్లికే ఖ్వాబ్ మే చిచ్‌డే హీ చిచ్‌డే'
పిల్లి గారి కలల్లో ఎటు చూసినా మాంసం ముక్కలే.

'బుడ్డీ గోడీ లాల్ లగామ్'
ముసలి గుర్రానికి అందమైన జీను. దీనినే తెలుగులో గుర్రం గుడ్డిదైనా దాణాకు లోటు లేదని,పనిచేయని సోమరుల విషయంలో వ్యంగ్యంగా అంటారు.

'సారే అండే ఏక్ హీ టోక్రీమే మత్ రకో'
గుడ్లు అన్నీ ఒకే గంపలో పెడితే పగిలిపోతాయని ఒక హెచ్చరిక. యాత్రకు వెళ్లేటపుడు. డబ్బులన్నీ ఒకే చోట పెట్టుకోవద్దని ఇచ్చే సలహా ఇది.

'జహాం పూల్ వహాం కాంటే'
పూలున్న చోటే ముళ్లు కూడా ఉంటాయి.


'ఆమ్ కానేసే మతలబ్ మగర్ పేడ్ గిన్‌నేసే నహీం'
మామిడి పండ్లు తినటం ముఖ్యం కాని మామిడి చెట్లను లెక్క పెట్టటం ఎందుకు? వ్యవహారికంగా ఉండటం ముఖ్యం కాని అనవసర విషయాలలో తల దూర్చవద్దని సలహా ఇది.

'దిల్ మే జహర్ జబాన్ పే షహర్'
తేనెలూరే మాటలు విషం చిమ్మే మనసు. ఇలా మాట మాటకూ, ప్రతి సందర్భంలో వాడే సామెతలు జన జీవితంలో కోకొల్లలు.

- పరవస్తు లోకేశ్వర్, 9160680847

కొత్త పుస్తకాలు

ఋతుసంక్రమణం



గోకులదాస ప్రభు కొంకణి భాషలో ఉత్తమ కథా రచయితల్లో ప్రసిద్ధులు. కేరళలోని కొచ్చిలో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల నుంచి కొంకణి, మళయాళం భాషా సాహిత్యాలను అధ్యయనం చేసి, మాతృభాష కొంకణిలో అనేక కథలను రాశారు. మళయాళంలోని అనేక కథలను కొంకణిలోకి అనువదించారు. ఆయన సంవేదనాశీల రచయిత. స్త్రీపాత్ర కేంద్రితమైనవి.

మూలం: గోకులదాస ప్రభు,
తెలుగు:రంగనాథ రామచంద్రరావు,
వెల: రూ. 80, ప్రతులకు:నవచేతన పబ్లిషింగ్ హౌస్,
గిరిప్రసాద్‌భవన్, బండ్లగూడ,
నాగోల్ జీఎస్ఐ పోస్ట్, హైదరాబాద్-68.
ఫోన్:24224453


కలం అలిగింది



నిరంతర సాహితీ సృజనశీలి డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు 1981నుంచి తన పుట్టిన రోజున ఒక కవితా సంపుటిని తెస్తూ, కవితాసంపుటి పుట్టిన రోజుగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో 91 కొత్త కవితలతో 87వ గ్రంథంగా 'కలం అలిగింది' మనముందుకొచ్చింది.

రచన: డాక్టర్ సి.నారాయణరెడ్డి,
వెల: రూ.150,
ప్రతులకు: నవచేత పబ్లిషింగ్ హౌస్,
4-10435, బ్యాంక్ స్ట్రీట్,
విజ్ఞాన్ భవన్, హైదరాబాద్-01


డా.సి.నారాయణరెడ్డి స్మరణలో రచయిత్రుల కొత్త కథలు



తెలంగాణ తేజోమూర్తి డాక్టర్ సి.నారాయణరెడ్డి స్మరణలో అనేక రచనలు, కవితా సంపుటాలు వచ్చాయి. ఆ క్రమంలోనే ఆయన స్మరణలో రచయిత్రుల కొత్త కథల సంపుటి రావటం సగౌరవం. నారాయణ రెడ్డి గారి వ్యక్తిత్వం, జీవితం, సమాజంతో ఆయనకున్న అనుబంధాన్ని తెలిపేవే ఈ 'కొత్త కథలు'.

సంకలన కర్త: డాక్టర్ తెన్నేటి సుధాదేవి.
వెల: రూ.200, ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.

అంతర్వాణి



కావ్యం అంటే పెద్ద గ్రంథం కానవసరం లేదు. వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు. అద్భుత రసానుభూతి కలిగించే ఒక్క వాక్యమైనా కావ్యమే. కృష్ణప్రసాద్ కవితల్లో అభివ్యక్తి నవ్యత, శబ్ద సౌష్టవం, గేయాత్మక నడక కనిపిస్తాయి. అభ్యుదయం, సామాజిక ప్రయోజనం,ఉన్నత విలువలు, ఉదాత్త ప్రమాణాలను ప్రతిబింబించే కవితలెన్నో ఉన్న సంపుటి 'అంతర్వాణి'.

రచన: కోసరాజు కృష్ణప్రసాద్,
వెల: రూ. 40, ప్రతులకు:జ్యోతి వలబోజు,
జె.వి. పబ్లికేషన్స్, హైదరాబాద్.
సెల్:8096310140

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



బుల్లెట్ ప్రూఫ్ అద్దంలోంచి కనిపిస్తున్న పంద్రాగస్టు రిహార్సల్స్.. ఎర్రకోట ప్రతిబింబాన్ని చిత్రంలో చూడొచ్చు

పంద్రాగస్టుకు హస్తిన ముస్తాబు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీ మంగళవారం 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ముస్తాబవుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం ఎర్రకోట నుంచి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ప్రధాని మోదీ జాతినుద్దేశించి మాట్లాడతారు. ఈ సందర్భంగా విద్య, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, డిజిటలైజేషన్, బాలికా అక్షరాస్యత తదితర అంశాలను ప్రస్తావించాలని దేశ ప్రజల నుంచి సూచనలు వచ్చాయి. కాగా, ఆదివారం రిహార్సల్స్ నిర్వహించడంతో కీలక మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ 'నూతన భారత్' విజన్‌పై దేశభక్తియుత వాతావరణం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం లేఖ రాసింది. కానీ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మాత్రం కేంద్ర సూచనను ఆమోదించబోమని స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ నిర్ణయం దురదృష్టకరమని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వ్యాఖ్యానించారు.



భార్యా పిల్లలను కాపాడి అగ్నికి బలయ్యాడు

కోయంబత్తూరు : భార్య, ఇద్దరు పిల్లల ప్రాణాలను కాపాడిన ఓ వ్యాపారి.. తాను మాత్రం అగ్నికి ఆహుతయ్యాడు. ఆదివారం నడుస్తున్న కారులో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. బంగారం వ్యాపారి దిలీప్‌కుమార్(38), భార్య, పిల్లలతో కలిసి కారులో కొచ్చి నుంచి కొయంబత్తూరుకు బయలుదేరారు. మదుక్కరాయి టోల్‌గేట్ సమీపంలో కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే దిలీప్ కారు నుంచి భార్య, పిల్లలను బయటకు తోసేశాడని, సీటుబెల్ట్ తెరుచుకోకపోవడంతో తాను మాత్రం మంటల్లో చిక్కుకొని మృతిచెందాడని పోలీసులు తెలిపారు.

'బ్లూవేల్'కు చిక్కి మరొకరు..

- ముఖానికి కవర్ చుట్టుకొని బాలుడి ఆత్మహత్య

కోల్‌కతా, ఆగస్టు 13: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న బ్లూవేల్ ఆన్‌లైన్ గేమ్ బారిన పడి మరో విద్యార్థి ప్రాణంతీసుకున్నాడు. ముఖానికి పాలిథిన్ కవర్‌ను బిగించుకుకొని ఊపిరి ఆడకుండా చేసుకొని చనిపోయాడు. పశ్చిమబెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లాలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పదవ తరగతి చదువుతున్న అంకన్ పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ఈ దారుణానికి పాల్పడ్డాడు. స్నానం చేసి వస్తానని చెప్పి వెళ్లిన అంకన్ ఎంతకీ రాకపోవడంతో అనుమానం వచ్చి బాత్‌రూమ్‌లో చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన తల్లిదండ్రులు దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే అతడు ప్రాణాలు విడిచినట్లు వైద్యులు తెలిపారు. మెడచుట్టూ పాలిథిన్ కవర్‌ను గట్టిగా చుట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చివరిసారిగా అతడు బ్లూవేల్ గేమ్ ఆడుతూ కనిపించినట్లు సమాచారం. మూడు రోజులక్రితం మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఇద్దరు విద్యార్థులు బ్లూవేల్ గేమ్ ఆడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా సహచరులు, పోలీసులు వారిని కాపాడారు. గత నెల ముంబైకి చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థి ఎత్తైన భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో 'బ్లూవేల్' అరాచకం భారత్‌లో వెలుగులోకి వచ్చింది.

46 మంది సజీవ సమాధి



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి - పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగి పడిన ప్రాంతంలో సహాయ చర్యలు చేపట్టిన పోలీసులు, సైన్యం, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

హిమాచల్‌లో బస్సులపై విరిగిపడిన కొండచరియలు

- మృతుల్లో ఇద్దరు తెలంగాణ వాసులు
- ప్రయాణికులు అల్పాహారం కోసం ఆగినప్పుడు ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం : సీఎం వీరభద్రసింగ్

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో పెను విషాదం చోటుచేసుకున్నది. శనివారం రాత్రి రెండు బస్సుల్లో వెళుతున్న ప్రయాణికులపై మృత్యువు మట్టి పెళ్లల రూపంలో వచ్చి పడింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థ బస్సులపై కొండ చరియలు విరిగి పడటంతో 46 మంది సజీవ సమాధి అయ్యారు. మరి కొందరికి గాయాలయ్యాయి. వారిలో 14 మందిని గుర్తించారు. ఈ ఘటన మండి – పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. మృతుల సంఖ్య 50 దాటే అవకాశం ఉన్నదని ఆ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి జీఎస్ బాలీ మీడియాకు చెప్పారు. సీఎం వీరభద్ర సింగ్ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మనాలీ – కత్రా, మనాలీ – చంబా మార్గాల్లో రెండు బస్సులు వెళుతున్నాయి. ప్రయాణికులు అల్పాహారం తీసుకొనేందుకు రాత్రి జోగిందర్‌నగర్ శివారుల్లోని కొట్రూపి గ్రామం వద్ద బస్సులను నిలిపినప్పుడు ఈ విషాదం చోటుచేసుకున్నదని రాష్ట్ర ప్రకృతి విపత్తు నివారణ శాఖ ప్రత్యేక కార్యదర్శి డీడీ శర్మ తెలిపారు. కొండ చరియల ధాటికి ఒక బస్సు లోయలో 200 మీటర్లు, చంబా డిపో బస్సు రెండు కిలోమీటర్ల లోతుకు పడిపోవడంతోపాటు గుర్తించడం కష్టసాధ్యమైంది. 250 మీటర్ల పొడవునా రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో ఈ రోడ్డును మూసివేసి ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లో మళ్లించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం మనాలీ – కత్రా వెళ్లే బస్సులో ఎనిమిది మంది, మరో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నారని రాష్ట్ర డీజీపీ సోమేశ్ గోయల్ తెలిపారు. రాష్ట్ర పోలీసులు, ఐదు అగ్నిమాపక దళ బ్రిగేడ్లతోపాటు 120 మంది ఆర్మీ జవాన్లు, జాతీయ విపత్తు నివారణ సంస్థ (ఎన్డీఆర్ఎఫ్) సిబ్బంది సహాయచర్యల్లో పాల్గొంటున్నారు. మృతుల కుటుంబాలకు సీఎం వీరభద్ర సింగ్ రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలను కలుసుకుని తీవ్ర విచారం వ్యక్తంచేశారు. పరిహారంలో రూ.4 లక్షలు చెల్లిస్తుందని రెవెన్యూశాఖ మంత్రి కౌల్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర రవాణా సంస్థ మరో రూ. లక్ష పరిహారం చెల్లిస్తుందని రవాణాశాఖ మంత్రి బాలీ తెలిపారు. రాత్రి 9 గంటల తర్వాత సహాయ చర్యలు నిలిపివేశారు.

ఇద్దరు తెలంగాణ వాసుల మృతి

మండి వద్ద కొండచరియలు విరిగిపడిన ఘటనలో తెలంగాణకు చెందిన ఇద్దరు మృత్యువాతపడ్డారు. వారిని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఔరవానికి చెందిన దుబ్బాక కొండల్‌రెడ్డి, యాదాద్రి జిల్లా బీబీనగర్‌కు చెందిన రాజిరెడ్డిగా గుర్తించారు. సుశీ హైటెక్ కంపెనీలు మేనేజర్లుగా పనిచేస్తున్న వీరు సిమ్లాలో కాంట్రాక్టు పనులను పర్యవేక్షిస్తున్నారు. వీరి మృతదేహాలను స్వస్థలానికి పంపడానికి రెండు రోజులు పట్టవచ్చని అధికారులు తెలిపారు.

మృతులకు ప్రధాని మోదీ సంతాపం

హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో కొండ చరియల విరిగిపడి మృతి చెందిన ప్రయాణికులకు ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్ర సంతాపం తెలిపారు.

పసి ప్రాణాల్ని కాపాడిన మనసున్న డాక్టర్

- పిల్లల కోసం తండ్లాడిన కఫీల్ అహ్మద్
- సొంత డబ్బులతో ఆక్సిజన్ కొనుగోలు
- గోరఖ్‌పూర్ ఘటనలో నిజమైన హీరో
- అయినా.. విధుల నుంచి తప్పించిన ప్రభుత్వం



డాక్టర్ కఫీల్ అహ్మద్

గోరఖ్‌పూర్, ఆగస్టు 13: కండ్లముందే కన్ను మూ స్తున్న పసికందులు.. చిన్నారులను చూసి అమ్మానాన్నల ఆర్తనాదాలు.. వింటుంటేనే హృదయం ద్రవించే పరిస్థితుల్లో కన్నవారి కడుపుకోతను చూసిన కఫీల్ అహ్మద్ ఎంతగా కుమిలిపోయుంటాడో..! 70మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన గోరఖ్‌పూర్ దవాఖానలో పిల్లల విభాగం వైద్యుడు కఫీల్ అహ్మద్.. పసిప్రాణాలను కాపాడేందుకు పడిన తపన అంతాఇంతా కాదు.

ఆగస్టు 10 అర్ధరాత్రి.. గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ వైద్యకళాశాలలోని వార్డు నెంబరు–100లో మృత్యువు ఒక్కొక్కరినీ కబళిస్తున్న వేళ.. రాత్రి 2గంటల ప్రాంతంలో డాక్టర్ అహ్మద్‌కు దవాఖాన సిబ్బంది ఫోన్ చేశారు. ఆక్సిజన్ సిలిండర్లు మరో గంటలో ఆయిపోతాయని, పిల్లల పరిస్థితి ఏంటో అర్థంకావడంలేదని నర్సులు ఆయనకు తెలిపారు. మెదడువాపుతో బాధపడుతున్న చిన్నారులకు నిరంతర ఆక్సిజన్ సరఫరా అవసరం. అదే లేకపోతే పరిస్థితి ఏంటో..! వెంటనే ఇంటి నుంచి బయటకు పరుగెత్తుకొచ్చిన అహ్మద్ తన కారులో తెలిసిన మిత్రుడి దవాఖానకు వెళ్లాడు. అక్కడ నుంచి మూడు పెద్ద ఆక్సిజన్ సిలిండర్లను తన కారులో వేసుకుని బయల్దేరాడు. మూడుగంటలకల్లా శిశువైద్య విభాగానికి చేరుకుని, పిల్లలకు అమర్చారు. అయితే అక్కడున్న సుమారు 80మంది చిన్నారులకు ఆ సిల్లిండర్లు కేవలం అరగంటపాటు మాత్రమే ఆక్సిజన్ అందించగలిగాయి. తెల్లవారుజామున పరిస్థితి విషమించింది. ప్రాణవాయువు అందక చిన్నారులు తల్లడిల్లుతున్నారు. ఆక్సిజన్ సిలిండర్లు వచ్చే పరిస్థితి లేదు. ఉన్నతాధికారులకు చెప్పి చేతులు ముడుచుకుని కూర్చోవచ్చు. కానీ, కఫీల్ అహ్మద్ నిలబడలేదు. ఆ స్థితిలో తన జూనియర్ డాక్టర్లను పిలిచి పిల్లలకు చిన్న పంపుతో కూడిన అంబు బ్యాగ్‌లను ఉపయోగించి ఆక్సిజన్ పంపింగ్ చేయాలని ఆదేశించాడు. అదేసమయంలో సిలిండర్ల కాంట్రాక్టర్లకు వరుసగా ఫోన్ చేస్తూనే ఉన్నాడు.

మరో 12 సిలిండర్లు తెచ్చి..

తెల్లవారుజామున పట్టణంలోని పలు దవాఖానలకు వెళ్లిన కఫీల్ అహ్మద్ కొన్నిచోట్ల తన సంబంధాలను ఉపయోగించాడు. మరికొన్ని చోట్ల డబ్బులు ఖర్చుచేశాడు. మొత్తమ్మీద 12 సిలిండర్లను తీసుకుని తిరిగి దవాఖాన చేరాడు. వాటిని చిన్నారులకు అమర్చారు. ఈలోగా ఓ కాంట్రాక్టర్ ఆక్సిజన్ సిలిండర్లు ఇవ్వడానికి తాను సిద్ధమేనని, అయితే తనకు నగదు రూపంలోనే డబ్బు తక్షణమే ఇవ్వాలని డాక్టర్ అహ్మద్‌కు ఫోన్‌చేశాడు. వెంటనే దవాఖాన ప్యూన్ ఒకరికి తన కార్డు ఇచ్చి వెళ్లి ఏటీఎం నుంచి పదివేలు విత్‌డ్రా చేసుకుని రమ్మన్నాడు. అయితే ఆ సిలిండర్లు కూడా కొన్నిగంటలపాటే ప్రాణాలు నిలుపగలిగాయి. చాలామంది ప్రాణాలు కాపాడగలిగినా, కండ్లముందే కొంతమంది పిల్లలు రాలిపోయారు. చేతిలో డబ్బులున్నా, ఆక్సిజన్ సిలిండర్లు లేవు. ప్రాణం పోసే వైద్యులున్నా, సమయం లేదు. ఇక తట్టుకోలేక కఫీల్ అహ్మద్ తన పీడియాట్రిక్‌వార్డు గోడకు జారగిలపడి ఏడ్చేశాడు.

విధుల్లోంచి తప్పించిన ప్రభుత్వం

డాక్టర్ కఫీల్ అహ్మద్ దేవదూతలా పిల్లల ప్రాణాలు కాపాడాడని చాలామంది తల్లిదండ్రులు చెప్తుంటే, ప్రభుత్వం మాత్రం పిల్లల మృతికి నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆయనపై చర్యలకు దిగింది. విధుల నుంచి తప్పించింది. 'ఇందుకు నాకు బాధలేదు. వీటన్నింటికన్నా పిల్లలందరిప్రాణాలూ కాపాడలేకపోయామనేదే నా బాధ' అని డాక్టర్ అహ్మద్ తెలిపారు.



గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు



కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న యూపీ సీఎం ఆదిత్యనాథ్

ఎవరినీ వదులం..!

- గోరఖ్‌పూర్ ఘటనపై ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్
- దవాఖానను సందర్శించిన సీఎం యోగి, కేంద్రమంత్రి నడ్డా
- 70కి చేరిన చిన్నారుల మరణాలు
- పరిస్థితిపై ప్రధాని మోదీ సమీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 13: తీవ్ర విమర్శల మధ్య ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ వైద్యకళాశాలను ఆదివారం సందర్శించారు. వారంరోజుల వ్యవధిలో ఈ దవాఖానలో 70మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డాతో కలిసి పరిస్థితిపై వైద్యులతో చర్చించిన సీఎం యోగి అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు. 48గంటల వ్యవధిలో 30మంది శిశువుల మృతి చెందడానికి మెదడువాపే కారణమని వైద్యులు గుర్తించారని చెప్పారు. పిల్లల మరణానికి ఆక్సిజన్ కొరతే కారణమన్న ఆరోపణలను ఆయన కొట్టివేశారు. 'ఈమధ్యకాలంలో ఈ దవాఖానకు నేను రావడం ఇది నాలుగోసారి. పరిస్థితులను చక్కదిద్దేందుకు చేయాల్సినంతా చేస్తున్నాం. ప్రభుత్వ ఉన్నతాధికారులను ఇక్కడే ఉంచాం. పిల్లల మరణాలపై నాకన్నా ఎక్కువగా బాధపడుతున్నవాళ్లెవరూ లేరు. ఈ ఘటనపై విచారణ కమిటీ ఇచ్చే నివేదిక కోసం వేచిచూస్తున్నాం. బాధ్యులెవరైనా వదిలిపెట్టం. వారిపై కఠిన చర్యలు తప్పవు' అని సీఎం యోగి అన్నారు. గోరఖ్‌పూర్ ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారని, ఎప్పటికప్పుడు పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకుంటున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. తప్పుడు కథనాలతో భయాందోళనలు సృష్టించవద్దని, వార్డుల్లోకి వెళ్లి చూస్తే పరిస్థితి మీకే అర్థమవుతుందని మీడియాపై వ్యాఖ్యానించారు. పిల్లల్ని కోల్పోయిన బాధలో ఉన్న తల్లిదండ్రుల్ని రెచ్చగొడుతూ కొందరు ఈ సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని సీఎం యోగి మండిపడ్డారు. ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేసే సంస్థపైనా విచారణ జరుపుతున్నామని, పాత బిల్లులు చెల్లించలేదని ఆక్సిజన్ సిలిండర్ల సరఫరాను నిలిపివేసిన సదరు సంస్థపై ఇప్పటికే దాడులు నిర్వహించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని ఓ బృందం ఈ సిలిండర్ల సరఫరాదారు పాత్రపై విచారణ జరుపుతున్నదని యోగి చెప్పారు.

గోరఖ్‌పూర్‌కు ప్రాంతీయ పరిశోధనా కేంద్రం మంజూరు

పిల్లల వ్యాధులపై ప్రాంతీయ పరిశోధనాకేంద్రాన్ని గోరఖ్‌పూర్‌లో నెలకొల్పనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రూ.85 కోట్లతో దీనిని నెలకొల్పుతున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. ఘటనపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నడ్డా, పరిస్థితిని సమీక్షించేందుకు ఓ వైద్యబృందాన్ని బీఆర్‌డీ వైద్యకళాశాలకు రప్పిస్తున్నట్లు వెల్లడించారు.

70కి చేరిన మృతుల సంఖ్య

గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ దవాఖానలో ఆదివారం మధ్యాహ్నం మరొక చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో వారంరోజుల్లో ఈ దవాఖానలో మృతిచెందిన చిన్నారుల సంఖ్య 70కి చేరింది. సోమవారంనాడు 9మంది, మంగళవారం 12మంది చిన్నారులు మృత్యువాతపడ్డారు. బుధవారం యోగి ఆదిత్యనాథ్ దవాఖానను సందర్శించిన రోజే 9మంది పిల్లలు చనిపోయారు. గురువారం నవజాత శిశువుల విభాగంలో 14మంది మృతిచెందారు. శుక్రవారం ఏడుగురు, శనివారం 11మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు.



గోరఖ్‌పూర్‌లో సీఎం యోగికి నిరసన తెలిపిన వారిని చితకబాదుతున్న పోలీసులు

ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమే : విపక్షం

గోరఖ్‌పూర్ ఘటన పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని విపక్షాలు మండిపడ్డాయి. ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం యోగి రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైవీర్ షేర్‌గిల్ డిమాండ్ చేశారు. 'పిల్లల మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించి పంపేస్తున్నారు. కనీసం అటాప్సీ కూడా చేయకపోవడం దురదృష్టకరం' అని మాజీ సీఎం అఖిలేష్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

'నిధుల కోసం మూడుసార్లు లేఖ రాశా..'

దవాఖాన నిర్వహణకు సరిపడా నిధులు ఇవ్వలేదని సస్పెండైన చీఫ్ సూపరింటెండెంట్ రాజీవ్‌మిశ్రా తెలిపారు. 'నిధులు లేవని, ఆక్సిజన్ సిలిండర్ల కొనుగోలు ఇబ్బందిగా ఉన్నదని నేను జూలై3, జూలై 19, ఆగస్టు 1 తేదీల్లో ప్రభుత్వానికి లేఖరాశాను. ఉన్నతాధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ ఈ విషయాన్ని ప్రస్తావించాను. ఆగస్టు 5న ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, 11న బిల్లులు చెల్లించాం' అని రాజీవ్ మిశ్రా తెలిపారు. చిన్నారుల మరణాలు చోటుచేసుకుంటున్నప్పుడు రాజీవ్ మిశ్రా రిషికేశ్ యాత్రలో ఉన్నారని ప్రభుత్వం తెలిపింది. అయితే తాను ప్రభుత్వం అనుమతించాకే సెలవులు తీసుకున్నానని మిశ్రా చెప్పారు.

ఆక్సిజన్ కొరత నిజమే.. మృతురాలి తండ్రి

పిల్లలు చికిత్స పొందుతుండగానే దవాఖానలో ఆక్సిజన్ కొరత ఏర్పడిందని మృతిచెందిన చిన్నారి సారిక తండ్రి అజయ్ శుక్లా తెలిపారు. ఆక్సిజన్ కొరత ఏర్పడనేలేదన్న ప్రభుత్వ వాదనను ఆయన ఖండించారు. ఆగస్టు 10వ తేదీ సాయంత్రం ఐదుగంటలకు తమ పాప చనిపోయిందని, అంతకు రెండుగంటల ముందే దవాఖానలోని పీడియాట్రిక్ విభాగంలో ఆక్సిజన్ కొరత ప్రారంభమైందని చెప్పారు. మరుసటి రోజుకుగానీ సిలిండర్లు రాలేదని శుక్లా తెలిపారు. ఆగస్టు 10 అర్ధరాత్రి నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని, 11వతేదీ మధ్యాహ్నం తర్వాత మరో ఐదుగురు చనిపోయారని చెప్పారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే తమ పాప మృతిచెందినట్లు వైద్యులు చెప్పినట్లు ఆయన వెల్లడించారు.

కాగ్ ముందే హెచ్చరించినా..

ఉత్తర ప్రదేశ్‌లోని నాలుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గత నెలలోనే నివేదిక ఇచ్చి హెచ్చ రించింది. దాదాపు 70మంది వరకు చిన్నారులను బలిగొన్న బీఆర్‌డీ దవాఖాన సహా మరో నాలుగు వైద్యకళాశాలల పరిస్థితి అధ్వాన స్థితిలో ఉందని నివేదికలో పేర్కొన్నది. బీఆర్‌డీ హాస్పిటల్‌లో వైద్యపరికరాల వినియోగం మూలన పడిందని, ఉపయోగించుకునేందుకు సరైన శిక్షణ కలిగిన సిబ్బంది లేకపోవడంతో పరికరాలు పనికిరాకుండా పోయాయి. బీఆర్‌డీ దవాఖానలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాగ్ సూచించింది. దవాఖానకు రావాల్సిన 27.38కోట్ల నిధులను కస్తూర్బాగాంధీ మెడికల్ యూనిట్ నిలిపివేయడంతో వైద్య వసతులు కొరవడుతున్నాయని వెల్లడించింది.

హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ యాసిన్ హతం

- ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు ఉగ్రవాదులు..
- ఇద్దరు జవాన్ల వీర మరణం
- కశ్మీర్ రాష్ట్రం షోపియాలో ఘటన



శ్రీనగర్, ఆగస్టు 13: జమ్ముకశ్మీర్‌లోని షోపియా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ మహమ్మద్ యాసిన్ యాటూ అలియాస్ మహమూద్ గజ్నవీ హతమయ్యాడు. ఆయనతోపాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు ఇర్ఫాన్–ఉల్–హక్ షేక్, ఉమర్ మాజీద్ షేక్.. పీ ఇళయరాజా, సుమేధ్ వామన్ అనే జవాన్లు మృతిచెందారు. గాయపడ్డ ముగ్గురు జవాన్లకు 92 బేస్ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. జైనోపోర గ్రామంలోని అవ్నీరాలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో భద్రతాదళాలు తనిఖీలు చేపట్టాయి. అయితే ఒక్కసారిగా ఉగ్రవాదులు కాల్పులు జరుపడంతో భద్రతాదళాలు ఎదురుకాల్పులు జరిపాయి. శనివారం ప్రారంభమైన ఎన్‌కౌంటర్ 16 గంటలపాటు కొనసాగింది. కాల్పుల్లో యాసిన్ యాటు మృతిచెందినట్లు ఆదివారం పోలీసులు ధ్రువీకరించారు. యాసిన్ బుద్గాం జిల్లాలోని చాదూరా గ్రామ వాసి. 1997లో నియంత్రణ రేఖ దాటి వెళ్లి ఉగ్రవాద గ్రూపులో చేరాడు. యాసిన్ హిజ్బుల్ ముజాహిదీన్ కశ్మీర్ కార్యకలాపాల కమాండర్‌గా పనిచేస్తున్నాడు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన జవాన్లకు బదామీబాగ్ కంటోన్మెంట్‌లో సైనికులు నివాళులు అర్పించారు. మరోవైపు బందిపార జిల్లాలో భద్రతాదళాలు తనిఖీ చేస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇద్దరు కానిస్టేబుళ్లు ముక్తర్ అహ్మద్, మహ్మద్ అష్రఫ్, సిపాయి రాజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. కాగా, రాళ్లు విసిరిన అల్లరిమూకలపై భద్రతాదళాలు పెల్లెట్లు ప్రయోగించడంతో ఒకరు మృతిచెందారు.

కాల్పుల విరమణ ఒప్పందం మరోసారి ఉల్లంఘన

పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. పూంఛ్ జిల్లా మాన్‌కోటలో గత 24 గంటల్లో నాలుగు సార్లు నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరిపినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఏడాది పాకిస్థాన్ 285 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అధికారులు వెల్లడించారు.

ఉగ్రవాదుల ఆయుష్షు తగ్గింది : అరుణ్ జైట్లీ

ఒకప్పుడు ఉగ్రవాదులు ఏండ్లపాటు కశ్మీర్‌లోయలో పాతుకుపోయేవారని.. కానీ ఇప్పుడు వారి జీవిత కాలం కొన్ని నెలలకే పరిమితమైందని రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. ఆదివారం ఆయన ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. 'ఇండో–పాక్ సరిహద్దు, ఎల్‌వోసీ వెంట భద్రతాదళాలు దూకుడు పెంచడంతో వారి నుంచి తప్పించుకోవడం ఉగ్రవాదులకు సాధ్యంకావడం లేదు' అని పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్ తర్వాత సైన్యం ఆత్మస్థైర్యం పెరిగిందని, అప్పటి నుంచి ఉగ్రవాదులను ఏరిపారేస్తున్నారని చెప్పారు. నోట్లరద్దుతో ఉగ్రవాదుల ఆర్థిక మూలాలు దెబ్బతినగా, కశ్మీర్‌లోని ఆందోళనకారులు, ఉగ్రవాదులకు వచ్చే విదేశీ నిధులను ఎన్ఐఏ అడ్డుకోవడంతో ఆర్థికంగా చితికిపోయారన్నారు. ఒకప్పుడు రాళ్లు విసిరే ఆందోళనకారులు వందల సంఖ్యలో రోడ్డెక్కగా, ఇప్పుడు వారు పదుల సంఖ్యకు పరిమితమయ్యారని తెలిపారు.

70 మంది యువకులు ఉగ్రవాదంలోకి!

గత ఏడు నెలల్లో దాదాపు 70 మంది కశ్మీరీ యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరగా, 132 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయని అధికారులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 13: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో కోబ్రా, సీఆర్పీఎఫ్ బలగాలు మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మావోయిస్టులు పోలీసులకు తారాసపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' సుక్మా జిల్లా ఎస్పీ అభిషేక్ మీనాని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ.. సుక్మా జిల్లాలోని కిష్టారం బేస్‌క్యాంప్ వద్ద నుంచి సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా గాలింపు నిర్వహిస్తున్నాయన్నారు. ఇదే క్రమంలో కోటక్‌పల్లి, కంపా ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించి వెనుతిరిగి వస్తున్న బలగాలకు మావోయిస్టులు ఎదురు పడ్డారని చెప్పారు. అప్పటికే మెరుపుదాడులకు ప్రయత్నించిన మావోయిస్టులు కలోది ప్రాంతం వద్ద కోబ్రా, సీఆర్పీఎఫ్ బలగాలపై కాల్పులు జరిపారని తెలిపారు. దీంతో తమ బలగాలుకూడా ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చిందన్నారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు యూనిఫాంలో ఉన్న ఒకరు, ఒక పౌరుడు మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన వారిలో ఒకరు కిష్టారం ఏరియ మిలీషియ దళం డిప్యూటీ కమాండర్ ఓడియం సన్నా, మరొకరు దళ సభ్యుడు వంజం హంగగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి ఒక 9ఎంఎం పిస్తోల్, ఒక బర్మార్, 2 రైఫిళ్లు స్వాధీన పరుచుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

కాన్సాస్ గవర్నర్ పదవికి 16 ఏండ్ల బాలుడు పోటీ

టోపేకా, ఆగస్టు 13: ఆ బాలుడికి ఇంకా ఓటు హక్కు కూడా రాలేదు, కానీ గవర్నర్ పదవికి పోటీ చేస్తున్నాడు. అమెరికాలోని కాన్సాస్ రాష్ట్రానికి వచ్చే ఏడాది జరుగనున్న గవర్నర్ ఎన్నికల్లో 16 ఏండ్ల జాక్ బర్గర్‌సన్ డెమొక్రాట్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఈ ఎన్నికల్లో ప్రజలకు తనను కూడా పరిశీలించే అవకాశం ఇవ్వాలనుకుంటున్నట్టు ఆ బాలుడు చెప్పాడు. కాన్సాస్ చట్టాల ప్రకారం గవర్నర్ పదవికి ఎవరైనా పోటీ చేయవచ్చు. అభ్యర్థుల వయోపరిమితి, అనుభవం, నివాసం తదితర అంశాలకు సంబంధించి ఎటువంటి నిబంధనలు లేవని కాన్సాస్ ఎలక్షన్ డైరెక్టర్ బ్రయన్ కాస్కీ చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న విచితా హైస్కూల్ విద్యార్థి బర్గర్‌సన్ తాను కూడా బరిలోకి దూకాడు. ఎన్నికల్లో గెలిస్తే ఆరోగ్య పరిరక్షణ విధానంలో విప్లవాత్మక మార్పులు తెస్తానని, వైద్య అవసరాల కోసం మారిజువానా (గంజాయి) సేద్యాన్ని చట్టబద్ధం చేస్తానని చెప్పాడు.

శరద్‌యాదవ్ వెంట 14 రాష్ట్రాల నేతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: జేడీ(యూ) పార్టీని చేజిక్కించుకునేందుకు పూర్తి మద్దతు తనకు ఉన్నదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు శరద్‌యాదవ్ ధీమాతో ఉన్నారు. యాదవ సామాజికవర్గంలో ఇద్దరు రాజ్యసభ సభ్యులతోపాటు పలువురు జాతీయ కార్యవర్గసభ్యులున్నారని, 14 రాష్ట్రాల్లోని పార్టీ అధ్యక్షులు తమకు మద్దతు తెలుపుతూ లేఖలు రాశారని యాదవ్‌కు అత్యంత సన్నిహితులైన అరుణ్ శ్రీవాస్తవ తెలిపారు. నితీశ్‌కుమార్ తన సమతాపార్టీని జేడీ(యూ)లో కలుపక ముందు యాదవే జేడీ(యూ)కు అధినేత అని చెప్పారు. 'కావాలనుకుంటే నితీశ్‌కుమార్ సొంతంగా పార్టీ పెట్టుకోవచ్చు. జేడీయూ జోలికి రావద్దు' అని శ్రీవాత్సవ వివరించారు.



689 గదులు..
5,906 మంది విద్యార్థులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ శివారులోని ప్రభుత్వ విద్యాసంస్థలు



ప్రభుత్వ మోడల్ కం హైస్కూల్ భవనం

విద్యాలయాలు జిగేల్



హాస్టల్ గది

భూతల స్వర్గంలా ప్రభుత్వ విద్యాసంస్థలు
- యూనివర్సిటీస్థాయిలో నలుగురికి ఒక గది
- పాఠశాల నుంచి డిగ్రీ వరకు ప్రత్యేక బోధన
- బాలబాలికలకు వేర్వేరుగా వసతిగృహాలు
- స్వయంగా రూపకల్పన చేసిన సీఎం కేసీఆర్

ఇది గజ్వేల్

గజ్వేల్, నమస్తే తెలంగాణ:

సిద్దిపేట జిల్లా గజ్వేల్.. విద్యాలయాల కేంద్రంగా వెలిగిపోతున్నది! దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది! గజ్వేల్ పట్టణ సమీపంలో బాలికలకు, మరో అర కిలోమీటర్ దూరంలోని సంగాపూర్‌లో బాలురకు ప్రత్యేకంగా అధునాతన విద్యాలయాలను నిర్మిస్తున్నారు. రూ. 146.28 కోట్ల వ్యయంతో 60 ఎకరాల్లో 9 లక్షల ఎస్ఎఫ్‌టీ ప్లింత్ ఏరియాలో పాఠశాల, ఇంటర్, డిగ్రీ కళాశాలల తరగతి గదులు, హాస్టల్ భవనాల నిర్మాణాలు పూర్తికావొస్తున్నాయి. రెండుచోట్లా కలిపి 250 తరగతి గదులు, 439 హాస్టల్ గదులు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే 4,150 మంది డే స్కాలర్స్ ఉండగా, 1,756 మంది హాస్టళ్లలో ఉంటున్నారు. విద్యార్థుల కోసం విశాలమైన గదులు, 12 ఫీట్ల వెడల్పుతో పెద్ద కారిడార్ల ఏర్పాటుతో వెంటిలేషన్ బాగుండేలా నిర్మించారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల హాస్టల్‌లో నలుగురు విద్యార్థులకు ఒక గది కేటాయించారు. బెడ్స్, రీడింగ్ చైర్ కం టేబుల్, స్టడీ మెటీరియల్, బీరువాతోపాటు ఒక్కోగదికి ప్రత్యేకంగా టాయిలెట్ కం బాత్‌రూం నిర్మించారు. ఒక్కో హాస్టల్ విద్యార్థులంతా ఒకేసారి కలిసి (కనీసం 500 మంది) భోజనం చేసేలా సువిశాలమైన డైనింగ్‌హాల్ ఏర్పాటుచేశారు. తరగతి గదుల్లో వెంటిలేషన్, లైటింగ్, డ్యూయల్ డెస్కులు ఉన్నాయి. బిట్స్, ఐఐటీ తరహాలో ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. బాలికల హాస్టల్‌కు రక్షణగా ప్రహరీ, మెయిన్‌గేట్ వద్ద వాచ్‌మన్ ఉన్నారు. ప్రతి భవనంలో ఆర్వోప్లాంట్ ద్వారా శుద్ధ జలాన్ని అందిస్తున్నారు. డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, చుట్టూ గ్రీనరీ, విశాలమైన ఆటస్థలాలు, అంతర్గత రోడ్లు ఏర్పాటవుతున్నాయి. సోలార్ లైటింగ్ సిస్టం, సెంట్రల్ ఏసీతోపాటు, అధునాతన ఆడిటోరియాలను రెండు హబ్‌లకు ఒక్కొక్కటి చొప్పున నిర్మిస్తున్నారు. ఇందులో వెయ్యి మంది సామర్థ్యంతో జీ ప్లస్ టు భవననిర్మాణం జరుగుతున్నది. డ్రైనేజీ నీటిని ఎస్‌టీపీ ద్వారా రీసైక్లింగ్‌చేసి మొక్కలకు వాడేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రత్యేకంగా డిజైన్ చేసిన సీఎం

గజ్వేల్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో సీఎం కే చంద్రశేఖర్‌రావు భారీ ప్రణాళికలు రచించారు. నియోజకవర్గంలోని ములుగులో అటవీ కళాశాల, హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే ఈ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీతోపాటు మౌలిక సదుపాయలు కల్పించి పచ్చదనం కోసం మొక్కలు నాటించి ఆహ్లాద వాతావరణంలో బోధన జరిగేలా అభివృద్ధి చేశారు. రాష్ట్రం మొత్తానికి కేజీ టు పీజీ విద్యావ్యవస్థలో గజ్వేల్‌ను ఆదర్శంగా నిలుపాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగానే పాఠశాల నుంచి డిగ్రీ వరకు బాలబాలికలకు విద్యాలయాలను సొంతంగా డిజైన్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న నిపుణులు సైతం ఈ సౌకర్యాలు చూసి ఆశ్చర్యపోతున్నారు. గజ్వేల్ ఎడ్యుకేషనల్ హబ్‌గా మారడంతో ప్రైవేటు మెడికల్ కాలేజీ, ఇతర కళాశాలలూ ఏర్పాటవుతున్నాయి.

40 ఎకరాల్లో బాలుర ఎడ్యుకేషనల్ హబ్

సంగాపూర్ వద్ద సుమారు 40ఎకరాల్లో బాలుర ఎడ్యుకేషనల్ హబ్ నిర్మించారు. జీప్లస్ వన్‌తో కూడిన 24గదుల భవనాన్ని పాఠశాల విద్యార్థుల కోసం, 34 గదులతో జీప్లస్2 భవనాన్ని జూనియర్ కాలేజీ కోసం, డిగ్రీ కాలేజీ కోసం జీ ప్లస్2 అంతస్తులతో 65 గదులను నిర్మిస్తున్నారు. వారంలో వీటిని పూర్తి చేసి అప్పగించనున్నారు. హాస్టల్ విద్యార్థులకోసం 124 గదులతో జీ ప్లస్3 భవన నిర్మాణం కొనసాగుతున్నది. 436 మంది విద్యార్థులకోసం నిర్మిస్తున్న ఈ భవనం రెండు నెలల్లో పూర్తికానున్నది. 123 గదులతో 500 మంది విద్యార్థుల కోసం నిర్మిస్తున్న జీ ప్లస్3 కాలేజీ హాస్టల్ భవనం వచ్చే నెలలో పూర్తవనున్నది. ఇక్కడ కూడా వెయ్యి మంది సామర్థ్యంతో జీప్లస్2 ఆడిటోరియం నిర్మాణం కొనసాగుతున్నది.

దేశంలోనే ఆదర్శం



గజ్వేల్‌లో నిర్మించిన ఎడ్యుకేషనల్ హబ్ దేశంలోనే ఆదర్శంగా మారనున్నది. బాలబాలికలకు నిర్మించిన ఎడ్యుకేషన్ హబ్‌లో అధునాతన సౌకర్యాలను సమకూర్చాం. జాతీయ, అంతర్జాతీయ విద్యాప్రమాణాలతో నూతన కోర్సులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. అన్ని విద్యా సంస్థలను ఒకేప్రాంతంలో ఏర్పాటు చేశాం.

- వెంకటరామరెడ్డి, సిద్దిపేట కలెక్టర్

శరవేగంగా నిర్మాణాలు



గజ్వేల్ ఎడ్యుకేషనల్ హబ్‌ను గడువులోపే పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగిస్తాం. ఫిబ్రవరి 2016లో మొదలైన పనులు పూర్తికావొచ్చాయి. సీఎం కేసీఆర్ స్వయంగా ఇచ్చిన డిజైన్ ప్రకారం నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సీఎం కేసీఆర్ పరిశీలించగా, కలెక్టర్ వెంకటరామరెడ్డి పర్యవేక్షించి సలహాలు ఇస్తున్నారు.

- హన్మంతరావు, గడ ఓఎస్డీ

ఆహ్లాదకర వాతావరణంలో బాలికల హబ్



గజ్వేల్ సమీపంలోని కస్తూర్బా పాఠశాల ప్రాంతంలో 20 ఎకరాల్లో బాలికల ఎడ్యుకేషనల్ హబ్ నిర్మించారు. జీప్లస్ 2 అంతస్తులతో వెయ్యి మంది సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మిస్తున్నారు. 54 గదులతో 600 మంది విద్యార్థుల కోసం నిర్మించిన జీప్లస్2 డిగ్రీ కాలేజీ భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి. జీప్లస్3 అంతస్తులతో 520 మంది డిగ్రీ, జూనియర్ కాలేజీల విద్యార్థినుల కోసం 130 గదులతో హాస్టల్ భవనాన్ని నిర్మించారు. మోడల్, ఉన్నత పాఠశాల కోసం 43 గదులతో జీప్లస్2 భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో మోడల్‌స్కూల్, రెండో ఫ్లోర్‌లో ఉన్నత పాఠశాల కొనసాగుతున్నది. జీప్లస్4లో 60 గదుల్లో జూనియర్, డిగ్రీ విద్యార్థుల హాస్టల్ భవనం 240 మంది విద్యార్థినుల కోసం నిర్మిస్తున్నారు. 35 గదులతో 650 మంది సామర్థ్యంతో నిర్మించిన జీప్లస్2 భవనంలో జూనియర్ కళాశాల కొనసాగుతున్నది.



విద్యార్థినుల హాస్టల్ భవనాలు

సీఎం కేసీఆర్ మంచి వసతులు కల్పించారు



తరగతి గది, హాస్టల్‌లో వసతులు బాగున్నాయి. ఇంత మంచి సౌకర్యాలు ఎక్కడా లేవు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు మంచి వసతులు కల్పించారు. బాగా చదువుకోవడానికి వీలు కలిగింది. ఇది పేద విద్యార్థులకు మంచి అవకాశం.

– రేణుక, విద్యార్థిని, ఏటిగడ్డ కిష్టాపూర్

కార్పొరేట్‌స్థాయిలో సౌకర్యాలు



ఇక్కడ చదువుకోవడానికి మంచి సౌకర్యాలు ఉన్నాయి. 6వ తరగతి నుంచి గజ్వేల్‌లోనే చదువుతున్నా. భోజనం, లైబ్రరీ, ల్యాబ్ ఇతర సౌకర్యాలు బాగున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి సౌకర్యాలు లేవు.

–బానోత్ నీల, విద్యార్థిని, దంతెపల్లి

మంచిగా చదువుకుంటున్నాం



మంచిగా చదువుకుంటున్నాం. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ఏర్పాట్లు ఉండటంతో ఇక్కడ చదువుకున్నవారు కూడా మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత చదువులకు అర్హత పొందే వీలు ఏర్పడింది.

– శ్రీదేవి ఇంటర్ విద్యార్థిని, నవాబుపేట

కుంతియా.. వాస్తవాలు తెలుసుకో!

- ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హితవు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలుసుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాకు భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కుంతియా చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రజలని ఒక కుటుంబంగా భావించి ప్రభుత్వ పథకాలను సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా, ఆసరా పింఛన్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపిణీ, రూపాయికే కిలో బియ్యం, కల్యాణలక్ష్మి , షాదీముబారక్, చేపల పెంపకం వంటి ప్రభు త్వ పథకాల ద్వారా పార్టీలకతీతంగా లక్షల మంది ప్రజ లు లబ్ధిపొందుతున్నారని వెల్లడించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సీఎం కేసీఆర్, ఆయన కుటుంబంపై కుంతియా అవాకులు, చవాకులు పేలడం సరికాదని హితవు పలికారు. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్‌సింగ్ వరకు 42 ఏండ్ల కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనపై చార్జిషీట్ వేస్తామన్నారు. తెలంగాణకు చేసిన అన్యాయాలు, ద్రోహాలు, మోసాలు, రాష్ట్ర ప్రజలపై సాగిన దాష్టికాలపై చార్జిషీట్‌లో వివరిస్తామన్నారు. కుంతియా ఇకనైనా అవివేకంతో విమర్శలు చేయడం మానుకోవాలని నర్సయ్యగౌడ్ సూచించారు.

జెండాలు లేకుండా ప్రచారం చేయండి

- ఏపీ బీజేపీ శ్రేణులకు టీడీపీ సూచన
- తిరస్కరించిన కమలనాథులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఉపఎన్నికల్లో టీడీపీ, బీజేపీ మిత్రపక్షాల మధ్య ఎన్నికల ప్రచారం దూరాన్ని పెంచుతున్నది. ఓ వైపు ఎన్నికల ప్రచారానికి ఆహ్వానిస్తూనే బీజేపీ జెండాలు, కండువాలు ధరించవద్దని టీడీపీ అగ్రనేతలు షరతు పెట్టడంపై కమలనాథులు భగ్గుమంటున్నారు. 'అడ్డదిడ్డమైన షరతులు పెట్టి టీడీపీకి ప్రచారం చేయడం అవసరమా? రమ్మంటే వస్తాం. కానీ, అవమానిస్తే ఊరుకోబోం' అని బీజేపీ శ్రేణులు తెగేసి చెప్తున్నాయి. ఓట్లు ముఖ్యమని భావిస్తున్న టీడీపీ.. మిత్రపక్షం ఎదుగుదలను మాత్రం ఓర్వలేకపోతున్నదని మండిపడుతున్నాయి. ఇటీవల టీడీపీ నేతల ఆహ్వానం మేరకు కొందరు బీజేపీ నేతలు తమ పార్టీ జెండాలు, మెడలో కండువాలు కప్పుకొని ప్రచారపర్వంలో పాలుపంచుకున్నారు. అనంతరం కాషాయ జెండాలు, కండువాలు వేసుకోరాదని టీడీపీ నేతలు షరతు విధించడంతో బీజేపీ నేతలు అర్ధంతరంగా ప్రచారం నుంచి నిష్క్రమించారు. కాగా, నంద్యాల ఉపఎన్నికల్లో బీజేపీ ఓట్లు కావాలి కానీ, వారి ప్రచారం మాత్రం సైలెంట్‌గా సాగాలంటూ టీడీపీ నేతలు తమపై ఒత్తిడి తెచ్చి బలవంతం చేస్తున్నారని బీజేపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుకు ఫిర్యాదుచేశారు.

ఏపీలో ఆర్టీసీ బస్సులో మంటలు

అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని విజయవాడ బెంజ్ సర్కిల్‌లో ఆదివారం తృటిలో పెనుప్రమాదం తప్పింది. బస్టాండ్ నుంచి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సును ఓ లారీ ఢీకొట్టింది. దీంతో డీజిల్ ట్యాంక్ పేలి బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా పొగ వ్యాపించి, మంటలు చెలరేగడంతో ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ కిందకు పరుగెత్తారు. స్థానికులు, బస్సుడ్రైవర్ అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ ఘటనతో బెంజ్ సర్కిల్ వద్ద మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది.

జాతీయ పంచాయతీ పురస్కారాలకు దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ఉత్తమ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు అవార్డులు అందించేందుకు కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. 2011-12 నుంచి ఏటా ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దివస్ సందర్భంగా ఒక్కో రాష్ట్రం నుంచి ఉత్తమ గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు ఈ అవార్డులను కేంద్రం అందిస్తున్నది. అవార్డులకోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ వెల్లడించింది. దరఖాస్తు వివరాలను panchayataward.gov.inలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

రేషన్.. ఉండదు పరేషాన్

- పోర్టబిలిటీకి అన్యూహ్య స్పందన
- నచ్చిన షాపులో సరుకులు తీసుకునే విధానం
- గ్రేటర్‌లో విజయవంతంగా అమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రేషన్ డీలర్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూసే రోజులు పోయాయి. డీలర్లే లబ్ధిదారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు వచ్చాయి. గ్రేటర్ పరిధిలో అమలుచేస్తున్న రేషన్ పోర్టబిలిటీ విధానం వల్ల వచ్చిన మార్పు ఇది!! లబ్ధిదారులు తాము కోరుకున్న దుకాణం నుంచి సరుకులు తీసుకునేందుకు వీలుగా తీసుకొచ్చిన పోర్టబిలిటీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం విజయవంతంగా అమలవుతున్నది. పోర్టబిలిటీని రాష్ట్రవ్యాప్తం చేసే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని రేషన్ దుకాణాల్లో అమలుచేస్తున్న పోర్టబిలిటీ విధానం వల్ల గడిచిన జూన్, జూలై నెలల్లో 2,54,145 లావాదేవీలు జరిగాయి. రేషన్ దుకాణాల ద్వారా జూన్‌లో 21 లక్షల 99 వేల మెట్రిక్ టన్నుల బియ్యం విక్రయించగా, జూలైలో 32 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని విక్రయించారు. అంటే ఒక్క నెలలో 30శాతం వరకు వృద్ధి కనిపించింది. గ్రేటర్ పరిధిలో మొత్తం 1545 రేషన్ దుకాణాలు ఉండగా.. వివిధ కారణాలతో 265 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న లబ్ధిదారులను దగ్గరిలోని రేషన్ డీలర్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు సమస్యలు ఎదురయ్యేవి. రేషన్ కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సి వచ్చేది. అలాంటి సమస్యలకు పోర్టబిలిటీతో పరిష్కారం లభించినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా 17,200 రేషన్ దుకాణాలు ఉండగా, పలు కారణాల వల్ల 850 వరకు దుకాణాలు డీలర్లు లేక ఖాళీగా ఉన్నాయి. పోర్టబిలిటీ విధానాన్ని అన్నిషాపుల్లో అమలుచేయాలన్న ప్రభుత్వ ఆలోచన కార్యరూపం దాల్చితే లబ్ధిదారులకు సరుకులు అందుకోవటం మరింత సులభతరమవుతుంది.

డీలర్ల మధ్య పెరిగిన పోటీ

బినామీ రేషన్ డీలర్లు, సమయపాలన పాటించని



డీలర్లపై పోర్టబిలిటీ విధానం తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. లబ్ధిదారులు తమకు నచ్చిన షాపులనుంచి సరుకులు తీసుకోవడం ప్రారంభించడంతో డీలర్ల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. అవసరమైతే ఎక్కువ సమయంపాటు దుకాణాలు తెరిచేందుకు సిద్ధమవుతున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు దుకాణాలు తెరవాల్సి ఉండగా.. పలుచోట్ల గంట అదనంగా తెరిచి ఉంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు లబ్ధిదారులు సైతం మెరుగైన సేవలందిస్తున్న రేషన్‌షాపుల వద్దకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సమయపాలన పాటించని, సరుకుల సరఫరాలో అక్రమాలు జరుతాయన్న ఆరోపణలున్న దుకాణాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. దీంతో ఆయా దుకాణాల్లో లావాదేవీలు తగ్గిపోతున్నాయి. ఇది మంచిపరిణామమని లబ్ధిదారులు అంటున్నారు.

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పోర్టబిలిటీ

గ్రేటర్ జిల్లాల్లో విజయవంతమైన రేషన్ పోర్టబిలిటీ విధానాన్ని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసేందుకు పౌరసరఫరాలశాఖ ముందుకుసాగుతున్నది. ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలు అందిన 10 వేల దుకాణాల్లో త్వరలో ఈ విధానం అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలకు వచ్చేనెల చివరివరకు ఈ-పాస్ యంత్రాలు అందనున్నాయి.

హజ్‌యాత్రకు బయల్దేరిన తొలి బృందం

యాత్రికులకు వీడ్కోలు పలికిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్‌యాత్రలో పాల్గొనేందుకు 450 మందితో కూడిన రాష్ట్ర హజ్‌యాత్రికుల తొలి బృందం ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి జెడ్డా నగరానికి బయల్దేరింది. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, టీఆర్ఎస్ నేతలు హజ్ హౌస్‌లో జెండా ఊపి యాత్రికులకు వీడ్కోలు పలికారు. మక్కా వెళ్లగానే తమ కుటుంబసభ్యుల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ కోరారు. హాజీల కోసం ఏర్పాట్లు చేయడం చాలా కఠినమైన పని అని, అయినా తెలంగాణ సర్కారు రూ.3 కోట్లు కేటాయించి అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్‌కమిటీ స్పెషల్ ఆఫీసర్ ఎస్‌ఏ షుకూర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎండీ సలీం, జామియా నిజామియా ఉపకులపతి కలీల్ అహ్మద్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెహ్రాజ్, స్థానిక కార్పొరేటర్ మమత తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హజ్ పర్యటన కాలాన్ని ఓడీగా పరిగణించండి

- సీఎంకు విద్యాశాఖ ఉద్యోగుల విన్నపం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ వాలంటీర్లుగా సౌదీ పర్యటన కాలాన్ని ఆన్ డ్యూటీగా పరిగణించాలని ఆరుగురు విద్యాశాఖ ఉద్యోగులు.. సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. హజ్-2017 యాత్రకు వెళుతున్న తెలంగాణ రాష్ట్ర యాత్రికులకు హజ్ సందర్భంగా సలహాలు, సూచనలు ఇస్తూ సహాయపడేందుకు తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ (టీఎస్‌హెచ్‌సీ) ద్వారా ఖాదీముల్ హుజ్జాజ్ (హజ్‌వాలంటీర్లు)లుగా విద్యా, పోలీసు, వైద్య ఆరోగ్య, సచివాలయం, వక్ఫ్‌బోర్డు, హజ్ కమిటీ, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 17 మందిని ఎంపికచేశారు. వీరిలో విద్యాశాఖకు చెందిన ఆరుగురు ఉద్యోగులు ఉన్నారు. వాలంటీర్లుగా వెళుతున్న ప్రభుత్వ ఉద్యోగులందరినీ హజ్ యాత్రికుల వెంట యాత్ర ముగించుకుని తిరిగి చేరుకునే కాలాన్ని ఓడీగా ఆయా శాఖలు పరిగణిస్తున్నాయి. గతంలో ప్రభుత్వాలు ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశాయి. కానీ ఈసారి పాఠశాల విద్యాశాఖ ఉద్యోగులకు మాత్రం ఆ శాఖ ఉన్నతాధికారులు ఆన్‌డ్యూటీగా ఒప్పుకొనేది లేదని తేల్చి చెప్పారు. ఈ కాలాన్ని లీవ్‌గా పరిగణించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ జీ కిషన్ సంబంధిత అధికారులకు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల అసెంబ్లీ మైనారిటీ సంక్షేమ కమిటీ సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. దీంతో మిగతా శాఖల ఉద్యోగుల తరహాలోనే వ్యవహరిస్తామని, వారి సౌదీ పర్యటన కాలాన్ని ఓడీగా పరిగణించేందుకు చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చెప్పినట్టు తెలిసింది.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 14 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM

మనసున్న మారాణి

సక్సెస్ మంత్ర



129 సంవత్సరాల చరిత్ర కలిగిన కిర్లోస్కర్ సిస్టమ్స్ లిమిటెడ్‌ను బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్తలు గీతాంజలి, విక్రం కిర్లోస్కర్ నిర్వహిస్తున్నారు. వారి గారాల పట్టి మానసి కిర్లోస్కర్. ప్రస్తుతం కిర్లోస్కర్ గ్రూపునకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. ఆమె చిన్నతనం నుంచే తల్లిదండ్రుల బాధ్యతలను గమనిస్తూ పెరిగారు. ప్రస్తుతం ఈ కుటుంబం నిర్వహిస్తున్న హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్ బిజినెస్ చూసుకుంటున్న మానసి అన్ని వర్గాల వారికీ మంచి వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా హాస్పిటల్స్‌ను స్థాపించే లక్ష్యంతో బెంగళూరులో ఆసుపత్రిని స్థాపించారు. త్వరలో పూణేలో ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు దేశవ్యాప్తంగా విస్తరిస్తానంటున్న మానసి సక్సెస్‌మంత్ర ఇది.

కిర్లోస్కర్ సిస్టమ్స్ లిమిటెడ్ మహారాష్ట్రలోని పుణెలో 1888లో ప్రారంభమైంది. ఈ సంస్థ పంపులు, వాల్వులను ఉత్పత్తి చేస్తున్నది. వాటిని ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలకు ఎగుమతి చేస్తున్నది. ఇంతటి చరిత్ర కలిగిన కిర్లోస్కర్ గ్రూపును వారి వారసులైన బెంగళూరుకు చెందిన గీతాంజలి, విక్రం కిర్లోస్కర్‌లు నిర్వహిస్తున్నారు. వారి కూతురే 27 సంవత్సరాల మానసి కిర్లోస్కర్. మహారాష్ట్రలో 129 సంవత్సరాలుగా నాణ్యత, విలువలు, విశ్వాసాలకు మారుపేరుగా చెప్పుకునే భారతదేశపు పాతతరం వ్యాపార కుటుంబానికి చెందిన గొప్ప పారిశ్రామికవేత్త అయిన ఎస్.ఎల్. కిర్లోస్కర్‌కు మనువరాలు. ఆమెకు చిన్నప్పటి నుంచే బిజినెస్ పట్ల ఆసక్తి ఎక్కువ. ఒక్కాగానొక్క కూతురైనా గారాబంగా పెరుగలేదు. బాధ్యతలను తీసుకోవడానికి ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. ఆమె చిన్నప్పటి నుంచీ తల్లికి చెందిన యాడ్ ఏజెన్సీతో పాటు తండ్రి బాధ్యతలను గమనిస్తూ పెరిగింది. సమకాలీన ప్రపంచంలో విస్తృత ఆదరణ పొందుతున్న ఈ-కామర్స్ తరహా వ్యాపారం ప్రారంభించాలనే ఆలోచనలోనూ ఉందట మానసి.

వారసత్వాన్ని కొనసాగిస్తూ..

కిర్లోస్కర్ గ్రూపు ప్రధాన కార్యస్థలం మహారాష్ట్రలోని పుణెలో ఉంది. భారతదేశంలోని మొట్టమొదటి వ్యాపార కుటుంబాలలో ఒకటైన కిర్లోస్కర్ వంశంలో మానసి ఐదవ తరం. ఆమె బెంగళూరులోని మాల్యా అదితి ఇంటర్నేషనల్ స్కూల్లో ప్రాథమిక విద్యను అభ్యసించి రోడే ఐలాండ్ స్కూల్ ఆఫ్ డిజైన్ (బోస్టన్, అమెరికా) నుండి ఫైన్‌ఆర్ట్స్‌లో పట్టా పొందారు. అనంతరం వ్యాపార రంగంలో భాగస్వామి అయ్యారు. మానసి 2013లోనే కిర్లోస్కర్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అంతేకాదు, భారతదేశంలో ఆధునిక టెక్నాలజీతో తయారయ్యే మెడికల్ ఎక్విప్‌మెంట్ ను తయారు చేసే కిర్లోస్కర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (కెటిపిఎల్)కు బోర్ట్ ఆఫ్ డైరెక్టర్ కూడా.

యువ వ్యాపారస్థురాలు

మానసి తొలుత రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అయిన కిర్లోస్కర్ బిజినెస్ పార్క్ పనులను నిర్వహించారు. అందులో ఇంటి అద్దెలు తగ్గించడం, మరిన్ని ప్రీమియం అవకాశాలను కల్పించడం అవసరమని గుర్తించారు. అక్కడి సమస్యలను అధ్యయనం చేశారు. తన టీం సహాయంతో ఆర్థిక లావాదేవీలు, మెరుగైన నిర్వహణ, అందంగా తీర్చిదిద్దడం, మరమ్మతు ప్రక్రియను అప్‌గ్రేడ్ చేయడం వంటి వాటిపై దృష్టి సారించారు. దీనికోసం మూడు సంవత్సరాల ప్రణాళికను రూపొందించారు. ఈ సమయంలో ఇంటీరియర్, లేఅవుట్‌లను అప్‌గ్రేడ్ చేస్తారు. దీనివల్ల వాటిని పెద్ద కార్పొరేట్ కార్యాలయాల కోసం ఆయా సంస్థలు అద్దెకు తీసుకుంటాయి. అదే సమయంలో వాటి విలువ కూడా పెరుగుతుందని ఆమె గుర్తించారు. ఈ విషయంలో బిజినెస్ పార్కు సైట్‌లో ఎప్పుడూ సమీక్ష సమావేశాలు నిర్వహించడంతోపాటు వాటిని జపాన్, టయోటా మార్గాల్లో పయనింపజేయాలని ఆమె ఆలోచన. అందులో భాగంగా మొట్టమొదటి ఆసుపత్రిని బెంగళూరులో 360 పడకలతో టయోటట్సుషో, జపాన్‌కు చెందిన సీకాం హాస్పిటల్‌తో కలసి జాయింట్ వెంచర్‌గా ప్రారంభించారు. దీన్ని భారతదేశమంతా విస్తరించాలని నిర్ణయించారు. మానసి సిఐఐలోని యంగ్ ఇండియన్స్‌లో కూడా ఒక భాగస్వామి. అలాగే, జర్మన్‌కు చెందిన అసోసియేషన్ ఆఫ్ బిజినెస్‌మెన్ ఓనర్స్ ఫోరంలో సభ్యురాలుగానూ ఉన్నారు.

మంచి చిత్రకారిణి

మానసి చిన్ననాటి నుంచే చిత్రకారిణి. ఒక రకంగా చెప్పాలంటే చేతిలో పెయింటింగ్ బ్రష్‌తో జన్మించారనొచ్చేమో. చిన్నతనంలోనే గోడలపైనా, బెడ్‌షీట్లపైనా బొమ్మలు వేసేది. 13 సంవత్సరాల వయస్సులో 23 పెద్ద ఆయిల్ పెయింటింగ్స్ వేయడంతోపాటు ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు వ్యాపార దిగ్గజాలు కిరణ్ మజుందార్, విజయ్ మాల్యా, శేఖర్‌గుప్తాలతో పాటు ప్రముఖ చిత్రకారుడు ఎం.ఎఫ్. హుస్సేన్ కూడా రావడం విశేషం.

అనుకోని అరంగేట్రం

మానసి పోస్ట్ కాలేజీ పని ప్రారంభించారు. కానీ, దాని వల్ల అధిక ఒత్తిడి ఉంటుందని భావించారు. అంతేకాదు, అది త్వరగా పూర్తవుతుందన్న నమ్మకం కూడా లేదు. ఒక గురువారం ఆ పని నుండి తిరిగి వచ్చిన తర్వాత మరునాటి సోమవారం వారి హోల్డింగ్ కంపెనీ అయిన కిర్లోస్కర్ సిస్టమ్స్ మొదటి బోర్డు సమావేశానికి హాజరు కావాలని చెప్పారట. అలా వెళ్ళిన ఆమె అనుకోకుండానే వ్యాపారంలో భాగమైంది. ఇప్పుడు ఆమె జీవితంలోకి తొంగిచూస్తే బెంగళూరు సమీపంలో తన మొదటి నివాస ప్రాజెక్ట్ రూ.1500 కోట్లతో పూర్తి చేశారు. రూ.1200 కోట్లతో వాణిజ్య స్థలాల ప్రాజెక్ట్ పూర్తయ్యింది. ఇక ఆమె కలగన్న ప్రాజెక్ట్ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ. దానికి సంబంధించిన ప్రాజెక్ట్ కూడా పూరయ్యింది. మానసి వారంలో ఐదురోజులు వ్యాపారం, వారాంతంలో సామాజిక సేవకు కేటాయిస్తున్నారు.

మానసి ఒక యువతిగా తన విధి నిర్వహణలో, సమాజ సేవలో విజయం సాధించిందనే చెప్పొచ్చు. ఈ ఐదవ తరం కిర్లోస్కర్ వారసురాలు ఖచ్చితంగా తన గొప్ప కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోగలదనడంలో సందేహం లేదు. అంతేకాదు, భారతదేశ యువతరానికి ఆమె ఒక స్ఫూర్తిదాయకమైన వాణిజ్యవేత్త కూడా.

పరోపకారి

మానసి వ్యాపారస్థురాలే కాదు, నలుగురికి సాయం చేసే మనసున్న పరోపకారి కూడా. ఆమె 13 సంవత్సరాల వయస్సు నుండే సామాజిక సేవకు శ్రీకారం చుట్టారు. 'కేరింగ్ విత్ కలర్స్' పేరుతో ఎన్‌జీవోను స్థాపించారు. 14 సంవత్సరాల వయస్సులోనే పేద పిల్లలకు విద్యనందించే క్రిస్టెల్ హౌస్ ఫౌండేషన్ అనే ఎన్జీవోతో కలిసి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చిత్రలేఖనం, హస్తకళలు బోధించేవారు.

16 సంవత్సరాల వయస్సులో సింగపూర్‌లో హైస్కూల్‌లో చదువుతున్న సమయంలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా వియత్నాం కూడా వెళ్లారు. అంతేకాదు, తోటి పిల్లలతో కలసి కమ్యూనిటీ సర్వీస్ కేంద్రాలను కూడా నిర్వహించారు. ఆమె తన చిత్రకళను, సమయాన్ని, ధనాన్ని సమాజాభివృద్ధి కోసం వినియోగిస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

మానసి గౌర్మెట్ ఫుడ్‌ని ఇష్టపడుతుంది. అది ఆమె తండ్రి నుంచి వచ్చిన ఒక ఫ్యాషన్. కూతురు, తండ్రి కలిసి తరుచుగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మంచి రెస్టారెంట్లను సందర్శిస్తారు. వివిధ ప్రదేశాలు, ఆర్ట్, వాటర్ స్పోర్ట్స్, బీచ్‌లను సందర్శించడం.. తెప్ప, స్విమ్మింగ్, సముద్రంలో డైవింగ్ చేయడం వంటి జల క్రీడలను ఇష్టపడుతారు. అంతేకాదు యోగా, లాన్ టెన్నిస్ హైకింగ్ వంటివన్నా కూడా ఆమెకు ఇష్టం. మానసి మంచి చదువరి, రచయిత కూడా. 2011లో ఆమె తనకు ఇష్టమైన సబ్జెక్టులు చిత్రకళ, చరిత్ర తదితర అంశాలపై ఎకనామిక్ టైమ్స్ పత్రికలో ఆరు వ్యాసాలు రాశారు.



అమ్మకు అవార్డు!



ప్రత్యేకమైన అవసరాలున్న పన్నెండు మంది పిల్లల్ని పద్నాలుగు సంవత్సరాలుగా సొంత పిల్లలుగా చూసుకుంటున్నందుకు గాను ఆమె సేవకు గుర్తింపుగా అవార్డు దక్కింది. ఇంతకీ ఎవరామె?

భోపాల్‌లోని ఖజురీ కలన్ అనే ఊరు ప్రత్యేకమైన పిల్లల కోసం కేటాయించినది. అక్కడ మొత్తం 14 ఇళ్లు ఉంటాయి. అందులో 186 మంది పిల్లలు.. వారికి 14 మంది తల్లులు, 12 మంది ఆయాలు ఉంటారు. వాళ్లందరికీ అక్కడ మెడికల్ థెరపీ చేస్తుంటారు. వాళ్ల పనులు వాళ్లు చేసుకునేలా శిక్షణ ఇస్తుంటారక్కడ. ఆ శిక్షకులలో ఒకరు గీతా సింగ్. ఈ పనులన్నీ చేసేది ఎస్ఓఎస్ అనే సంస్థ. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా చాలా చోట్ల ఇలాంటి సెంటర్లు ప్రారంభించి పిల్లలకు చికిత్స ఇస్తుంటుంది. ఇందులోకి 2003లో అడుగుపెట్టింది గీత. ఆమె కూతురు పుట్టుకతోనే మూగ, చెవిటి. దాంతో ఆమెకు ఇక్కడ థెరపీ ఇప్పించేందుకు తీసుకొచ్చింది. అనుకోకుండా అక్కడ మరికొంతమందికీ అమ్మలా మారాల్సి వచ్చింది. ఎందుకంటే అందులో మానసిక దివ్యాంగులు కూడా ఉన్నారు. వాళ్లని కంటికి రెప్పలా కాపాడడం తన వల్ల అవుతుందా అనుకున్నది మొదట. కానీ ఓపికగా అందరినీ అక్కున చేర్చుకున్నది గీత. ఇప్పుడు ఆమె శిక్షణ ఇచ్చిన కొంతమంది పిల్లలు 2015లో జరిగిన స్పెషల్ ఒలింపిక్స్‌కు కూడా ఎంపికయ్యారు. ఇలాంటి సేవలకు గాను ఏటా హెల్ముట్ కుటిన్ అవార్డును ఇచ్చే ఓ సంస్థ ఈ సారి ఆ అవార్డును గీతకు అందజేసింది.

జిహ్వాకో బుద్ధి..



పెంపుడు జంతువులు అంటే ఎవ్వరికి ఇష్టం ఉండదు చెప్పండి. మధ్య తరగతి నుంచి హైక్లాస్ వరకూ వారి స్థోమతకు తగ్గట్లుగా ఏదో జంతువును సాదుకుంటుంటారు. కానీ ఈ లండన్ భామ మాత్రం.. చాలా వెరైటీ గురూ.. ఎలాగంటారా..?

పుర్రెకో బుద్ధి జిహ్వాకో రుచి అనే దానికి ఈ అమ్మాయి ఓ చక్కని ఉదాహరణ. ఎందుకంటే అందరూ ఏ కుక్కనో, పిల్లినో, పక్షినో పెంచుకుంటే లండన్‌కు చెందిన ఎంజోటిక్ మాత్రం విషపూరితమైన పాములు, కొండచిలువలు, బొద్దింకలు, నత్తలు, ఫెర్రెట్లు, సాలీడులను పెంచుకుంటున్నది. అవి కూడా ఇతర దేశాలకు చెందినవి. వాటితోనే గడుపుతూ.. ఆ వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నది. అవి కాస్తా వైరల్ కావడంతో ఎంజోటిక్ పాపులర్ అయ్యింది. వీటి గురించి చుట్టుపక్కల పిల్లలకు వివరిస్తూ.. వాటిని ఎలా పెంచాలో అవగాహన కల్పిస్తున్నది. రెబల్ సర్కస్ పేరుతో వాటి వీడియోలు, ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో అప్‌లోడ్ చేస్తున్నది. చాలామంది ఇంత లేతవయసులో ఇదేం పోయేకాలం అంటుంటే.. జీవజాలం అధ్యయనానికి, అవగాహనకు ఎంజోటిక్ మంచి ప్రయత్నం చేస్తున్నదని మరికొందరు కొనియాడుతున్నారు.

ఆరోగ్య చిట్కాలు



- సోంపు శరీరంలో మలినాలను తొలిగిస్తుంది. ఉదర సంబంధ వ్యాధులను నివారిస్తుంది.
- రోజూ పావు స్పూన్ మేర ఆహారంలో సోంపు తీసుకుంటే చర్మ సమస్యలు దూరమవుతాయి.
- సోంపు ద్వారా రక్తపోటు, కొవ్వును కరిగించుకోవచ్చు.
- పిల్లల్లో సోంపు జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- నిత్యం తీసుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

నడుము నొప్పి ఎందుకు?

అడుగండి చెబుతా

నా వయసు 26 సంవత్సరాలు. ఐదు నెలల క్రితం నాకు పాప పుట్టింది. నేను పాపకు పాలు ఇస్తున్నాను. నాకు డెలివరీ సమయం నుంచి నడుము నొప్పి విపరీతంగా వస్తున్నది. ఇది సిజెరియన్ సమయంలో ఇచ్చిన ఇంజక్షన్ వల్ల అని కొంత మంది అంటున్నారు. నొప్పి తగ్గడానికి తగిన సలహా ఇవ్వండి. రెండో బిడ్డ కోసం మరో రెండేళ్లు సమయం తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. దీనికి తగిన పద్ధతులు తెలుపండి?

రాధిక, హనుమకొండ



రాధిక గారు! మీరు మీ పాపకు తల్లిపాలు ఇస్తున్నందుకు అభినందనలు. ప్రసవానంతరం నడుము నొప్పి అనేది సాధరణంగా సిజేరియన్ ద్వారానే కాకుండా నార్మల్ డెలివరీ అయిన వారిలో కూడా చూస్తాం. గర్భం ధరించినపుడు శరీరంలో చోటుచేసుకునే మార్పులు, వెన్నెముక పైన ఒత్తిడి, కాల్షియం లోపం వంటివి దీనికి కారణం. చాలా మంది అనుకున్నట్టు వీపునకు ఇచ్చే ఇంజక్షన్ వల్ల ఈ నొప్పి రాదు. ఇది తగ్గడం కోసం కూర్చునే పద్ధతిని సరిచేసుకుని వీపునకు ఆధారం తీసుకుని కూర్చోవడం మంచిది. పాపకు పాలు పడుతున్నపుడు సరియైన పద్ధతిలో ఎక్కువగా వెన్నెముకను వంచకుండా నిటారుగా కూర్చోవాలి. వీలును బట్టి ప్రతి రోజూ 20 నుంచి 30 నిమిషాలు వాకింగ్ చెయ్యడం కూడా చాలా మంచిది. రెండో గర్భానికి 2 సంవత్సరాల ఎడం తీసుకోవడం కూడా చాలా మంచి విషయం. నెలసరి ఇంకా మొదలవక పోతే గర్భం రాదు అనేది అపోహ మాత్రమే. కాబట్టి ముందు నుంచి జాగ్రత్త తీసుకోవడం ఎంతో అవసరం. క్యాలెండర్ పద్ధతి పాటించవచ్చు. సరియైన పద్ధతిలో నిరోధ్ వంటి సాధనాలు ఉపయోగించవచ్చు. కాపర్ టీ వేయించుకుంటే మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు అలాగే ఉండనివ్వవచ్చు. అవసరమనుకుంటే మధ్యలో తీయించేయవచ్చు. పాలు పట్టే సమయంలో వాడుకోవడానికి ప్రత్యేకమైన కాంట్రాసెప్టివ్ పిల్స్ దొరుకుతాయి. మూడు నెలలకొకసారి తీసుకునే డపో ఇంజెక్షన్ కూడా దొరుకుతుంది. వీటి గురించి మీ డాక్టర్‌తో చర్చించి మీకు అనుకూలమైన పద్ధతిని ఎంచుకోండి.



డాక్టర్ జి. వింద్య
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్

వర్షాకాలం ఆహారం..



- ఈ సీజన్‌లో కూరగాయలు, ఆకుకూరలపై బ్యాక్టీరియా, ఇతర క్రిములు ఉంటాయి. కాబట్టి వాటిని నేరుగా తీసుకోవద్దు. కడిగి, ఉడికించిన తర్వాతే తినాలి.
- వేపుళ్ల కంటే ఆవిరి మీద వండినవి తినడం ఆరోగ్యానికి మంచిది.
- మాంసాన్ని వేపుడు కంటే గ్రిల్డ్, బాగా ఉడికించి తినడం మచింది.
- వ్యాధినిరోధకతను పెంచే నిమ్మ, నారింజ, బత్తాయి, జామ, దానిమ్మ వంటి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు తినాలి. వీటితోపాటు క్యాప్సికమ్, బెర్రీస్, గుమ్మడి వంటివి కూడా తీసుకోవాలి.
- వాతావరణం చల్లగా ఉండడంతో చాలా మంది నీరు తక్కువగా తాగుతారు. దీంతో జీర్ణశక్తి మందగిస్తుంది. ఇందుకు కాచి చల్లార్చిన నీరు తాగాలి. రోజుకోసారి పండ్ల రసాలు, తాజా కూరగాయల రసాలు తాగితే మంచిది.



వ్యాయామం మానొద్దు

నెలసరి సమయం కదా విశ్రాంతి అవసరం అని అనుకుంటారు చాలా మంది. విశ్రాంతి అవసరమే, కానీ వ్యాయామం మాత్రం మానొద్దని నిపుణులు సూచిస్తున్నారు. నెలసరి సమయంలో కూడా సౌకర్యంగా ఉన్నంత వరకు వ్యాయామం చేసుకోవచ్చు. క్రమం తప్పని వ్యాయామం వల్ల పీఎంఎస్ సమస్య కూడా చాలా వరకు నివారించొచ్చు. ఎందుకంటే వ్యాయామం వల్ల శరీరంలో ఆనందాన్ని పెంచే హార్మోన్ ఎండార్ఫిన్ ఉత్పత్తి గణనీయంగా ఉంటుంది. అందు వల్ల నెలసరి ముందు ఉండే చికాకు, డిప్రెషన్ వంటి వాటిని నివారించవచ్చు కూడా. కాబట్టి వీలైనంత వరకు వ్యాయామాన్ని వాయిదా వెయ్యకపోవడమే మంచిది.



కూరలో కరివేపాకు

భోజనంలో అడ్డుగా వస్తోందని కరివేపాకును తీసిపారేస్తారు చాలా మంది. కానీ ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇదొక పోషకాల ఖజానా.

కరివేపాకులో మెగ్నీషియం, కాల్షియం, ప్రొటీన్లు, ఐరన్, కెరోటిన్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీనిలో కొవ్వు అసలుండదు. ఫైబర్ చాలా ఎక్కువ. కరివేపాకు తీసిపారేయకుండా తినేస్తే చాలా పోషకాలు శరీరానికి అందుతాయి.


- కంటి చూపు దెబ్బతినదు.
- జుట్టు రాలదు, తెల్లబడదు.
- అధిక బరువును, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఫలితంగా గుండెకు మేలు చేస్తుంది.
- క్యాన్సర్‌తో పోరాడుతుంది.
- వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.
- చర్మాన్ని ఆరోగ్యంగా మెరిసేలా చేస్తుంది.
- మొలల వల్ల కలిగే మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.
- ఉదర సంబంధ వ్యాధులను నివారిస్తుంది. అజీర్తిని నివారిస్తుంది. ఆకలిని మెరుగు పరుస్తుంది.
- మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది.
- ఎక్కువ చెమట పట్టకుండా నివారిస్తుంది. ఫలితంగా రోజంతా తాజాగా ఉండొచ్చు.

అసెస్‌మెంట్



ఆస్తమా తీవ్రత ఎంత?

మీకు ఆస్తమా ఉందా? ఉంటే ఎంత తీవ్రంగా ఉంది? వ్యాధి నియంత్రణలో ఉందా లేదా.. అనే విషయాలు తెలుసుకోవడానికి ఉపయోగపడే చిన్న పరీక్ష ఇది. దీనిలో మీకు వచ్చిన మార్కులను బట్టి మీ డాక్టర్ మీకందించే చికిత్స విషయమై సరైన నిర్ణయం తీసుకునే వీలుంటుంది. కింద ఇచ్చిన అయిదు ప్రశ్నల్లో ఒక్కొక్కదానికి అయిదు సమాధానాలున్నాయి. ఆస్తమాతో మీరు పడుతున్న బాధను బట్టి మీకు తగిన సమాధానం ఉన్న అంకెను స్కోరు బాక్సులో రాయండి. అయిదు ప్రశ్నల స్కోరును కలిపి వచ్చిన మొత్తం ఎంతో దానికి సంబంధించిన ఫలితాన్ని చూసుకుంటే మీ సమస్య తీవ్రత ఎంతో తెలిసిపోతుంది.



1. గత నాలుగు వారాల్లో ఆస్తమా వల్ల ఇంట్లో, ఆఫీసులో లేదా స్కూల్లో ఎంత సమయాన్ని నష్టపోయారు?

ఎ) పూర్తి సమయం - 1
బి) చాలావరకు - 2
సి) కొంచెం ఎక్కువే - 3
డి) కొద్ది సమయం -4
ఇ)అసలే లేదు - 5

2. ఈ నాలుగు వారాల్లో ఎన్నిసార్లు శ్వాస తీసుకోవడం కష్టంగా పరిణమించింది?

ఎ) రోజుకు ఒక్కసారి కన్నా ఎక్కువే -1
బి) రోజుకోసారి -2
సి) వారానికి 3 నుంచి 6 సార్లు -3
డి) వారానికి ఒకటి రెండు సార్లు - 4
ఇ) ఎప్పుడూ లేదు - 5

3. పొడిదగ్గు, శ్వాస తీసుకోలేకపోవడం, పిల్లికూతలు, ఆయాసం వంటి ఆస్తమా లక్షణాలతో ఎన్ని రాత్రులు మేలుకున్నారు?

ఎ) వారానికి 4 కన్నా ఎక్కువ సార్లే -1
బి) 2 నుంచి 3 రాత్రులు -2
సి) వారానికోసారి-3
డి) ఒకటి లేదా రెండు సార్లు -4
ఇ) ఎప్పుడూ లేదు -5

4. గత నాలుగు వారాల్లో ఎంత తరచుగా మీ ఇన్‌హేలర్లను వాడాల్సి వచ్చింది?

ఎ) రోజుకి మూడు కన్నా ఎక్కువ సార్లు -1
బి) రోజుకి ఒకటి రెండు సార్లు -2
సి) వారానికి రెండు మూడు సార్లు -3
డి) వారానికి ఒకసారి -4
ఇ) ఎప్పుడూ లేదు -5

5. మీరు ఆస్తమా అదుపులో ఉందనే అనుకుంటున్నారా?

ఎ) అసలు అదుపులో లేదు -1
బి) చాలా తక్కువ నియంత్రణలో ఉంది -2
సి) కొంతవరకు పర్వాలేదు -3
డి) బాగానే ఉంది -4
ఇ) పూర్తిస్థాయిలో అదుపులో ఉంది -5

ఫలితం ఇదీ..

స్కోరు 25
మీకు ఆస్తమా పూర్తిగా అదుపులో ఉంది. కాబట్టి బాధపడాల్సిన అవసరం లేదు. కాని దీనిలో ఏమాత్రం తేడా వచ్చినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

స్కోరు 20 నుంచి 24
మీ విషయంలో ఆస్తమా కొంతవరకు అదుపులోనే ఉంది. కాని పూర్తి స్థాయిలో నియంత్రించాలంటే వైద్యుల సలహాలతో తగిన జాగ్రత్తలు పాటించాలి.

స్కోరు 20కన్నా తక్కువ
మీలో ఆస్తమా వ్యాధి చాలా తీవ్రస్థాయిలో ఉంది. వెంటనే జాగ్రత్తపడకపోతే ప్రమాదం. వైద్య పర్యవేక్షణలో ఆస్తమాను అదుపులో ఉంచడానికి సరైన జాగ్రత్తలు తీసుకోవాలి.



తీసుకున్న ఆహారం 3,4 గంటల్లో జీర్ణం కావాలి. మిగిలిన వ్యర్థాలు 24 గంటల్లో విసర్జితం కావాలి. ఇలా జరగకపోతే జీర్ణవ్యవస్థ బద్ధకిస్తోందని అర్థం. దాన్నే మనం మలబద్ధకం అంటాం. బద్ధకం ఎక్కడున్నా అది నష్టమే. అది శరీరంలోపలి అవయవాలైనా సరే! బద్ధకించకూడదు. అలా బద్ధకిస్తే పూర్తి శరీర ఆరోగ్యం మీద దాని ప్రభావం పడుతుంది. కానీ ప్రతి బద్ధకానికి విరుగుడున్నట్టే మలబద్ధకానికి కూడా విరుగుడు ఉంది. సహజమైన పద్ధతుల్లో మలబద్ధకాన్ని వదిలించుకోవడం ఎలాగో ఒకసారి చూద్దాం

‘ఆ’ బద్ధకానికి ఇక సెలవ్!

వారంలో కనీసం మూడు సార్లయినా పేగుల్లో కదలికలు లేకపోతే దాన్ని మలబద్ధకం అని అనవచ్చు. మలబద్ధకం ఏర్పడినపుడు మలం చాలా గట్టిగా తయారవుతుంది. విసర్జనకు చాలా కష్టంగా ఉంటుంది. కొన్ని సార్లు మలవిసర్జన సమయంలో నొప్పిగా కూడా ఉంటుంది. మలబద్ధకంగా ఉన్న వారికి కడుపు ఉబ్బరంగా ఉన్న భావన కలుగుతుంది. పెద్దపేగు ఎక్కువ నీటిని పీల్చుకోవడం లేదా పెద్దపేగు కండరాలలో కదలికలు తగ్గిపోవడం వల్ల పేగులో మలం కదలికలు చాలా నెమ్మదిగా ఉంటాయి. అందువల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. ఫలితంగా మలం గట్టిగా తయారవుతుంది. ఇది రకరకాల ఇతర అనారోగ్యాలకు కారణం అవుతుంది. మామూలుగా ఉండే చురుకుదనం తగ్గిపోతుంది. కొంత మందిలో కడుపు ఉబ్బరంగా ఉండడం, గ్యాస్ ఏర్పడుతుండడంతో చాలా అసౌకర్యంగా ఉంటారు. మరి కొంత మందిలో అసిడిటి వంటి ఇతర జీర్ణ సంబంధ సమస్యలు మొదలవుతాయి. శరీరం వెంటవెంటనే మలినాలను విసర్జించకపోవడం వల్ల వాటి ప్రభావం ఇతర అన్ని జీవక్రియల మీద ఉంటుంది.

కారణాలు

నీళ్లు తగినంత తీసుకోకపోవడం, ఆహారంలోఎక్కువ ఫైబర్ లేకపోవడం, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండడం. తగినన్ని నీళ్లు తీసుకోకుండా, ఆహారంలో చక్కెరల శాతం పెరిగితే పెరిస్టాలిక్ కండరాలలో కదలికలు చాలా నెమ్మదిస్తాయి. మలపదార్థం కూడా గట్టి పడి గరుకుగా తయారవుతుంది. ఇలాంటి గరుకు మలం వల్ల విసర్జన సమయంలో మలద్వారం దగ్గర చర్మం చిట్లి పోవడం వల్ల ఫిషర్ ఏర్పడుతుంది. అందువల్ల నొప్పిగా ఉంటుంది. ఎక్కువ కొవ్వులు కలిగిన ఆహారం తీసుకోవడం, తగినంత వ్యాయామం లేకపోవడం, మలవిసర్జనను వాయిదా వేయడం, ఎక్కువ ఒత్తిడి కలిగిన జీవనశైలి, కొన్ని రకాల ఆహార పదార్థాలు పడకపోవడం, కొన్ని రకాల మందులు వాడడం, ఉదాహరణకు ఐరన్ మందులు, యాంటాసిడ్స్, పెయిన్ కిల్లర్లు, యాంటి డిప్రెసెంట్స్ వాడడం వల్ల కూడా మలబద్ధకం ఏర్పడుతుంది. థైరాయిడ్, ఐబీఎస్, కాలేయ సమస్యలు ఉన్నపుడు, పక్షవాతం వల్ల నాడులు దెబ్బతినడం, జీర్ణవ్యవస్థలో సమతౌల్యం లోపించడం, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్ లోపించడం, పరాన్న జీవుల వల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. గర్భం దాల్చడం, వయసు పెరగడం, ప్రయాణాల వంటివి కూడా కొన్ని సార్లు మలబద్ధకానికి కారణమవుతాయి.

నివారణ మార్గాలు

ఆహారంలో ఎక్కువ పండ్లు, కూరగాయలు, గింజధాన్యాలు ప్రతి రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజు తగినన్ని నీళ్లు తాగాలి. నీళ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల మలం మృదువుగా అవుతుంది. శారీరక శ్రమ వల్ల పేగుల్లో కదలికలు చురుకుగా ఉంటాయి. ఉదయం నిద్రలేవగానే రెండు గ్లాసుల నీళ్లు తాగి అటు ఇటు కొద్ది సమయం పాటు నడిస్తే కడుపులో కదలికలు పెరుగుతాయి. ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మలబద్ధకానికి దూరంగా ఉండొచ్చు.

నీళ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణమయ్యేవి, జీర్ణంకాని పీచు పదార్థాలు నీటిని ఎక్కువగా నిల్వ చేసి జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండడానికి తోడ్పడుతాయి. ఫలితంగా జీర్ణవ్యవస్థలోని మేలు చేసే సూక్ష్మజీవులు చురుకుగా ఉంటాయి. యాంటిబయాటిక్స్ వంటి రసాయనాల వల్ల అవి నశిస్తాయి. ఫలితంగా జీర్ణవ్యవస్థ ఆరోగ్యం దెబ్బతింటుంది. అందుకే ఇప్పుడు డాక్టర్లు కూడా యాంటీబయాటిక్స్ వాడకాన్ని తగ్గించడానికే ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇప్పుడందరు కూడా ప్రోబయాటిక్/ప్రీబయాటిక్ మందులనే సూచిస్తున్నారు.

నివారించే యోగాసనాలు

చిన్న పాటి యోగాసానాలను సుఖమవ్యాయామ అంటారు. పవనముక్తాసనం, వజ్రాసనం మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. శంఖప్రక్షాళన అనేది ఒక చికిత్సా పద్ధతి. ఇది పేగుల్లో కదలికలను పెంచుతుంది. అనులోమ విలోమాలు, భస్త్రిక వంటివి కొన్ని జీర్ణక్రియ బావుండడానికి తోడ్పడే క్రియలు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. ఒత్తిడిని తగ్గించుకుంటే కూడా సమస్య నుంచి చాలావరకు దూరంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.

చికిత్సా విధానాలు

కారణం కచ్చితంగా తెలిస్తేనే ఒక ప్రకృతి వైద్యుడికి చికిత్స అందించడం సులభమవుతుంది. ప్రకృతి వైద్యం ఏవో కొన్ని నియమాలను అనుసరించి చేసేది కాదు. సమస్యకు కారణాలను కనుగొని చికిత్స చేయాల్సి ఉంటుంది. చికిత్సలో కౌన్సెలింగ్ కూడా భాగంగా ఉంటుంది. ''రోగిగా వచ్చి డాక్టర్‌గా తిరిగి వెళ్లండి'' అనేది ప్రకృతి వైద్యం నినాదం. వారి శరీరంలో జరుగుతున్నదేమిటో ఎలాంటి అసమతౌల్యం ఏర్పడడం వల్ల సమస్య వచ్చిందనే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుంది.

కొన్ని మూలికా ఔషధాలు, ఎనిమా, ఉపవాసం, ఎక్కువ ఫైబర్ కలిగిన ఆహారం, పండ్లు ఎక్కువగా తీసుకోవడం, చల్లని మడ్ ప్యాక్, తొట్టి స్నానం, యోగాసనాలు, ప్రాణాయామాలు, దీర్ఘశంఖ ప్రక్షాళన వంటి యోగక్రియలు వంటివి ఉపయోగించి ప్రకృతి వైద్యులు చికిత్సలు చేస్తారు.

ఔషధాలు

ఈసాబ్గుల్ వంటి కొన్ని ఔషధాలు పీచు పదార్థాల మాదిరిగా పనిచేస్తుయి. ఫలితంగా మలవిసర్జన సులభమవుతుంది. త్రిఫల చూర్ణం, ఉసిరిక పొడి కూడా పెగుల్లో కదలికలు పెంచడానికి ఉపయోగపడుతాయి.

ప్రకృతి వైద్య శాలలో అందించే కొన్ని చికిత్సలు

కొలోనిక్ ఇరిగేషన్, కొలనిక్స్, కోలన్ హైడ్రోథెరపి, ఎనిమా అనేవి పెద్ద పేగును శుభ్రం చేసే విధానాలు. ఒక డిస్పోజబుల్ రెక్టల్ ట్యూబ్‌ను ఉపయోగించి ఫిల్టర్ చేసిన నీటిని మల ద్వారం గుండా పెద్ద పేగులోకి పంపడం ద్వారా పెద్దపేగును శుభ్రం చెయ్యవచ్చు.

ఎనిమా అనేది చాలా సులభమైన చికిత్సా విధానం. ఇందులో వేడినీటిని మలద్వారం ద్వారా పెద్ద పేగులోకి పంపుతారు. ఇలా చేయడం ద్వారా మలబద్ధకం వల్ల పోగు పడిన మలం అంతా కూడా విసర్జించబడుతుంది. విషపదార్థాల శోషణను నివారిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులుగా ఉన్నవారికి, ఉపవాసంలో ఉన్నపుడు ఎనిమా చికిత్స అందిస్తారు. ఎనిమాను ఆయుర్వేదంలో వస్తి అంటారు. ఇది పంచకర్మల్లో భాగం.

ఇది వరకు ప్రకృతి వైద్య శాలలో చేరిన ప్రతి ఒక్కరికి ఇచ్చేవారు. ఇప్పుడు అవసరమైన వారికి మాత్రమే ఇస్తున్నారు. ఎనిమా ఇవ్వడానికి ఉపయోగించే గొట్టాలు డిస్పోజబుల్‌వి మాత్రమే వాడాలి. ఇలా చెయ్యడం వల్ల ఒకరి నుంచి ఒకరికి అంటు వ్యాధులు వ్యాపించకుండా ఉంటుంది.

ప్రొఫెసర్ కె. సత్యలక్ష్మి
ప్రకృతి వైద్య నిపుణులు, డైరెక్టర్
వేమన యోగా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
హైదరాబాద్



మాటలు జాగ్రత్త!

పేరెంటింగ్



ప్రపంచంలో అతి జాగ్రత్తగా నిర్వహించాల్సిన బాధ్యతల్లో చాలా ముఖ్యమైనది తల్లితండ్రులుగా ఉండడమే. ఎందుకంటే భవిష్యత్తు తరాలు రూపొందేది తల్లితండ్రుల చేతుల్లోనే. అంతే కాదు ఏ వ్యక్తికైనా జీవితంలో అత్యంత మధురమైన అనుభవాలు ఉండేది కూడా బాల్యంలోనే. కాబట్టి తల్లిదండ్రులు కోపం ప్రదర్శించే తీరు, మాట్లాడే తీరు పిల్లల మీద దాదాపుగా శాశ్వతమైన ముద్ర వేస్తాయి. ముఖ్యంగా కోపాన్ని ప్రదర్శించే ముందు ఒక్కసారి పునరాలోచించుకోవడం చాలా అవసరం. ఎలాంటి మాటలు పిల్లల మీద ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయనే విషయం గురించి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు

- చాలా సందర్భాల్లో తల్లిదండ్రులు తాము పిల్లలుగా ఉన్నపుడు ఎంత బాధ్యతగా ఉండే వారో పిల్లలకు ఉదాహరిస్తూ చెప్తుంటారు. ఇలా చేయడం అంత మంచిది కాదు. చిన్న తనంలో మీ లోపాలను గనుక మీ తల్లిదండ్రులు ఎత్తి చూపినపుడు మీరు పొందిన బాధ ఎలాంటిదో ఒక్కసారి గుర్తుతెచ్చుకోండి. కాబట్టి మీ సామర్థ్యం గురించి చెప్పడం కాకుండా వారు చెయ్యాల్సిన పనులు మరింత బాధ్యతాయుతంగా చేయడం ఎలాగో ఒకసారి వారికి వివరిస్తే సరిపోతుంది.
- తప్పు చేయని వారు ఈ లోకంలో ఎవరు ఉండరు. తప్పుచేయడం చాలా సహజమైన విషయం. జీవన నైపుణ్యాలు నేర్చుకోవడంలో తప్పుచేయడం ఒక భాగం. మీ పిల్లలు మీకు నచ్చినట్టుగానే ప్రవర్తించాలని కోరుకోవడం మీరు చేసే అతి పెద్ద తప్పవుతుంది. అదేవిధంగా మీకు నచ్చని కోర్సు ఎంచుకున్నాడని అతడిని నిందించడం కుదరదు.
- ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలను ఒకరితో ఒకరికి పోలిక చేర్చి మాట్లాడడం ఎప్పుడు సరికాదు. ఇలా చేయడం వల్ల వాళ్లిద్దరి మధ్య శత్రుత్వం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. మీ పిల్లల మధ్య సయోధ్య చెడకుండా ఉండాలంటే ఇలాంటి పోలికలు ఎప్పుడూ పెట్టకూడదు.
- తల్లిదండ్రులుగా వారి పట్ల మనం చాలా జాగ్రత్తగా ఉంటుంటాం. అన్ని పనులు దగ్గరుండి చూసుకుంటాం, ఇలా ప్రతి పనిని దగ్గరుండి చూసుకోవడం వల్ల వారిలో బాధ్యతారాహిత్యం పెరిగేందుకు అవకాశం ఉంటుంది, ప్రతిచోటా ప్రతి సారీ మనం ఉండి చూసుకోలేకపోవచ్చు. అలాంటి సమయాల్లో వారు చాలా ఇబ్బంది పడతారు. కొన్ని సార్లు పిల్లలకు ఊపిరి సలపనివ్వని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. వారిని కొన్ని పనులు, కొన్ని నిర్ణయాలు వారికే వదిలేయాలి. ఇది వారిలో నిర్ణయించుకునే శక్తిని పెంపొదిస్తుంది. కాబట్టి పిల్లల విషయంలో అతిజాగ్రత్త పనికి రాదు.
- పిల్లల దగ్గర మీరు మీ భాగస్వామిని పట్ల ఫిర్యాదుల గురించి మాట్లాడకూడదు. అలా మాట్లాడడం వల్ల మీ మీద మీ భాగస్వామి మీద కూడా వారికి గౌరవం తగ్గిపోవచ్చు. అంతేకాదు ఎప్పుడైనా మీ ఇద్దరి మధ్య ఎటువంటి విబేధాలు లేవనుకున్నపుడు వారు ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం మాత్రమే కాదు వారు చాలా సురక్షితంగా ఉన్నట్టు భావిస్తారు కూడా.
- తల్లిదండ్రులకు ఇష్టం లేని పనిచెయ్యాల్సి వచ్చినపుడ పిల్లలు చాలా ఒత్తిడికి లోనవుతారు. అలాంటి సందర్భాలు ఎదురైనపుడు వారిని నిందించకుండా అలాంటి అవసరం ఏమి ఏర్పడిందో తెలుసుకోవడం చాలా అవసరం. ఇలా చెయ్యడం వల్ల వారికి నిర్ణయాలు తీసుకోవడంలో మనం మార్గదర్శకత్వం వహించడం అవుతుంది. వారి పక్షాన మనమే నిర్ణయాలు తీసుకోవడం కంటే ఇది చాలా మంచి పద్ధతి.
- ‘నీలాంటి పిల్లాడు ఇంకెవరికి ఉండడు. ఇలాంటి పిల్లాడు ఉండడం కంటే అసలు పిల్లలు లేకపోవడమే మంచిది’ వంటి మాటలు అసలు మాట్లాడకూడదు. ఇవి మీ పిల్లలను చాలా బాధిస్తాయి. అంతేకాదు జీవితంలో చెరిగిపోని ముద్రలుగా వారి మనసులో మిగిలిపోతాయి.

'అన్నామలై' దూరవిద్య కోర్సులు

అన్నామలై యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2017- 18 విద్యా సంవత్సరానికిగాను కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

దేశంలో ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో అన్నామలై యూనివర్సిటీ ఒకటి. న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు ఉన్న విశ్వ విద్యాలయం ఇది. దూరవిద్యా విధానంలో ఈ కోర్సులను అందిస్తున్నారు.

- ప్రిపరేటరీ ప్రోగ్రామ్, ప్రి ఫౌండేషన్ ప్రోగ్రామ్స్,
- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్: బీఏ, బీఎస్ డబ్ల్యూ, బీకాం, బీలిట్, బీబీఏ, బీఎస్సీ, బీఎస్సీ సైక్రియాట్రీ, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ జువాలజీ.
- పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు: ఎంఏ, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ బిజినెస్ ఎకనామిక్స్, ఎంఏ ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్, హిస్టరీ, పాపులేషన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పాలసీ అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, ఎంఏ సోషల్ వెల్ఫేర్, ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్, ఎంఎస్ డబ్ల్యూ, ఎంకాం, ఎమ్మెస్సీ.
- లా ప్రోగ్రామ్స్: మూడేండ్ల ఎల్ఎల్ఎం, మూడేండ్ల బీబీఎల్, రెండేండ్ల ఎల్ఎల్బీ (జనరల్), ఎల్ఎల్బీ (అకడమిక్)మూడేండ్లు, డిప్లొమా ఇన్ లేబర్ లా విత్ అడ్మినిస్ట్రేషన్ లా, పీజీ డిప్లొమా ఇన్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్.
- హెల్త్ సైన్సెస్ ప్రోగ్రామ్: పీజీ డిప్లొమా కోర్సులు, టుబాకో కంట్రోల్, ఆక్యుపంచర్, పబ్లిక్ హెల్త్, వెల్‌నెస్ ఫిట్‌నెస్ సైన్స్, అప్లయిడ్ న్యూట్రిషన్, మెడికల్ రికార్డ్స్ సైన్స్ కోర్సులు ఉన్నాయి.
- మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ప్రోగ్రామ్స్, యోగా సంబంధిత కోర్సులు, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. వీటితోపాటు ఐటీ, ఎంబీఏ, డబుల్ డిగ్రీ ప్రోగ్రామ్స్‌ను ఈ యూనివర్సిటీ ఆఫర్ చేస్తుంది.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 28
- **వెబ్‌సైట్:** www.annamalaiuniversity.ac.in

మద్రాస్ యూనివర్సిటీలో



యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఎంఎల్ డిగ్రీలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ప్రైవేట్ స్టడీ విధానంలో ఈ కోర్సును ఆఫర్ చేస్తుంది. 2017 - 18 విద్యాసంవత్సరానికిగాను ఈ ప్రవేశాలు.

- ఈ కోర్సును ఇంగ్లిష్ మీడియంలో యూనివర్సిటీలోని లీగల్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ అందిస్తుంది.
- **కోర్సు:** ఎంఎల్ డిగ్రీ కోర్సు
- **విభాగాలు:** ఇంటర్నేషనల్ లా అండ్ కాన్‌స్టిట్యూషనల్ లా, క్రిమినల్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, హ్యూమన్ రైట్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అడ్మినిస్ట్రేటివ్ లా.
- **అర్హతలు:** మూడేండ్ల బీఏ/ఎల్ఎల్బీ లేదా ఐదేండ్ల బీఎల్/ఎల్ఎల్బీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** అక్టోబర్ 31
- **వెబ్‌సైట్:** www. unom.ac.in

ఎండీ (సిద్ధా)

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధా పీజీ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధా భారత ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది.

- **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు ఇన్ సిద్ధా. ఎండీ (సిద్ధా)
- **ఎంపిక:** దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా (ఆయుష్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్)
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** సెప్టెంబర్ 13
- **వెబ్‌సైట్:** www.nischennai.org

'ఐబీ'లో 1300 కొలువులు

- ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులకు అవకాశం
- రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- దరఖాస్తుకు చివరితేదీ- సెప్టెంబర్ 2



మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ బ్యూరోలో ఖాళీగా ఉన్న గ్రేడ్ 2 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (ఎగ్జిక్యూటివ్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.

వివరాలు:


ఇంటెలిజెన్స్ బ్యూరో అనేది భారత దేశంలోని అంతర్గత నిఘా సంస్థ. ఇది ప్రపంచంలో అత్యంత పురాతన గూఢచార సంస్థగా ప్రసిద్ధిగాంచినది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (గ్రేడ్-2)
- **మొత్తం పోస్టులు:** 1300 (జనరల్-951, ఓబీసీ-184, ఎస్సీ-109, ఎస్టీ-56)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. కంప్యూటర్ నాలెడ్జ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
- **వయస్సు:** 2017 సెప్టెంబర్ 2 నాటికి 18 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ.9,300-34,800+గ్రేడ్ పే రూ. 4,600. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ఇతర అలవెన్సులుంటాయి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/- (జనరల్, ఓబీసీ అభ్యర్థులు), ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ
- రాతపరీక్ష టైర్-1(ఆబ్జెక్టివ్), టైర్-2 (డిస్క్రిప్టివ్) విధానంలో ఉంది.
- కేవలం రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే మెరిట్ లిస్ట్ తయారుచేసి, ఇంటర్వ్యూకు అనుమతిస్తారు.

రాత పరీక్ష విధానం:

- టైర్-1(ఆబ్జెక్టివ్ పేపర్) మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు.
- మొత్తం నాలుగు విభాగాల్లో ప్రతి విభాగం నుంచి 25 ప్రశ్నలు - 25 మార్కులు.
- ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్/అనలిటికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అంశాలపై ప్రశ్నలను ఇస్తారు.
- ఈ పరీక్షకు కేటాయించిన సమయం-60 నిమిషాలు.
- ప్రతి తప్పు సమాధానికి 1/4 వంతు మార్కులను తగ్గిస్తారు.
- టైర్-2 (డిస్క్రిప్టివ్ పేపర్) మొత్తం 50 మార్కులకు ఉంటుంది.
- దీనిలో ఎస్సే రైటింగ్ ఇన్ ఇంగ్లిష్‌లో 30 మార్కులు, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్‌కు 20 మార్కులు.
- ఈ పరీక్షకు కేటాయించిన సమయం-60 నిమిషాలు.
- టైర్-2 (డిస్క్రిప్టివ్ పేపర్)లో కనీసం 33 శాతం మార్కులను సాధించాలి.
- ఇంటర్వ్యూ 100 మార్కులకు ఉంటుంది.
- టైర్-1, టైర్-2, ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ల ప్రాతిపదికన తుది ఎంపిక చేస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా మొత్తం 33 పరీక్ష సెంటర్‌లలో ఎగ్జామ్ నిర్వహిస్తారు. అవి హైదరాబాద్, విజయవాడ, ముంబై, నాగ్‌పూర్, పాట్నా, రాయ్‌పూర్, రాంచీ, షిల్లాంగ్, సిమ్లా, గువాహటి, అహ్మదాబాద్, ఐజ్వాల్, అమృత్‌సర్, బెంగళూరు, భోపాల్, ఇంఫాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, డెహ్రాడూన్, ఢిల్లీ, ఇటానగర్, జైపూర్, జమ్ము, కోహిమా, కోల్‌కతా, లేహ్, మీరట్, అగర్తలా, లక్నో, సిలిగురి, త్రివేండ్రమ్, వారాణాసి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. మరే ఇతర విధానంలోనైనా పంపిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును పంపేటప్పుడు వినియోగంలో ఉన్న ఈ- మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా ఎంటర్ చేయాలి. నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ :** సెప్టెంబర్ 2
- **వెబ్‌సైట్:** www.mha.nic.in

ఐఐఎస్టీలో



తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్టీ)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ పరిధిలో ఐఐఎస్టీ పనిచేస్తుంది.

- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.
- సివిల్ ఇంజినీర్ - 1
- సీనియర్ టెక్నీషియన్ - 2
- సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో - 2
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** www.iist.ac.in

ఆర్ఎంఆర్‌సీలో



భువనేశ్వర్‌లోని రీజనల్ మెడికల్ రిసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్‌సీ) కాంట్రాక్టు ప్రాతిపదికన సైంటిస్ట్, టెక్నికల్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఆర్ఎంఆర్‌సీ సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ పరిధిలో పనిచేస్తుంది.

పోస్టులు - ఖాళీలు:

మల్టి సెంట్రిక్ స్టడీ ప్రాజెక్ట్‌లో..

- సైంటిస్ట్ బీ - 1, టెక్నికల్ అసిస్టెంట్ (రిసెర్చ్) - 1, ల్యాబ్ టెక్నీషియన్ (టెక్నికల్ సీ)-1,ల్యాబ్ టెక్నీషియన్ ఫీల్డ్ - 1
- మోడల్ రూరల్ హెల్త్ రిసెర్చ్ యూనిట్‌లో..
- సైంటిస్ట్ డీ - 1, సైంటిస్ట్ సీ - 1, టెక్నికల్ అసిస్టెంట్ - (స్టాటిస్టిక్స్) - 1, టెక్నికల్ అసిస్టెంట్ (రిసెర్చ్) - 1, ప్రాజెక్ట్ అసిస్టెంట్ (రిసెర్చ్) - 1, ల్యాబ్ టెక్నీషియన్ - 1 పోస్టు ఉన్నాయి.
- ఐసీఎంఆర్ - వైరాలజీ రిసెర్చ్ డయాగ్నస్టిక్స్ ల్యాబొరేటరీలో..
- సైంటిస్ట్ సీ (మెడికల్) - 1, టెక్నికల్ అసిస్టెంట్ (రిసెర్చ్) - 1, ల్యాబ్ టెక్నీషియన్ -1
- జేఈవీ ఇన్‌ఫెక్షన్ ప్రాజెక్ట్‌లో..
- సైంటిస్ట్ బీ (మెడికల్/పబ్లిక్ హెల్త్) - 1, ల్యాబ్ టెక్నీషియన్ - 2, డాటా ఎంట్రీ ఆపరేటర్ - 1 పోస్టు ఉన్నాయి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూలు ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 1 వరకు నిర్వహిస్తారు.
- వెబ్‌సైట్: www.icmr.nic.in

ఐసీసీఆర్‌లో



న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్)లో స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐసీసీఆర్ భారత ప్రభుత్వ పరిధిలోని సంస్థ.

- సీనియర్ స్టెనోగ్రాఫర్స్ (ఇంగ్లిష్)
- ఖాళీల సంఖ్య - 3.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **పేస్కేల్:** రూ. 9,300 - 34,800 + గ్రేడ్ పే రూ. 4,200/-
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. నిమిషానికి 100 పదాల డిక్టేషన్‌ను గంటలో కంప్యూటర్‌పై ట్రాన్స్‌క్రిప్షన్ చేయాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సర్టిఫికెట్/డిప్లొమా కలిగి ఉండాలి.
- **జూనియర్ స్టెనోగ్రాఫర్ (ఇంగ్లిష్)**
- **పేస్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 2,400/-
- **వయస్సు:** 18 - 27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అర్హతలు:** ఇంటర్ ఉత్తీర్ణత. నిమిషానికి 80 పదాల డిక్టేషన్ రాసుకొని, కంప్యూటర్‌పై ట్రాన్స్‌క్రిప్షన్ చేయాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సర్టిఫికెట్/డిప్లొమా కలిగి ఉండాలి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **వెబ్‌సైట్:** www.iccr.gov.in

ట్రైబల్ వెల్ఫేర్‌లో గెస్ట్ ఫ్యాకల్టీలు

హైదరాబాద్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ టీఎస్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల్లో పార్ట్‌టైమ్/గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థల్లో పని చేయాల్సి ఉంటుంది.

- **పోస్టు పేరు:** గెస్ట్ ఫ్యాకల్టీ/ పార్ట్ టైమ్ లెక్చరర్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంసీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్)లో 55 శాతం (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణత. డిగ్రీ/జూనియర్ కళాశాలల్లో పదవీ విరమణ పొందిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నెట్/సెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం.
- **సబ్జెక్టులు:** తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, బాటనీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, కామర్స్
- **గ్రూపులు:** ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, బీజెడ్ మైక్రోబయాలజీ, బీజెడ్ బయోటెక్నాలజీ, బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్స్), బీఏ (హెచ్‌ఈపీ), బీఏ (హెచ్‌ఈ జాగ్రఫీ)
- **పే స్కేల్:** రూ. 20,000/-
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు, డెమో, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 18
- **ఇంటర్వ్యూ కాల్‌లెటర్స్:** ఆగస్టు 22 నుంచి
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in.

ఐఐఎం కోజికోడ్‌లో అసిస్టెంట్లు

కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

మేనేజ్‌మెంట్ విద్యకు ఐఐఎం కోజికోడ్ ఒక ప్రతిష్ఠాత్మకమైన సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య: 13
- జూనియర్ ఇంజినీర్ (సివిల్/ఎలక్ట్రికల్)-3
- అసిస్టెంట్-5, అకౌంటెంట్-2, చీఫ్ పర్చేస్ మేనేజర్/చీఫ్ మేనేజర్-2, ఈఆర్‌పీ అడ్వైజర్-1
- **అర్హత:**బీఈ/బీటెక్, పీజీ, ఎంసీఏ, సీఏ/ఐసీడబ్ల్యూఏ, బీకాం, ఇంటర్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు (పోస్టులను బట్టి వయోపరిమితిలో సడలింపు ఉంది)
- **ఎంపిక:** రాత పరీక్ష ఇంటర్వ్యూ ఆధారంగా
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 118/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 8
- **వెబ్‌సైట్:**www.iimk.ac.in

ఇంజినీర్ పోస్టులు



నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

రోడ్ ట్రాన్స్‌పోర్ట్, హైవేస్ మంత్రిత్వశాఖ పరిధిలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేస్తుంది.

- **పోస్టు:** సైట్ ఇంజినీర్స్
- ఖాళీల సంఖ్య - 18
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు.
- **పనిచేయాల్సిన ప్రదేశాలు:** మధురై, విల్లుపురం, కోయంబత్తూరు, నాగర్‌కోయిల్, కానూర్, క్రిష్ణగిరి, వెల్లూరు, బెంగళూరు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 4
- **వెబ్‌సైట్:** www.nhai.org

ఎన్‌సీఈఆర్‌టీలో 240 ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఎన్‌సీఈఆర్‌టీ అనేది ఎడ్యుకేషనల్ రీసెర్చ్, టీచర్స్ ట్రెయినింగ్ అండ్ కరికులం అభివృద్ధి చేయడంలో ఒక శిఖరాగ్ర సంస్థ. ఎన్‌సీఈఆర్‌టీని 1961లో ఏర్పాటు చేశారు. భోపాల్, భువనేశ్వర్, మైసూర్ అండ్ షిల్లాంగ్, ఢిల్లీ, అజ్మీర్‌లలో తన ప్రాంతీయ కార్యాలయాలను కలిగి ఉంది

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 240. వీటిలో ప్రొఫెసర్-36, అసోసియేట్ ప్రొఫెసర్-71, అసిస్టెంట్ ప్రొఫెసర్-133 పోస్టులు ఉన్నాయి.
- **పోస్టు పేరు:** ప్రొఫెసర్స్
- **విభాగాలు:** సైకాలజీ, సైకాలజీ/ఎడ్యుకేషన్, హోంసైన్స్/సైకాలజీ/ఎడ్యుకేషన్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఎడ్యుకేషన్/స్టాటిస్టిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, బాటనీ, స్టాటిస్టిక్స్, సోషియాలజీ, హిస్టరీ, కామర్స్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, జాగ్రఫీ, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పాపులేషన్ స్టడీస్, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్, కన్నడ, ఒడియా, ఆర్ట్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్, లాంగ్వేజ్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, హోం సైన్స్ (ఫుడ్ అండ్ న్యూట్రిషన్ లేదా టెక్స్‌టైల్ అండ్ క్లాతింగ్/ కాస్మోటిక్స్), బయోసైన్స్ లేదా బయోటెక్నాలజీ, హెల్త్ సైన్స్/ఫార్మసీ, యానిమల్ సైన్స్, మెకానికల్/మాన్యుఫాక్చరింగ్ లేదా ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్ లేదా కన్‌స్ట్రక్షన్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఐటీ, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్-రిటైల్, బ్యాంకింగ్ లేదా ఫైనాన్స్, హాస్పిటాలిటీ, ట్రావెల్ అండ్ టూరిజం, సెక్యూరిటీ/డిఫెన్స్ సైన్స్/మిలిటరీ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ అండ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ, సైన్స్‌లో పీజీ, ఎంఈడీ/ ఎంఏ ఎడ్యుకేషన్, పీహెచ్‌డీ, నెట్/స్లెట్, సెట్‌లో ఉత్తీర్ణత. సంబంధిత పీజీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. టీచింగ్/రిసెర్చ్/ఇండస్ట్రీలో ప్రొఫెసర్‌కు పదేండ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఆరేండ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు మూడేండ్ల అనుభవం ఉండాలి.


పే స్కేల్:

- ప్రొఫెసర్-రూ. 37,400-67,000 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 10,000/-
- అసోసియేట్ ప్రొఫెసర్-రూ. 37,400-67,000 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 9,000/-
- అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ. 15600-39,100 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 6,000/-
- **పే స్కేల్:** రూ.14,000/- (నెట్‌లో అర్హత ఉన్న వారికి రూ. 16,000/-)
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, అవసరమైన సర్టిఫికెట్స్ జతపరిచి సంబంధిత రిక్రూట్‌మెంట్ పర్సనల్ అధికారికి పంపాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:**www. ncert. nic.in

కలలు నిజం కావాలంటే..

న్యూ బిహేవియర్ జనరేటర్ స్ట్రాటజీ

- అంతరంగానికి ఒక ఊహకు, వాస్తవమైన అనుభవానికి మధ్య తేడా తెలియదు. కానీ ఆ అనుభూతికి నిజాయితీగా స్పందించటం మాత్రమే తెలుసు. నిమ్మకాయను కోస్తున్న దృశ్యాన్ని ఊహించుకోగానే నోటిలో లాలాజలం స్రవించటం ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. మీరు లాయర్ అయినట్లుగా పదే పదే ఊహించుకొని అనుభూతి చెందితే కచ్చితంగా మీరు లాయర్ అయి తీరుతారు. మీ అంతరంగం మిమ్మల్ని లాయర్‌గానే చూస్తుంది. విద్యార్థులందరికీ తమ భవిష్యత్తు పట్ల ఎన్నో కలలు ఉంటాయి. వీటిని నిజం చేసుకోవాలని అందరికీ అనిపిస్తుంది. ఏ విద్యార్థిని కలిసినా నువ్వేం కావాలనుకుంటున్నావ్? అని అడిగితే ఫలానా అని చెబుతాడు. అయితే అలా అనుకున్న దాన్ని సాధించే వ్యక్తులు చాలా అరుదు. అలా కాకపోవడానికి ప్రధాన కారణం అనుకున్నదానిపై తీవ్ర కాంక్ష లేకపోవటం. అవగాహన లేకపోవటం, మాటల వరకే కలను పరిమితం చేయటం, కలలు నిజం కావాలంటే మనసులో తపన బలంగా ఉండాలి. ఈ తీవ్రమైన కాంక్షను తపనను కల్గించుకోవటమనేది యాదృచ్ఛికమనే భావన విద్యార్థులకే కాకుండా చాలామందికి ఉంటుంది. ఏదో మాటవరుసకి అనుకున్న భవిష్యత్తును నిజంగా సాధించినట్లయితే అది కేవలం అదృష్టమనే పొరపాటు అభిప్రాయం కూడా ఎక్కువ మందిలో ఉంటుంది. అనుకున్నది సాధించటంలో అదృష్టం ప్రసక్తి ఎక్కడా ఉండదు. అనుకున్నది సరిగ్గా అనుకున్నట్లయితే కచ్చితంగా జరిగి తీరుతుంది. ఇలా కలలను దర్శించటం, దాన్నే కాంక్షించటం ఒక మానసిక ప్రక్రియ. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించినట్లయితే అది నిజమవుతుంది. విజేతలైన వ్యక్తుల జీవిత గాథలను చదివినట్లయితే నేను చెప్పింది ఎంత వాస్తవమో అర్థమవుతుంది. అయితే ఈ కాంక్షను ఎలా కలిగించుకోవాలనేది చాలామందికి తెలియకపోవచ్చు.
- **స్టెప్-1 :** మీ సమీప భవిష్యత్తులో మీరు సాధించదలుచుకున్నదేమిటో ప్రశ్నించుకోండి. విద్యార్థులందరికీ ఒక్కో రకమైన లక్ష్యం ఉండే ఉంటుంది. కొంతమందికి రాబోయే పరీక్షలో స్టేట్‌ర్యాంక్ సాధించాలని, మరికొందరికి ఐపీఎస్ అవ్వాలని, ఇంకొందరికి లాయర్ కావాలని.. ఇలా లక్ష్యాలు పలు రకాలుగా ఉంటాయి. మీ మనసులో ఉన్న లక్ష్యాలు ఏమిటో మీరు ఎవరికి చెప్పాల్సిన అవసరం లేదు. దాన్ని మీ మనసులో బలంగా ఉంచుకోండి. గాఢంగా తలుచుకోండి.
- **స్టెప్-2 :** మీ తలను నిటారుగా ఉంచి మీ కనుపాపలను మాత్రం కిందికి ఎడమవైపుకు తిప్పి ఉంచండి. ఇప్పుడు కళ్లు మూసుకొని మీరనుకుంటున్న లక్ష్యాన్ని తలుచుకోండి.
- **స్టెప్-3 :** ఇప్పుడు మీ కనులను పైకి పెట్టి పూర్తిగా మీ కుడివైపునకు తిప్పండి. మీ మనసులో ఒక మెంటల్ ఇమేజినేషన్ ఏర్పడుతుంది. ఈ ఇమేజినేషన్ మీ స్వీయదర్శకత్వంలో సాగాలి. మీరు సాధించదలుచుకున్న లక్ష్యాన్ని ఇప్పటికే సాధించేసినట్లుగా ఊహించుకోండి.లాయర్‌గా మీరు తీయించుకున్న ఫొటోని చూస్తున్నంత క్లియర్‌గా మీ మెంటల్ ఇమేజ్ ఏర్పడాలి. మీ మెంటల్ ఇమేజినేషన్‌లో దృశ్యపరమైన అంశాలు మరింత బాగా ఏర్పడటానికి కింది సూచనలను పాటించండి.
- మీరు గతంలో విజయవంతంగా సాధించిన అనుభవాన్ని గుర్తు తెచ్చుకోండి. అప్పటి మీ ఆకృతిలో రూపొందిన శారీరక భంగిమను అన్వయించుకోండి. ఒకవేళ ఇలా చేసేటప్పుడు మీకు స్పష్టమైన విజువలైజేషన్ ఏర్పడకపోతే...
- మీరు సాధించదలుచుకున్న లక్ష్యంలో కొంత భాగాన్ని మాత్రమే సాధించినట్లుగా ఊహించుకోండి. అయితే ఇలా చేసేటప్పుడు మీ కనులను పైకి ఉంచి ఎడమవైపునకు తిప్పండి.
- **స్టెప్-4 :** మీ మెంటల్ ఇమేజినేషన్ స్పష్టంగా ఏర్పడిన తర్వాత సినిమా గ్రాఫిక్స్‌లో చూపించినట్లు మీరు ప్రస్తుతం ఉన్న ప్రదేశాన్ని విడిచిపెట్టి మీరు ఊహించుకుంటున్న దృశ్యంలోకి అడుగుపెట్టండి. ఇప్పుడు మీరు పూర్తిగా లాయర్ ఆకృతిలో ఉన్నారని భావించండి. ఈ దశలో తలను కిందికి వంచండి. మీ కనుపాపలను కూడా కిందికి దింపి కుడివైపునకు తిప్పండి. మీ వర్తమాన శారీరక ఆకృతి మీ ఇమేజినేషన్ దృశ్యంలో పూర్తిగా విలీనమైపోయినట్లుగా అనుభూతి చెందండి.
- **స్టెప్-5 :** ఇప్పుడు మీ మనోభావాలను గమనించండి. అవి ఎన్నయినా ఉండవచ్చు. సంఖ్యతో నిమిత్తం లేకుండా ఎన్ని భావాలు ఏర్పడినా సరే వాటన్నంటినీ తీరికగా గమనించండి. అనుకున్నది సాధించానన్న అనుభూతి సంబంధిత మనో అభిప్రాయాలు మీలో ఎంత చక్కగా ఏర్పడుతున్నాయో గమనించండి. ఈ విజయవంతమైన భావనలు గతంలో మీరు విజయవంతంగా ఒక సాధనను కైవసం చేసుకున్నప్పుడు మీలో ఏర్పడి ఉంచిన మనోభావాలతో ఎంత దగ్గరగా పోలికలు ఉన్నాయో గమనించండి. ఇలా గమనించే సమయంలో మీ తలను కిందకి ఉంచి, కళ్లను కుడివైపునకు తిప్పి ఉంచండి.
- **స్టెప్-6 :** మీ మనోభావాలు ఒకేలా లేని పక్షంలో లోపం ఎక్కడ ఉందో గమనించండి. విజయం సాధించినప్పుడు లాయర్‌గా మీరు అనుకునేది సాధించినప్పుడు మీ మనోభావాలు ఒకేలా ఉండాలంటే మీ విజువలైజేషన్‌లో చేర్చాల్సిన అదనపు అంశాలేమిటో గమనించండి. లాయర్‌గా విజయం సాధించటంలో మీ అంతరంగంలో ఎక్కడైనా అవరోధ భావనలు ఉన్నట్లయితే కచ్చితంగా ఏదో లోపం మీకు కనిపించి తీరుతుంది. మీ లోపాలను మీరు భర్తీ చేసి తిరిగి ఈ ఎక్సర్‌సైజుని మొదటినుంచి చేయండి. ఇప్పుడు మీ విజువలైజేషన్ మరింత కాంతివంతంగా, స్పష్టంగా వివరణాత్మకంగా ఏర్పడుతుంది. ఈ ఎక్సర్‌సైజ్‌ని మీరు నిజంగా లాయర్ కావాలని అనుకుంటే ప్రతిరోజు చేయండి. అదృష్టంతో పని లేకుండా మిమ్మల్ని మీ అంతరంగమే లాయర్‌ని చేసి నిలబెడుతుంది. ఇందులో మీ స్వప్రయత్నమే తప్ప అదృష్టం వంటి పదాలకు తావే లేదు.



- డా. హిప్నో కమలాకర్
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, హెచ్ఆర్‌డీ ట్రైనర్, 9390044031
drhypnokamalakar@gmail.com

డిసెంబర్‌లో 'రంగస్థలం'?


రామ్‌చరణ్

సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రంగస్థలం' (1985). సమంత కథానాయిక. పూర్తి గ్రామీణ నేపథ్యంలో వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర చిత్రణ మునుపెన్నడూ లేని విధంగా నవ్యరీతిలో సాగుతుందని చిత్ర బృందం చెబుతున్నది. దాదాపు యాభైశాతం వరకు చిత్రీకరణ పూర్తయింది. ఇప్పటివరకు తెలుగులో రానటువంటి ఓ విలక్షణ కథాంశంతో దర్శకుడు సుకుమార్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతున్నది. ఇదిలావుండగా ఈ చిత్రాన్ని తొలుత నిర్ణయించినట్లుగా సంక్రాంతికి కాకుండా ఒకనెల ముందుగా డిసెంబర్‌లో విడుదల చేయబోతున్నారని సమాచారం. షూటింగ్ వేగంగా జరుగుతుండటంతో డిసెంబర్‌లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.

అప్పుడే తెలుగులో కొత్త కథలొస్తాయి!



తేజ, వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, రానా, అనూప్‌రూబెన్స్

ఆయన నటించిన తాజా చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. తేజ దర్శకుడు. కాజల్, కేథరిన్ కథానాయికలుగా నటించారు. డి.సురేష్‌బాబుతో కలిసి ఎం.వి.కిరణ్‌రెడ్డి, సి.భరత్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం చిత్ర బృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'కొత్త సినిమాలని ప్రోత్సహించే గుణం తెలుగు ప్రేక్షకుల్లోనే వుంది. ఆ విషయం ఈ సినిమాతో మరోసారి రుజువైంది. ఈ ఏడాది వరుసగా ఘాజీ, బాహుబలి-2, నేనే రాజు నేనే మంత్రి వంటి విజయాల్ని సొంతం చేసుకోవడం ఆనందంగా వుంది. ఇకపై కూడా కొత్త తరహా సినిమాల్ని చేస్తాను' అన్నారు. తేజ మాట్లాడుతూ 'చాలా ఏళ్లుగా ఫ్లాప్ సినిమాలే తీస్తున్న నాకు...నేను కూడా హిట్ సినిమాలు తీయగలనని ఈ సినిమాతో తెలిసింది. ఇక మీదట విజయవంతమైన సినిమాలే తీస్తా. ఈ కథ ముందు రానాకే వినిపించాను. 'ఎప్పుడు చేద్దాం' అని అడిగాడు. సురేష్‌బాబుకు చెబితే 'ఇందులో కొన్ని లోపాలున్నాయ్' అన్నారు. నాకు కోపం వచ్చింది. మనం నిర్మాతని మార్చేద్దాం. మరొకరితో చేద్దాం అన్నాను. కానీ..ఆ తరువాత ఆయన చెప్పింది నిజమే అనిపించింది. మధ్యలో పరుచూరి బ్రదర్స్ వచ్చారు. 'వాళ్లు చెప్పినట్టు చేయను. నాకు నచ్చినట్టే చేస్తా' అన్నాను. అయితే కొన్ని సార్లు నేనే వాళ్లదారిలోకి వెళితే...కొన్ని సార్లు వాళ్లు నా దారిలోకి వచ్చారు. పాజిటివ్, నెగెటివ్ ఇలా రెండు తరహాల పాత్రలు రానా చేయగలడు. ఇలాంటి కథానాయకులు వున్నప్పుడే తెలుగులో కొత్త కథలొస్తాయి' అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి బ్రదర్స్, లక్ష్మీభూపాల్, అనూప్‌రూబెన్స్ తదితరులు పాల్గొన్నారు.

'సినిమాకు వస్తున్న కలెక్షన్‌లు చూసి నిజమేనా అని కంగారుపడ్డాను. రానా వన్‌మ్యాన్ షో అని అంతా అంటున్నారు. యూనిట్ అంతా కలిస్తేనే సినిమా అవుతుంది. ఒక నటుడు ఎప్పుడు బాగా చేయగలుగుతాడంటే అతని పాత్రని బాగా తీర్చిదిద్దినప్పుడే. తెలుగు హీరో ఇలాంటివి చేయకూడదని చెప్పిన వాటన్నింటినీ బ్రేక్‌చేసి తీసిన సినిమా ఇది' అన్నారు రానా.


వంశీకృష్ణశ్రీనివాస్, బుచ్చయ్యచౌదరి, తలసాని శ్రీనివాస్ యాదవ్, భరత్, సృష్టి, శివకుమార్

'ఓయ్ నిన్నే' పాటలు

భరత్, సృష్టి ధాంగే జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓయ్ నిన్నే' చిత్ర గీతాలు శనివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. సత్య చల్లకోటి దర్శకుడు. ఎస్.వి.కె. సినిమా పతాకంపై వంశీ కృష్ణ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శేఖర్‌చంద్ర సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియోను రచయిత కోన వెంకట్ విడుదల చేశారు. తొలి సీడీని దర్శకుడు అనిల్ రావిపూడి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ 'తెలుగు సినిమా అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో తోడ్పడుతున్నది. శ్రీమంతుడు, బాహుబలి వంటి చిత్రాల నుంచి ఇటీవల విడుదలైన 'ఫిదా' వరకు కొత్త తరహా కథాంశాలతో రూపొందిన చిత్రాలన్నీ మంచి విజయాల్ని సొంతం చేసుకుంటున్నాయి. అదే కోవలో కొత్త వాళ్లు నటించిన 'ఓయ్ నిన్నే' కూడా మంచి విజయాన్ని సాధించాలి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'నేను నిర్మించిన చిత్రాల్లో నాకు బాగా నచ్చిన చిత్రం 'సోలో'. దానికన్నా గొప్పగా వుండే చిత్రమిది. దర్శకుడు సత్య చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. నవతరం మెచ్చే ప్రేమకథా చిత్రమిది' అన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ 'ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయి. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. మంచి చిత్రంలో భాగం కావడం ఆనందంగా వుందని హీరో భరత్, సృష్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీడీపీ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కృష్ణచైతన్య, సత్య చల్లకోటి, శేఖర్‌చంద్ర, రామజోగయ్యశాస్త్రి, చంద్రసిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

ఆ రోజులు రావాలి!


తాప్సీ

చిత్రసీమలో హీరో, హీరోయిన్ల పారితోషికాల మధ్య ఎంతో అంతరం వుంటుంది. అగ్ర హీరోలు పది నుంచి 20కోట్ల మధ్య పారితోషికాల్ని అందుకొంటుంటే...టాప్ హీరోయిన్లు మాత్రం రెండుమూడు కోట్లతోనే సరిపుచ్చుకుంటున్నారు. ఈ ధోరణిలో మార్పు రావాలని చాలా మంది కథానాయికలు కోరుకుంటున్నారు. అయితే ఢిల్లీ సొగసరి తాప్సీ మాత్రం...హీరోలు ఎక్కువ పారితోషికం అందుకోవడం సబబే అంటున్నది. కథానాయిక ప్రధాన చిత్రాలు వందకోట్ల కలెక్షన్స్ సాధించిన రోజున హీరోలతో సమానంగా హీరోయిన్లు రెమ్యురేషన్ డిమాండ్ చేయొచ్చని చెబుతున్నది. 'కథానాయిక ప్రధాన చిత్రాలు చాలా తక్కువగా వస్తున్నాయి. వాటిలో విజయం సాధించేవి ఒకటిరెండు మాత్రమే వుంటున్నాయి. నాయికా ప్రధాన చిత్రాలు కూడా పదికోట్ల ఓపెనింగ్ కలెక్షన్స్ సాధించిన రోజున హీరోలతో సమానంగా పారితోషికాన్ని కోరవచ్చు. అలాంటి రోజులు రావాలని కోరుకుంటున్నాను' అని తాప్సీ పేర్కొంది. తెలుగులో ఈ సుందరి నటించిన 'ఆనందో బ్రహ్మ' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.


బాలకృష్ణ

ఖమ్మంలో పాటల పల్లకి

బాలకృష్ణ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పైసా వసూల్'. భవ్య క్రియేషన్స్ పతాకంపై ఆనంద్‌ప్రసాద్ నిర్మిస్తున్నారు. శ్రియ, ముస్కాన్ కథానాయికలు. చిత్ర గీతాలను ఈ నెల 17న ఖమ్మంలో విడుదలచేయనున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. బాలకృష్ణ నటన, పూరి జగన్నాథ్ దర్శకత్వ ప్రతిభ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఇటీవల విడుదలైన స్టంపర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. ఇప్పటివరకు డెబ్బై లక్షల మంది దీనిని వీక్షించారు. ప్రకటించిన తేదీ కంటే నెల రోజుల ముందుగా సెప్టెంబర్ 1న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని తెలిపారు. కబీర్‌బేడి, అలీ, పృథ్వీ, విక్రమ్‌జీత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్,

గుడ్ బ్యాడ్ అగ్లీ....


మురళి, శ్రీముఖి, హర్షవర్ధన్

'1988-89 మధ్యకాలంలో ఓ పల్లెటూరిలో జరిగే ప్రేమకథా చిత్రమిది. చందమామ కథల మాదిరిగా తెలుగు ప్రేక్షకులకు చక్కటి అనుభూతిని పంచుతుంది' అని అన్నారు హర్షవర్ధన్. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. మురళి, శ్రీముఖి జంటగా నటిస్తున్నారు. అంజిరెడ్డి నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ 'నటుడిగా చిత్రసీమకు పరిచయమయ్యాను. ఆ తర్వాత గుండెజారి గల్లంతయ్యిందే, మనం చిత్రాలు రచయితగా నాకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ సినిమాతో నా సినీ ప్రయాణం కొత్త మలుపు తిరగనుంది. నేను దర్శకుడిగా మారి తెరకెక్కిస్తున్న తొలి చిత్రమిది. మంచి, చెడు తింగరితనం మూడు అంశాల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఫీల్‌గుడ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా అందరిని మెప్పిస్తుందనే నమ్మకముంది. 20 ఏళ్ల క్రితం సంగీత దర్శకుడిని కావాలనే కోరికతో హైదరాబాద్‌కు వచ్చాను. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి' అని అన్నారు. 'జెంటిల్‌మెన్' తర్వాత మరోసారి అభినయానికి ప్రాధాన్యమున్న పాత్రలో నటించడం ఆనందంగా ఉందని శ్రీముఖి చెప్పింది. ఈ కార్యక్రమంలో విశ్వేష్‌బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భాష, యాసకు నిలువుటద్దం 'ఫిదా'


'ఫిదా' సినిమా తిలకిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

తెలంగాణ భాష, యాసకు నిలువుటద్దం 'ఫిదా' సినిమా అని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని మహేశ్వరీ థియేటర్‌లో మంత్రి 'ఫిదా' సినిమాను స్థానిక నాయకులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినిమాను అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు శేఖర్ కమ్ములకు, నిర్మాత దిల్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్రంలో హీరోయిన్‌గా సాయిపల్లవి నటన తనను ఆకట్టుకుందన్నారు. గతంలో సినిమాలు అనగానే సీమాంధ్ర, కోస్తాంధ్రలో తీసేవారని, దర్శకుడు శేఖర్ కమ్ముల కామారెడ్డి జిల్లాలో సినిమా తీసి ఇక్కడి పల్లెటూరు అందాలను తెరకెక్కించిన తీరు ప్రశంసనీయమని అన్నారు. కామారెడ్డి జిల్లా సైతం సినిమాలు తీసేందుకు అనుకూలమని నిరూపించారని అన్నారు. సినిమాలో బాన్సువాడ ప్రాంతానికి చెందిన వారు చాలా మంది నటించడం సంతోషకరమన్నారు.

ఆరు విచిత్ర పాత్రల కథ!


మహి.వి.రాఘవ్

''పాఠశాల' ఆశించిన విజయాన్ని సాధించకపోవడంతో మంచి సినిమాతోనే మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావాలనుకుని కొంత విరామం తీసుకున్నాను. హారర్ కామెడీ నేపథ్యంలో సినిమా చేయాలనే నిర్ణయానికి వచ్చినప్పుడు రొటీన్‌కు భిన్నంగా మనిషికి దెయ్యం భయపడితే ఎలా వుంటుంది? అనే ఆలోచన తట్టింది. కొత్తగా చెబితేనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఆ నమ్మకంతో చేసిన కొత్త ప్రయత్నమిది' అన్నారు మహి.వి.రాఘవ్. ఆయన రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఆనందో బ్రహ్మ'. తాప్సీ ప్రధాన పాత్రలో నటించింది. విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ కామెడీ చిత్రాలు చూసి బోర్ కొట్టింది. అందుకే ఆ ట్రెండ్‌కు పూర్తి భిన్నంగా 'ఆనందో బ్రహ్మ' చిత్రాన్ని తెరకెక్కించాను. 'బేబీ' చిత్రానికి ముందే తాప్సీకి కథ వినిపించాను. అయితే ఆ తరువాత బాలీవుడ్‌లో ఆమె బిజీ కావడం, నాకు నిర్మాతలు దొరకడానికి ఆలస్యమైంది. నిర్మాతలు కుదిరిన తరువాత తాప్సీ కోసం కొంత సమయం వేచి చూశాను. ఇందులో తాప్సీ పాత్ర ఎలా వుంటుంది అనేది మాత్రం సస్పెన్స్. అదేమిటనేది తెరమీద చూడాల్సిందే. చిత్రమైన ఆరు పాత్రల నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తిని పంచే చిత్రమిది. ఈ ఆరు పాత్రల్లో గుండె నొప్పితో బాధపడే వాడు ఒకడైతే.. ఒకడేమో తాగుబోతు. మరొకడికి రేచీకటి. ఒకడేమో స్ప్లిట్ పర్సనాలిటీ. ఇలాంటి విచిత్రమైన వ్యక్తులు తమ లోపాల్ని బలంగా మార్చుకుని దయ్యాన్ని ఎలా భయపెట్టారనేది ఆసక్తిని పంచుతుంది. ఆ నలుగురు యువకులుగా శ్రీనివాసరెడ్డి, తాగుబోతు రమేష్, వెన్నెల కిషోర్, షకలక శంకర్ నటించారు. నేపథ్య సంగీతం పరంగా కూడా కొత్తగా వుండే చిత్రమిది. గత హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌లతో పోలిస్తే కొత్తగా వుంటూనే కామెడీ, ఎమోషనల్ డ్రామా అద్భుతంగా కుదిరింది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకముంది. తదుపరి సినిమా గురించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ సినిమా విడుదల తరువాతే మరో సినిమా గురించి ఆలోచిస్తాను' అన్నారు.



కల్తీ నూనెను పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

కల్తీనూనె తయారీ కంపెనీ సీజ్

- వికారాబాద్ జిల్లాలో వెయ్యి లీటర్ల నూనె స్వాధీనం

వికారాబాద్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: వికారాబాద్ జిల్లా ధారూరు మండలం దోర్నాల్ గ్రామ పరిధిలో కోళ్ల దాణా తయారీ ముసుగులో కల్తీనూనె తయారు చేస్తున్న స్థావరంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడి చేశారు. దోర్నాల్ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ధారూరు సీఐ ఉపేందర్, రెవెన్యూ అధికారులు ఆదివారం కల్తీ నూనె తయారీ కేంద్రంపై దాడి చేసి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన మత్లుబ్ ఖురేషి 2016లో దోర్నాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 113లో నాలుగు ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశాడు. కోళ్ల దాణా తయారీ కంపెనీ ఏర్పాటు చేసేందుకు అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్‌గా మార్చుకుని, 'మరియా ఫెడ్ ఇండస్ట్రీస్' పేరుతో సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందాడు. అన్ని అనుమతులు వచ్చాక జంతు కళేబరాలతో నూనె, డాల్డా తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. కల్తీ నూనె తయారీ కేంద్రాన్ని సీజ్ చేయడంతోపాటు వెయ్యి లీటర్ల కల్తీ నూనె, 210 బ్యాగుల జంతు కళేబరాల పొడితో తయారు చేసిన కోళ్ల దాణా, 150 లీటర్ల కల్తీ డాల్డా, జంతువుల బొక్కల పొడి, కొవ్వు పదార్థాలు పెద్ద ఎత్తున ఉన్నట్టు సీఐ తెలిపారు.

24 గంటలు.. 507 చిత్రాలు

- ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆర్టిస్ట్ హర్ష



ఇండియా బుక్ ఆఫ్ రికార్డుతో ఆర్టిస్ట్ హర్ష

ఖైరతాబాద్: పెన్సిల్‌ను కుంచెగా మలిచి 24 గంటలపాటు ఏకధాటిగా అద్భుతమైన చిత్రాలను గీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు ఈ కళాకారుడు. నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా శనివారం ఉదయం 11:15 గంటలకు ప్రారంభమైన ఆర్టిస్ట్ హర్ష చిత్రలేఖనం ఆదివారం ఉదయం 11:15 గంటలవరకు కొనసాగింది. 12 పెన్సిళ్లతో 507 బొమ్మలను గీసి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను ఆ సంస్థ ప్రతినిధి డాక్టర్ హరికుమార్, సౌత్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి ఆర్టిస్ట్ హర్షకు అందజేశారు. 24 గంటలపాటు ఆర్టిస్ట్ హర్ష వేస్తున్న చిత్రాలను నిరంతరాయంగా వీడియో తీశారు. ఆ వీడియోను ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలకు పంపించగా, మరో 40 రోజుల్లో కళాకారుడు హర్ష కల నేరవేరనున్నది. ఈ సందర్భంగా ఆర్టిస్ట్ హర్ష మాట్లాడుతూ ప్రయత్నిస్తే ఎవరికైనా రికార్డులు వస్తాయన్నారు. ఎందరో పేద కళాకారులు టాలెంట్ ఉన్నా రోడ్డుపై చిత్రాలు వేస్తూ తమను గుర్తించే వారు లేక మరుగున పడిపోతున్నారని, అలాంటివారిని ప్రోత్సహిస్తానని చెప్పారు. తన రికార్డు తానే బ్రేక్ చేసేందుకు త్వరలోనే మరో ఫీట్ చేస్తానన్నారు.

మురుస్తున్న మూడు పల్లెలు

కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లిలో అభివృద్ధి పరుగులు.. సీఎం కేసీఆర్ పర్యటనతో మారుతున్న రూపురేఖలు

రూ.62 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. గ్రామాల్లో పెరుగుతున్న మౌలిక వసతులు.. 'పవర్ డే'తో కరెంట్ కష్టాలకు చెక్.. ఉత్సాహంగా హరితహారం



మూడుచింతలపల్లి గ్రామం

మేడ్చల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి/శామీర్‌పేట/మేడ్చల్ రూరల్: ఆ మూడు రాజధానికి అతి చేరువలో ఉన్న పల్లెలు. ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్‌సిటీ కేంద్రంగా మాత్రమే రియల్ దందా జరిగిందని.. పల్లెలకు అభివృద్ధి ఫలాలు అందలేదనడానికి నిదర్శనంగా కనిపిస్తుంటాయి. మోరీలు లేక రోడ్లపైకి మురుగునీరు చేరేది. స్వరాష్ట్రం సిద్ధించేంతవరకు గుక్కెడు మంచినీళ్లు లేక జనం అల్లాడారు. అత్యవసర సమయాల్లో పది కిలోమీటర్లు ప్రయాణిస్తేగానీ దవాఖాన కనిపించదు. ఇదీ మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి గ్రామాల పరిస్థితి. అయితే ఇదంతా వారం రోజుల కిందటి మాట. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ నెల 4వ తేదీన, 8వ తేదీన రెండుసార్లు పర్యటించడంతో మూడు గ్రామాల దశదిశ మారుతున్నది. రూ.62 కోట్లతో అభివృద్ధి పనులు పరుగు పెడుతున్నాయి. ఆరు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఆరు నెలల్లోపే పరిష్కారం కానున్నాయి. ఇప్పటికే ఇంటింటికీ భగీరథ నీరు చేరగా.. వచ్చే ఏడాది గోదావరి జలాలతో చెరువులు నింపేందుకు పనులు చకచకా సాగుతుండడంతో మూడు గ్రామాల ప్రజలు మురిసిపోతున్నారు.

భారీగా నిధులు.. వేగంగా పనులు

తన పర్యటన సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు 'ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధి' నుంచి మూడు గ్రామాలకు కలిపి రూ.62 కోట్లు విడుదల చేశారు. కేశవరం గ్రామానికి రూ.12.26 కోట్లు, లక్ష్మాపూర్‌కు రూ.15.50 కోట్లు, మూడుచింతలపల్లికి రూ.28.71 కోట్లు, లింగాపూర్ తండాకు రూ.58 లక్షలను విడుదల చేశారు. గ్యాప్ వర్కులు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు జిల్లా కలెక్టర్‌కు అదనంగా రూ.5 కోట్లు మంజూరు చేశారు. అభివృద్ధి పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ లక్ష్యం నిర్దేశించారు. ఆగస్టు 15వ తేదీ తర్వాత మరోసారి శామీర్‌పేట మండలానికి వస్తానని, మూడు గ్రామాల్లో తక్షణం చేయాల్సిన పనులను పూర్తి చేయడంతోపాటు అభివృద్ధి పనులపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సీఎం కేసీఆర్ జిల్లా కలెక్టర్‌ను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీంతో వివిధ శాఖలకు చెందిన అధికారయంత్రాంగం మూడు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అధికారులు సెలవు రోజుల్లోనూ గ్రామాల్లో తిరుగుతూ అభివృద్ధి పనులను పరుగు పెట్టిస్తున్నారు.

'పవర్ డే'కు ఏర్పాట్లు



లక్ష్మాపూర్‌లో విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

మూడు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించుకునేందుకు 'పవర్ డే' నిర్వహించాలని, అధికారులు, స్థానికులు కలిసి గ్రామాల్లోని విద్యుత్ సంబంధ ఇబ్బందులన్నింటినీ పరిష్కరించుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఈ మేరకు మూడు గ్రామాల్లో అవసరమైన చోట కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో 'పవర్ డే' నిర్వహించి కొత్త స్తంభాలకు తీగలు లాగుతామని, విద్యుత్ ఇబ్బందులను పరిష్కరిస్తామని అధికారులు చెప్తున్నారు.

లక్ష్మాపూర్ గ్రామానికి నక్షా..

లక్ష్మాపూర్ ఒకప్పుడు నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలంలో భాగంగా ఉండేది. తర్వాత రంగారెడ్డి జిల్లాలో కలిపారు. దీంతో ఈ గ్రామానికి ఇప్పటికీ ఓ నక్షా లేదు. ఈ విషయాన్ని గ్రామస్తులు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో.. వెంటనే సమగ్ర భూసర్వే నిర్వహించి గ్రామ నక్షాను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు సర్వేలో నిమగ్నమయ్యారు.



లక్ష్మాపూర్‌లో అధికారులతో సమావేశమైన జేసీ

పచ్చదనం వెల్లివిరిసే దిశగా..

'ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పెంచాలి. మరో రెండేండ్లలో ఊర్లో ఇండ్లు కనిపించొద్దు. చెట్లే కనిపించాలి' అని సీఎం కేసీఆర్ గ్రామస్తులకు సూచించడంతోపాటు ప్రజల నుంచి మాట తీసుకున్నారు. ఆరు మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తే ఇంటికి రెండు పాడిపశువులను ఇస్తానని కూడా హామీ ఇచ్చారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సీఎంకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా కదులుతున్నారు. మా ఊరిని బాగు చేస్తున్న సీఎం కోరిక మేరకు ఇంటికి ఆరు కంటే ఎక్కువ మొక్కలు పెంచి చూపిస్తామని చెప్తున్నారు. ఇప్పటివరకు లక్ష్మాపూర్‌కు 4 వేలు, మూడుచింతపల్లికి 5,500, కేశవరానికి 3,500 వరకు మొక్కలు వచ్చాయి. పంచాయతీ సిబ్బంది ఒక్కో ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. అడిగినవారికి ఎక్కువ కూడా ఇస్తున్నారు. పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతున్నది. మొక్కలు పెంచి పాడి సంపదను తమ ఇంటికి రప్పించుకోవాలనే ఉత్సాహం ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తున్నది. మరోవైపు గ్రామంలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు. మూడో విడుత హరితహారంలో భాగంగా లక్ష్మాపూర్‌లో దాదాపు 18 వేలు, మూడుచింతలపల్లిలో 14 వేలు, కేశవరంలో 14 వేల మొక్కలు నాటారు. ఇప్పటికే ఉన్న చెట్లు, హరితహారం మొదటి, రెండు, మూడో విడుతలో నాటిన మొక్కలు కలిపితే త్వరలోనే ఈ మూడు గ్రామాలు లక్షకు పైగా చెట్లతో పచ్చదనంతో కనువిందు చేయనున్నాయి.



లక్ష్మాపూర్‌లో మొక్కలు నాటుతున్న స్థానికులు



పల్లెలకు పూర్వ వైభవం

పల్లెలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే చెరువుల అభివృద్ధి, హరితహారం, కనీస సౌకర్యాల కల్పన, పాడిపంటలకు చేయూత వంటి కార్యక్రమాలను చేపట్టారు. మూడు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేస్తాం.

- ఎంవీ రెడ్డి, కలెక్టర్, మేడ్చల్ జిల్లా

రూపురేఖలు మారుతున్న పల్లెలు

సీఎం కేసీఆర్ పర్యటన తర్వాత జిల్లాలోని పల్లెల రూపురేఖలు మారుతున్నాయి. పెద్ద మొత్తంలో నిధులు వస్తుండడంతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంద్రాగస్టు నుంచి అన్ని గ్రామాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా ప్రకటిస్తున్నాం.

- సురేశ్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



గ్రామం	గడపలు	జనాభా	నాటే మొక్కలు (ఆరు చొప్పున)
లక్ష్మాపూర్	701	2,059	4,206
కేశవరం	750	3,220	4,500
మూడుచింతలపల్లి	565	2,740	3,390
మొత్తం	2,016	8,019	12,096

చలానే కదా.. కట్టేద్దాం!

- తరుచూ ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులు
- మూడేండ్లలో టాప్-10 వాహనాల జరిమానా రూ.59 లక్షలు
- పాయింట్ల వ్యవస్థతో ఉల్లంఘనుల వైఖరిలో మార్పు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ట్రాఫిక్ పోలీసులకు జరిమానాల రూపంలో రూ.లక్షలు కడుతున్నా కొందరు వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. ఈ నెల నుంచి అమలులోకి వచ్చిన పెనాల్టీ పాయింట్ల విధానంతో వారు దారిలోకి వచ్చే అవకాశం ఉన్నది. ముఖ్యంగా వ్యాపార నిమిత్తం నగరానికి నిత్యం వచ్చిపోయే గూడ్స్ క్యారియర్ వాహనాల్లో కొన్నింటికి ఇప్పటివరకు రూ.లక్షల్లో జరిమానాలు విధించారు. ఆయా వాహనాలు కంపెనీల పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఉండడంతో వాహనం నంబర్‌పై పోలీసులు విధించే ఈ-చలాన్లు నేరుగా కంపెనీ యజమాన్యాలకు వెళ్తున్నాయి. కంపెనీ జరిమానా చెల్లిస్తుండడంతో డ్రైవర్లు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. వీరిలో కొందరు మూడేండ్లలో వాహనం ధరలో సగం డబ్బులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడి జరిమానాలు చెల్లించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నగరంలో మూడేండ్లలో అత్యధికంగా జరిమానాలు చెల్లించిన 10 వాహనాల్లో 9 కూల్‌డ్రింక్ కంపెనీకి చెందినవే కావడం గమనార్హం. మరొకటి ఆటో రిక్షా కాగా, అది ఓ ఫైనాన్స్ సంస్థకు చెందినది. ఈ టాప్-10 వాహనాల నుంచి వసూలు చేసిన మొత్తం అక్షరాలా రూ.59,80,580. పగటి వేళల్లో నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేకున్నా పలు వాహనాలు ప్రవేశిస్తుంటాయి. వాటికి ట్రాఫిక్ పోలీసులు ఈ-చలాన్ విధిస్తుంటారు. వారు వెంటవెంటనే జరిమానాలు చెల్లిస్తుండడంతో స్పెషల్ డ్రైవ్‌లలో కూడా చిక్కడం లేదు. అయితే కొత్తగా వచ్చిన పాయింట్ల వ్యవస్థ ప్రకారం వాహనాన్ని ఆపి చలానా వేస్తున్నారు. దీంతో డ్రైవర్ లైసెన్స్‌పై పాయింట్లు జమ అవుతున్నాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఇలాంటి డ్రైవర్లలో భయం నెలకొన్నది. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలనే ఆలోచనతో వాహనాలు నడుపుతున్నారు.

వాహనదారుల్లో స్పష్టమైన మార్పు



గతంలో ఈ-చలాన్లు అమలు చేసినప్పుడు కొందరిలో మార్పు వచ్చింది. నిబంధనలు పాటించే వారి సంఖ్య పెరిగింది. అయితే కొందరు మాత్రం తమ వైఖరి మార్చుకోకుండా తరుచూ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకొచ్చిన పెనాల్టీ పాయింట్ల విధానంతో ప్రతి వాహనదారుడిలో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నది. గతంలో రూ.లక్షలు ఈ-చలాన్ చెల్లించిన వాహనదారులు ఇప్పుడు తమ వైఖరిని మార్చుకొంటున్నారు.

- నర్సింగ్‌రావు, ఈ-చలాన్ ఇన్‌స్పెక్టర్

మూడేండ్లలో అత్యధికంగా జరిమానాలు చెల్లించిన వాహనాలు ఇవే

వాహనం నంబర్	జరిమానా మొత్తం(రూ.ల్లో)
ఏపీ09వీ6780	7,64,220
ఏపీ29వీ3285	6,63,625
ఏపీ28యూ2081	6,55,635
ఏపీ09వీ8015	5,99,345
ఏపీ28యూ1711	5,78,330
ఏపీ29డబ్ల్యూ0814	5,73,830
ఏపీ28యూ2078	5,59,455
ఏపీ28యూ2139	5,36,885
ఏపీ09వీ6872	5,25,575
ఏపీ09వీ6735	5,23,680



'యూత్ ఫర్ వలంటరీ యాక్షన్' ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో 'రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ హైదరాబాద్' పేరుతో 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ బొంతు రామ్మోహన్, శ్రీదేవీ దంపతులతోపాటు డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, బెవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ రన్‌లో యూత్ అండర్ వలంటరీ యాక్షన్ (యువ) అధ్యక్షుడు కుందారపు స్నేహిత్‌రాజ్, నిర్వాహకుడు రవిచరణ్, సినీ నిర్మాత శివకుమార్, గాయకుడు మిట్టపల్లి సురేందర్, సామాజిక వేత్త భవాని తదితరులు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్



రద్దయిన నోట్లతో నిందితులు ప్రవీణ్‌రాజ్, కిరణ్‌కుమార్

నోట్ల మార్పిడికి యత్నం.. ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రద్దయిన నోట్లను మార్పిడి చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.41 లక్షల రద్దయిన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ లింబారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బంజారాహిల్స్ ఇందిరానగర్‌కు చెందిన పర్చ కిరణ్‌కుమార్ వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారి. చందానగర్‌కు చెందిన రాపోల్ ప్రవీణ్‌రాజ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతడు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో కిరణ్‌కుమార్‌తో స్నేహం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వీరిద్దరికీ కస్టమర్ల నుంచి భారీ మొత్తంలో రద్దయిన నోట్లు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం విధించిన గడువులోగా వీటిని మార్చుకోలేక పోయారు. ప్రస్తుతం కిరణ్ వద్ద రూ.36 లక్షలు, ప్రవీణ్ వద్ద రూ.5 లక్షలు రద్దయిన నోట్లు ఉన్నాయి. 40 శాతం కమీషన్ పద్ధతిలో ఈ నోట్లను మారుస్తానంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ గుర్తుతెలియని వ్యక్తి వీరికి హామీ ఇచ్చాడు. దీంతో తమ వద్ద ఉన్న రూ.41 లక్షల రద్దయిన నోట్లను తీసుకొని నగరంలోని చాపల్‌రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నారు. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు బృందం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి రద్దయిన నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

నో పోలీస్.. ఓన్లీ సిగ్నల్స్!

- త్వరలోనే పూర్తిస్థాయి మానవరహిత చౌరస్తాలు
- పాయింట్ల పద్ధతితో ప్రయాణికుల్లో మార్పు
- 12 పాయింట్ల ప్రామాణికతతో జాగ్రత వహిస్తున్న వాహనదారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ట్రాఫిక్ ఉల్లం'ఘనుల'ను మార్చేందుకు చేపట్టిన పాయింట్ల జరిమానాల వల్ల వాహనదారుల్లో క్రమంగా మార్పు వస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్‌లోని కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇప్పుడున్న మానవ సూచికలకు చెక్ పడనున్నది. త్వరలోనే పూర్తిస్థాయి మానవ రహిత సిగ్నల్స్‌ను విజయవంతంగా నడిపించేందుకు రవాణా, పోలీసుశాఖ సంయుక్త కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. కేవలం సిగ్నల్స్‌తోనే అన్ని చౌరస్తాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందుకు సాగాలనే లక్ష్యం త్వరలోనే నెరవేరుతుందని రవాణా శాఖ అధికారులు భావిస్తున్నారు. 12 పాయింట్ల విధానం వల్ల గతంలో కంటే తక్కువశాతం ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలు పాటిస్తూ చౌరస్తాల్లోనూ సిగ్నల్స్‌కు అనుగుణంగా సాగుతున్నారు. పెనాల్టీ పాయింట్ల విధానం ద్వారా కొత్త తరహాలో ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్న దృష్ట్యా 13 రోజుల నుంచి పాయింట్లు తక్కువ మొత్తంలో నమోదవుతున్నాయి. జరిమానాలకు భయపడిన వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అలవాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రోజుకు రెండు వేల పాయింట్లు మాత్రమే నమోదవుతున్నాయి. గడిచిన 13 రోజుల్లో 26 వేల పాయింట్లు మాత్రమే నమోదైనట్టు రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

హెల్మెట్‌పై అధిక పాయింట్లు

ప్రధానంగా వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడంతో జరిమానా పాయింట్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. రాంగ్ రూట్ ప్రయాణం, కార్లల్లో సీటు బెల్ట్ వంటి కేసులు కూడా చోటుచేసుకుంటున్నాయి. రోజుకు 1,200 చొప్పున హెల్మెట్ లేక పెనాల్టీ పాయింట్లు నమోదవుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఎంవీఐ చట్టం ప్రకారంగా ఆటోలో సీట్లకంటే అదనంగా ప్రయాణికులను ఎక్కించుకుంటే 1, గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే 2, సీట్ బెల్ట్, హెల్మెట్ లేనివారికి 1, రాంగ్‌రూట్ డ్రైవింగ్ 2 పాయింట్ల చొప్పున పెనాల్టీ పాయింట్లు పడుతున్నాయి. లైసెన్స్ నంబర్ మీదుగా ఈ పాయింట్ల సిస్టం కొనసాగుతున్నది. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పాయింట్ల విధానాన్ని అమలు చేస్తున్నది. దీనిద్వారా రోడ్డు ప్రమాదాలు చాలావరకు తగ్గుముఖం పడుతున్నట్టు పోలీసు అధికారులు చెప్తున్నారు. గతంలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో చిన్నచిన్న రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులు నమోదవుతుండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయినట్టు అధికారులు చెప్తున్నారు.

12 పాయింట్లు దాటితే అంతే..

నిబంధనలు పాటించని వాహనదారుడిపై ఒక పక్క ఈ-చలాన్లు జారీ చేస్తూనే, మరో పక్క వాటికి సమాంతరంగా పాయింట్లు జత చేయనున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుడికి 12 పాయింట్లు జత అయ్యాయంటే అతడి లైసెన్స్ రద్దవుతుంది. రద్దయిన సమయంలో వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే.



ఆగస్టు 15 సందర్భంగా హైదరాబాద్ బైస్లికింగ్ క్లబ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా ఆదివారం మాదాపూర్ హైటెక్స్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆవరణలో 'చెక్ దే ఇండియా బైస్కిల్ రైడ్'ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, సమాచారశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, తెలంగాణ సీఐఐ చైర్మన్ రాజన్న, హైదరాబాద్ బైస్లికింగ్ క్లబ్ చైర్మన్ మనోహర్ తదితరులు హాజరయ్యారు.

- కొండాపూర్

అశ్లీల షార్ట్‌ఫిల్మ్స్ తీసిన ముగ్గురిపై కేసు నమోదు

మొయినాబాద్: సినిమాలో అవకాశాలు ఇప్పిస్తానని ఓ యువతిని నమ్మించి అశ్లీల షార్ట్‌ఫిల్మ్స్ చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ముగ్గురుపై కేసు నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న యువతి(24)కి ఏడాది కిందట తన సోదరుడి ద్వారా హైదరాబాద్‌కు చెందిన లోక్‌నాథ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. సినిమాలో అవకాశం ఇప్పిస్తానని యువతికి ఆశ చూపిన లోక్‌నాథ్ తన తల్లి విజయలక్ష్మి వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో యువతికి రూ.3 వేలు పారితోషికం ఇచ్చి షార్ట్ ఫిల్మ్‌లో నటించాలని చెప్పారు. బాధితురాలిని కృష్ణానగర్‌కు తీసుకెళ్లిన విజయలక్ష్మి తెల్లకాగితంపై ఆమెతో సంతకం చేయించుకుని షూటింగ్ యూనిట్ సభ్యులతో పంపించింది. యూనిట్ సభ్యులు యువతిని గుర్తుతెలియని ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో బాధితురాలు విజయలక్ష్మికి ఫోన్ చేసి విషయం చెప్పగా.. వాళ్లు ఎలా చెబితే అలా చేయకపోతే కేసుల్లో ఇరికిస్తానని బెదిరించింది. గత్యంతరంలేక అశ్లీల షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించింది. పరువు పోతుందని విషయాన్ని గోప్యంగా ఉంచింది. సదరు షార్ట్ ఫిల్మ్‌లను నిందితులు సోషల్ మీడియాలో పెట్టారు. ఇది చూసిన దవాఖానలో పని చేస్తున్న తోటి సిబ్బంది విషయాన్ని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దవాఖాన యాజమాన్యం బాధితురాలిని విధుల్లో నుంచి తొలగించింది. యువతి మొయినాబాద్ పోలీసులను ఆశ్రయించడంతో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశారు.

కరీంనగర్, రామగుండం రూట్లలో వజ్ర

ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు టీఎస్‌ఆర్టీసీ సన్నాహాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా, సేవలు మరింత విస్తరించే క్రమంలో వజ్ర ఏసీ మినీ బస్సు సర్వీసులను మరో రెండురూట్లలో ప్రవేశపెట్టేందుకు టీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది. 'ప్రయాణికుల ముంగిట్లోకి సర్వీస్' ప్రాతిపదికన ఈ ఏడాది మేలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతులమీదుగా ఈ కొత్త సర్వీసులను టీఎస్‌ఆర్టీసీ ప్రారంభించింది. అప్పట్లో ప్రయోగాత్మకంగా కేవలం రెండురూట్లలోనే వజ్ర బస్సులను ప్రవేశపెట్టిన సంస్థ దశలవారీగా వివిధ రూట్లలో ఈ సేవలు విస్తరిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం హైదరాబాద్- వరంగల్, హైదరాబాద్- నిజామాబాద్ రూట్లలో వజ్ర మినీ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ నెలాఖరు నాటికి హైదరాబాద్-కరీంనగర్, హైదరాబాద్-గోదావరిఖని-రామగుండం రూట్లలో ఈ బస్సులను ప్రారంభించేందుకు టీఎస్‌ఆర్టీసీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ రెండురూట్లలో రోజుకు 15 నుంచి 20 బస్సులు నడుపడానికి సన్నాహాలు చేస్తున్నది. ఈ బస్సులకు మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్‌చేసుకునే విధానం ఉండటంతో ప్రారంభంలో ప్రయాణికుల నుంచి అంతగా డిమాండ్ కనిపించ లేదు. అయితే ప్రస్తుతానికి నగదుతో టికెట్ పొందే సౌకర్యం కల్పించింది. యాప్ బుకింగ్ విధానం, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ నెల ఐదు నుంచి మొబైల్ యాప్ ద్వారా చేసే ప్రతి బుకింగ్‌పై రూ.25 చొప్పున ప్రయాణికులకు టికెట్లలో రాయితీ కల్పించింది. ఆయా రూట్లలో నగరంలోని పలుకాలనీలు, బస్తీలలో బోర్డింగ్ పాయింట్లు ఏర్పాటుచేసి ఈ బస్సులను అక్కడికి నడిపిస్తున్నది. చివరి నిమిషంలో బస్సు ఎక్కే ప్రయాణికులకు బస్సులోనే డ్రైవర్ ట్యాబ్ ద్వారా టికెట్ ఇచ్చే సౌకర్యాన్ని కూడా సంస్థ కల్పించింది. ఈ బస్సులో జీపీఎస్‌తో అనుసంధానం చేసిన మొబైల్ టాబ్‌ను బిగించి, టికెట్లు బుక్‌చేసుకున్న ప్రయాణికులు ఆ బస్సు కదలికలను తెలుసుకునే వీలు కల్పించారు. దీంతో వజ్ర బస్సుల్లో ప్రయాణికుల రద్దీ క్రమంగా పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. మొబైల్ యాప్‌లో సీట్లను రిజర్వేషన్ చేసుకునేందుకు టీఎస్‌ఆర్టీసీ ఒక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రజా రవాణా రంగంలో ఈ తరహా యాప్‌ను తీసుకురావడం దేశంలోనే తొలిసారి. టికెట్ల బుకింగ్ కోసం మొబైల్ యాప్‌ను అండ్రాయిడ్, ఐఓఎస్ సాఫ్ట్‌వేర్ ఉన్న మొబైల్ ఫోన్



ప్రయాణికులు గూగుల్ ప్లే స్టోర్, యాప్ స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. వజ్ర బస్సుల టికెట్ బుకింగ్ మొబైల్ యాప్‌ను మూడు నెలల క్రితం ప్రారంభించారు. ఇప్పటి వరకు 50 వేల మందికి పైగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు టీఎస్‌ఆర్టీసీ అధికారులు తెలిపారు.

కార్గో విమానం అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆదివారం షార్జాకు బయలుదేరిన కార్గో విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జా నగరానికి కార్గో టీజెడ్‌ఎస్ 310 విమానం ఉదయం 7.15 గంటలకు బయలుదేరింది. కొద్దిదూరం వెళ్లాక ఒక ఇంజిన్‌లో సాంకేతికలోపం ఏర్పడింది. దానిని వెంటనే గుర్తించిన పైలట్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు విమానసర్వీసెస్ ఆపరేషన్ అధికారులను సంప్రదించారు. అధికారుల అనుమతితో వెనుకకు తీసుకొచ్చి విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు.

ఇంటర్‌బోర్డుకు జాతీయ అవార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలికి అత్యుత్తమ డిజిటల్ సేవల వినియోగంపై జాతీయస్థాయి అవార్డు దక్కింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రపంచ విద్యాసదస్సులో శ్రీలంక విద్యామంత్రి వీఎస్ రాధాకృష్ణన్ నుంచి రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ ఈ అవార్డు అందుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పరీక్షల్లో సంస్కరణలు, అకడమిక్, పరిపాలనలో విద్యార్థులకు విశిష్ట సేవలు అందించినందుకు ఈ అవార్డు వచ్చిందని కార్యదర్శి అశోక్ తెలిపారు. ఆన్‌లైన్ అఫిలియేషన్ విధానం, పరీక్షలు, అకడమిక్, పరిపాలనకు జియోట్యాగింగ్, ఆన్‌లైన్‌లో షార్ట్‌టర్మ్ ఒకేషనల్ కోర్సులు, ఎగ్జామినేషన్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఎగ్జామినర్స్ హాజరునమోదు, చెల్లింపులకు ఆధార్ వినియోగం, ఆన్‌స్క్రీన్ వాల్యుయేషన్ విధానంలో పరీక్ష జవాబు పత్రాల రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ వంటి సేవలకు ఈ అవార్డు దక్కిందని ఆయన పేర్కొన్నారు.

ప్రతిభకు పట్టం

- సివిల్ సర్వీసెస్ అధికారులకు ఎక్సలెన్స్ అవార్డులు
- ఇన్నోవేషన్, సాధారణ విభాగాల్లో ఎంపిక
- ఆదిలాబాద్ కలెక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌కు రెండు పురస్కారాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తమ ప్రతిభ చాటుతున్న అధికారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భుజంతట్టి ప్రోత్సహిస్తున్నది. విధి నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తూ, సరికొత్త ప్రణాళికతో ముందుకెళ్తున్న సివిల్ సర్వీసెస్ అధికారులను 2017 సంవత్సరానికిగాను ఎక్సలెన్స్ అవార్డులతో సత్కరించనున్నది. ఇందులో భాగంగా ఇన్నోవేషన్, సాధారణ విభాగాల్లో అధికారులను ఎంపికచేసింది. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఆత్మరక్షణ కార్యక్రమం నిర్వహించినందుకు జనగామ జిల్లా కలెక్టర్ దేవసేన, ఐటీడీఏల్లో స్టార్స్ – 30 కార్యక్రమాన్ని అమలుచేసినందుకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్, ఐఏఎస్ అధికారులు ఆర్వీ కర్ణన్, అనురాగ్ జయంతి, డీపీఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) కార్యక్రమానికిగాను హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులుకు ప్రభుత్వం ఇన్నోవేషన్ క్యాటగిరీలో అవార్డులను ప్రకటించింది. పలు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా చేపట్టినందుకు పలువురు అధికారులను సాధారణ విభాగంలో ఎంపిక చేసింది. నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు పునరావాస కల్పన కోసం కృషి చేసినందుకు నిజామాబాద్ కలెక్టర్ యోగితా రాణా, జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌పై ప్రజల్లో నమ్మకం కలిగించినందుకు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ మురళి, జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపికయ్యారు. ప్రభుత్వం చేపట్టిన పలు నూతన పథకాలను విజయవంతంగా అమలుచేస్తున్నందుకు, ప్రజల్లోకి తీసుకెళ్తున్నందుకు కూడా ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. ఈ క్యాటగిరీలో మిషన్ భగీరథ కార్యక్రమానికి సిద్దిపేట్ కలెక్టర్ వెంకటరామరెడ్డి, మిషన్ కాకతీయకు భద్రాది కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి, ఆర్డీవో సీహెచ్ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ ఆర్ అరవిందకుమార్, తెలంగాణకు హరితహారం కింద సూర్యాపేట కలెక్టర్ సురేంద్రమోహన్, వరంగల్ రూరల్ కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, ఆరోగ్య లక్ష్మి పథకానికి నల్లగొండ కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ అవార్డులు అందుకోనున్నారు.

జిల్లాల్లో జాతీయజెండా ఎగురవేసేది వీరే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాల్లో జాతీయ జెండా ఎగురవేసే వారి జాబితాను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. వీరు మంగళవారం ఆయా జిల్లాల కేంద్రాల్లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. హైదరాబాద్ గోల్కొండ కోట వద్ద ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జాతీయ జెండాను ఎగురవేస్తారు. శాసనసభ స్పీకర్ , డిప్యూటీ స్పీకర్, శాసన మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, మంత్రులు, ప్రభుత్వ విప్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లాల్లో జాతీయ జెండాను ఎగురవేస్తారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి చందులాల్‌ను అనారోగ్య కారణాలతో మినహాయించారు. ఇద్దరు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సంగారెడ్డిలో బీఆర్ మీనా, మహబూబాబాద్ జిల్లాలో బీపీ ఆచార్య జాతీయ జెండా ఎగురవేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రాల్లో జెండాలు ఎగురవేసే వారి వివరాలు..

జిల్లా పేరు	పేరు, హోదా
జయశంకర్ భూపాలపల్లి	ఎస్ మధుసూదనాచారి, అసెంబ్లీ స్పీకర్
మహబూబాబాద్	బీపీ ఆచార్య, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
వరంగల్ (అర్బన్)	కడియం శ్రీహరి, ఉప ముఖ్యమంత్రి
వరంగల్ (రూరల్)	పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసనమండలి ప్రభుత్వ విప్
జనగామ	బీ వెంకటేశ్వర్లు, శాసనమండలి ప్రభుత్వ విప్
రాజన్న సిరిసిల్ల	కే తారక రామారావు, ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి
కరీంనగర్	ఈటల రాజేందర్, ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి
జగిత్యాల	కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ చీఫ్ విప్, అసెంబ్లీ
పెద్దపల్లి	పాతూరి సుధాకర్‌రెడ్డి, శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్
ఆదిలాబాద్	జోగు రామన్న, అటవీ, బీసీ సంక్షేమశాఖల మంత్రి
నిర్మల్	ఎ ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ, గృహ నిర్మాణశాఖల మంత్రి
మంచిర్యాల	నల్లాల ఓదెలు, ప్రభుత్వ విప్
కుమ్రంభీం ఆసిఫాబాద్	కే స్వామిగౌడ్, శాసనమండలి చైర్మన్
సిద్దిపేట	టీ హరీశ్‌రావు, నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖల మంత్రి
మెదక్	ఎం పద్మాదేవేందర్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్
సంగారెడ్డి	బీఆర్ మీనా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
నిజామాబాద్	పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి
కామారెడ్డి	గంప గోవర్ధన్, ప్రభుత్వ విప్
మహబూబ్‌నగర్	సీ లక్ష్మారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి
నాగర్‌కర్నూలు	జూపల్లి కృష్ణారావు, పీఆర్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి
వనపర్తి	ఎస్ నిరంజన్ రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు
జోగులాంగ గద్వాల	తలసాని శ్రీనివాస్‌యాదవ్, పశుసంవర్ధకశాఖ మంత్రి
ఖమ్మం	తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు భవనాలశాఖ మంత్రి
భద్రాద్రి కొత్తగూడెం	టీ పద్మారావుగౌడ్, ఎక్సైజ్‌శాఖ మంత్రి
నల్లగొండ	నేతి విద్యాసాగర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్
సూర్యాపేట	జీ జగదీశ్‌రెడ్డి, విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి
యాదాద్రి భువనగిరి	గొంగిడి సునీత, ప్రభుత్వ విప్
వికారాబాద్	పీ మహేందర్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి
రంగారెడ్డి	మహమూద్ అలీ, డిప్యూటీ సీఎం, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖల మంత్రి
మేడ్చల్	నాయిని నర్సింహారెడ్డి, హోంశాఖ మంత్రి

పసికందును పాతిపెట్టారు!

ఆదిలాబాద్ జిల్లా కప్పర్లలో దారుణం

భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్లలో ఓ మహిళ ప్రియుడితో కలిసి మూడురోజుల పసిగుడ్డును ఇంట్లో పాతిపెట్టింది. కప్పర్లకు చెందిన అంకుల వెంకటమ్మ భర్త ఆరేండ్ల క్రితం చనిపోయాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చి కప్పర్లలో ఉంటున్న షిండే శంకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన వెంకటమ్మకు పరిచయమయ్యాడు. వెంకటమ్మ ఇంట్లో ఓ బాబుకు జన్మనిచ్చింది. చుట్టుపక్కల వారికి భయపడ్డ వీరిద్దరు ఇంట్లోనే గోతి తవ్వి సజీవంగా ఉన్న పసిగుడ్డును పాతిపెట్టారు. పైగా బాబును శంకర్ కిడ్నాప్ చేశాడంటూ వెంకటమ్మ పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసింది. వీరిపై నిఘా వేసిన పోలీసులు ఆదివారం ఆదిలాబాద్ కేఆర్‌కే కాలనీలో పట్టుకున్నారు. తహసీల్దార్ రాంరెడ్డి సమక్షంలో సీఐ పురుషోత్తం, ఎస్సై రాజు ఇంట్లో తవ్వి బాబు మృతదేహాన్ని తీశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ఆదివారం రాత్రి విద్యుత్ దీపాల వెలుగుల్లో గోల్కొండ కోట

పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ ముస్తాబు

- విద్యుత్‌దీపకాంతుల్లో జిగేల్‌మంటున్న కోట
- 5000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- సీఎం కాన్వాయ్ రూట్‌లో రిహార్సల్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



ఆదివారం గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎస్ ఎస్పీ సింగ్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చారిత్రక గోల్కొండ కోట అన్నిహంగులతో ముస్తాబైంది. విద్యుత్‌దీప కాంతులతో వారసత్వ సంపద ధగధగలాడుతున్నది. మరోవైపు కేంద్ర నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీస్‌శాఖ భారీబందోబస్తు ఏర్పాటుచేసింది. వేడుకలు జరిగే హైదరాబాద్‌లోని గోల్కొండ కోట పరిసరాల్లో ఐదువేల మంది పోలీసులను మోహరించింది. ఇందుకు పోలీసుశాఖలోని అన్ని విభాగాల సేవలను వినియోగిస్తున్నట్టు సీనియర్ అధికారులు తెలిపారు. వేడుకలకు ముఖ్యమంత్రి కాన్వాయ్ వచ్చే రూట్‌లో ఆదివారం పోలీసులు రిహార్సల్స్ నిర్వహించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

భద్రతా బలగాల కవాతు

పంద్రాగస్టు వేడుకలకు చారిత్రక గోల్కొండకోటను అన్ని రకాల హంగులతో ముస్తాబు చేస్తున్నారు. మంగళవారం నిర్వహించే కార్యక్రమాలపై రిహార్సల్స్ జరుగుతున్నాయి. భద్రత కార్యక్రమాల రిహార్సల్స్‌తోపాటు పోలీసు, వివిధ భద్రత బలగాలు కవాతు నిర్వహించాయి. విద్యార్థులు కూడా పలు కార్యక్రమాలపై రిహార్సల్స్ చేశారు. నిఘావర్గాల సూచనల మేరకు అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నట్టు సీనియర్ పోలీస్ అధికారులు చెప్పారు. అదనపు డీజీపీ (శాంతి-భద్రతలు) అంజనీకుమార్ నాలుగురోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు గోల్కొండకోట వద్ద ఉంటూ భద్రత సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు.

ప్రగతిభవన్ టు గోల్కొండకోట రూట్ పరిశీలన

పంద్రాగస్టు వేడుకలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెళ్లేమార్గంలో ఆదివారం రిహార్సల్స్ నిర్వహించారు. ప్రగతిభవన్ నుంచి గోల్కొండకోట కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. దారి పొడువునా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. ఆయాప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు కూడా పలుసూచనలు చేశారు. పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వర్‌రావు స్థానిక పోలీసులతో సమావేశమై భద్రతపై అన్నిరకాల సూచనలు, సలహాలు ఇస్తున్నారు. పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబవుతుండగా మరోవైపు సందర్శకుల తాకిడి కూడా పెరిగింది. భద్రత నేపథ్యంలో పోలీసు, పురావస్తుశాఖల అధికారులు భేటీ అయ్యారు. పోలీసుల సూచనలకు అనుగుణంగా పురావస్తుశాఖ అధికారులు సహకరిస్తూ, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

యూపీఏ హయాంలోనే ఏడు మండలాల కుట్ర!

- ఆర్డినెన్సుకూ విశ్వ ప్రయత్నాలు: కేవీపీ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతం పేరుతో ఖమ్మంజిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయడానికి యూపీఏ హయాంలోనే కుట్ర ప్రారంభమైందా?.. అవుననే అంటున్నారు స్వయానా కాంగ్రెస్ పార్టీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు. మార్చి 2, 2014 నాటికే ఆర్డినెన్సును అప్పటి కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసినా ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన కారణంగా సాధ్యంకాలేదని ఆయన చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నట్లు తెలుగుదేశం మంత్రులు, నాయకులు రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఢిల్లీలో ఆదివారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడిన ఆయన ముంపు మండలాలకు సంబంధించిన వాస్తవాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొందిన తర్వాత.. మార్చి 2న నిర్వహించిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలోనే ఈ మండలాలను అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిపేందుకు నిర్ణయించారని ఆయన గుర్తుచేశారు. ఈ మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపితే రెండు రాష్ట్రాల సరిహద్దులు మారుతాయి కాబట్టి.. ఉనికిలో ఉన్న రాష్ట్ర శాసనసభ అభిప్రాయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కానీ అప్పుడు రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన ఉన్నందున ఇది సాధ్యంకాక ఆర్డినెన్సు నిర్ణయాన్ని



పెండింగ్‌లో పెట్టారని వివరించారు. ఈ కారణంగానే కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ అంగీకరించలేదని కేవీపీ పేర్కొన్నారు. తదుపరి పార్లమెంటు సమావేశాల్లో ఈ ఆర్డినెన్సుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలుపాలని కూడా ఆనాటి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారన్నారు. అయితే దురదృష్టవశాత్తు అబద్ధాలకు అలవాటుపడిన చంద్రబాబు ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తేనే సీఎంగా ప్రమాణం స్వీకరిస్తానని షరతుపెట్టి.. దాన్ని సాధించిన ఘనత తనదేనని గొప్పగా చెప్పుకొంటున్నారని కేవీపీ మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేయడానికి ముందు ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులందరినీ కలిశారని, ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్ సైతం పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాల్సిందిగా పట్టుబట్టారని కేవీపీ గుర్తుచేశారు. హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిగిన సమావేశంలో ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన కొనసాగుతున్నందువల్ల రాజ్యాంగంలోని మూడో అధికరణం ప్రకారం శాసనసభపై పూర్తి హక్కులు పార్లమెంటుకే ఉంటాయని.. కాబట్టి పోలవరం ముంపు మండలాలపై ఆర్డినెన్సును జారీ చేయాలని రాజ్‌నాథ్‌ను కోరినట్లు కేవీపీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జూన్ 2న ఏర్పడుతున్నందున ముంపుమండలాల విలీన ప్రక్రియ ఆలోపే పూర్తికావాలని, లేకుంటే ఆ తర్వాత న్యాయపరమైన చిక్కులు ఏర్పడతాయన్న ఆందోళనను వ్యక్తం చేశామని, ఇదంతా చంద్రబాబు సమక్షంలోనే జరిగిందని కేవీపీ గుర్తుచేశారు. ఈ వివరాలన్నింటినీ రాజ్యసభలో ముంపుమండలాల ఆర్డినెన్సుకు సంబంధించిన బిల్లుపై చర్చ సందర్భంలో రాజ్‌నాథ్ ప్రస్తావించారని వివరించారు. 2019 నాటికి పోలవరం ప్రధాన డ్యామ్ పూర్తయ్యే అవకాశమేలేదని కేవీపీ అన్నారు. ఒకవేళ అద్భుతాలు జరిగి (కేంద్ర జల సంఘం అనుమతించిన డిజైన్ మేరకు) పూర్తిచేసి కుడి, ఎడమ కాలువల నుంచి గ్రావిటీద్వారా నీటిని ఇవ్వగలిగితే చంద్రబాబుకు భారతరత్న ఇవ్వాలని స్వయంగా తానే ఎంపీలందరినీ కూడగడుతానని, ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఒప్పించి 'అపర భగీరథుడు' అనే బిరుదును ఇప్పిస్తానని వ్యాఖ్యానించారు.

16, 17 తేదీల్లో భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి...

ఐదురోజులుగా మళ్లీ వర్షాలు పుంజుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. పైర్లన్నీ మళ్లీ పచ్చగా మారుతుండటంతో అన్నదాతల్లో భరోసా ఏర్పడుతున్నది. చాలా జిల్లాల్లో పత్తి వాలిపోతున్న సమయంలో వర్షాలు రావడం పత్తిపంట వేసిన రైతులకు ఎంతో ఊరటనిచ్చింది. మరోవైపు వరినాట్లు సైతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 30 లోగా వరినాట్లు వేసుకోవాలన్న వ్యవసాయశాఖ సూచనలతో రైతులు నాట్లు పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు.

నర్సంపేటలో అత్యధికంగా 9 సెం.మీ. వర్షపాతం

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లోనూ వానలు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లబడింది. తెల్లవారుజాము సమయంలో చలిగాలులు వీస్తున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 6 సెం.మీ., సూర్యాపేట మండలం చివ్వెంల, నడిగూడెంలో 5 సెం.మీ. చొప్పున, హైదరాబాద్‌లోని గోల్కొండలో 4.1 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. కాగా నల్లగొండ జిల్లా మునుగోడు, బోథ్, నాగిరెడ్డిపేటల్లో 3 సెం.మీ. చొప్పున, నారాయణఖేడ్‌లో 2.3 సెం.మీ., సరూర్‌నగర్‌లో 2.1 సెం.మీ., సంగారెడ్డిలో 2 సెం.మీ., రాజేంద్రనగర్, మహబూబాబాద్, యాచారం, లింగంపేట, మెదక్, నిజామాబాద్, బాన్సువాడ, పిట్లం, ఖమ్మం అర్బన్, ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, హకీంపేట, మేడ్చల్, కోటగిరి, రుద్రూర్, కంపసాగర్, నల్లగొండ, తడ్వాయి ప్రాంతాల్లో ఒక సెంటీమీటర్ చొప్పున వర్షం కురిసినట్లు చెప్పారు.

విశిష్టసేవకులు వీరే

రాష్ట్రస్థాయి అవార్డుగ్రహీతల జాబితా ప్రకటన

రేపు సీఎం కేసీఆర్ చేతులమీదుగా పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంద్రాగస్టు వేడుకల సందర్భంగా రాష్ట్రపతి గౌరవ పోలీసు పతకాలు, అగ్నిమాపకశాఖ మెడల్స్, హరిత మిత్ర తదితర అవార్డులు అందుకోనున్న వారి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం వెల్లడించింది. గోల్కొండ వేదికగా జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నారు. విభాగాలవారీగా అవార్డులకు ఎంపికైనవారి వివరాలు..

పోలీసుశాఖ (సివిల్స్)

అంజనీకుమార్– ఐపీఎస్, అడిషనల్ డీజీపీ (ఎల్‌అండ్‌వో), హైదరాబాద్; రాజీవ్‌రతన్ – ఐపీఎస్ డీజీ, ఫైర్‌సర్వీసెస్, హైదరాబాద్; శివప్రసాద్ – ఐపీఎస్ అడిషనల్ సీపీ, హైదరాబాద్.

సాంస్కృతిక శాఖ

సుద్దాల అశోక్‌తేజ – తెలుగు రచయిత; జయరాజ్ – తెలుగు రచయిత; శ్రీభాష్యం విజయసారథి – సంస్కృత భాషాపండితుడు.

ఇన్సెంటివ్ అవార్డులు

జే రమేశ్–డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్.

గ్రూప్–1: సీహెచ్ మధుసూదన్– అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ; సురేశ్‌బాబు–డీపీవో సిద్దిపేట; పీడబ్ల్యూ జాన్సన్–డీఆర్డీవో, వికారాబాద్,

గ్రూప్–2: ఖానాపూర్ చంద్రకళ–ఆర్డీవో హైదరాబాద్; జీ విశ్వనాథం గుప్తా – హెడ్‌మాస్టర్, రంగారెడ్డి. రమీజుద్దీన్ అహ్మద్ – మండల్ ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్, పెద్దపల్లి.

గ్రూప్–3: ఎం జయమ్మ – స్టాఫ్‌నర్స్, మహబూబ్‌నగర్; కే ప్రకాశ్– పంచాయతీ సెక్రటరీ, వరంగల్ రూరల్; డీ శంకర్‌కుమార్ – పీఏ టు సీపీఆర్వో, ఐఅండ్‌పీఆర్.

గ్రూప్–4: బీ దశరథ – సైకిల్ ఆర్డర్లీ, ఉమెన్ అండ్ సీడీ; కే గంగయ్య – ఆఫీస్ సబార్డినేట్, కామారెడ్డి; కే కిష్టయ్య– ఆఫీస్ సబార్డినేట్, యాదాద్రి.

పోలీసుశాఖ

రిపబ్లిక్ డే–2015 సందర్భంగా ప్రకటించిన ఐపీఎం, ఐడీసీ–2016 అవార్డులు అందుకుంటున్న పోలీసులు

టీ సంతోష్‌బాబు – అదనపు ఎస్పీ, సీఐడీ, హైదరాబాద్; నిల్గిరి దివ్య చరణ్ రావు– అదనపు డీసీపీ, ట్రాఫిక్, సైబరాబాద్; టీ సుదర్శన్ – డీఎస్పీ, ఏసీబీ కరీంనగర్; ఉప్పు తిరుపతి – ఏసీపీ, మహంకాళి, హైదరాబాద్; మాదాడి రమణకుమార్ – ఏసీపీ మాదాపూర్, సైబరాబాద్; శావిలి ప్రేమ్‌రాజ్ – ఏఎస్‌ఐ, కమ్యూనికేషన్స్, ఐఎస్‌డబ్ల్యూ; మాదంచెట్టి వెంకట్‌రావు – ఆర్‌ఐ, ఐఎస్‌డబ్ల్యూ; పట్టోళ్ల మధుసూదన్‌రెడ్డి–ఎస్‌ఐ, ఎస్‌ఐబీ, ఇంటెలిజెన్స్‌సెల్ హైదరాబాద్; సయ్యద్ యూసుపుద్దీన్–ఆర్‌ఎస్‌ఐ, డీపీటీసీ, నల్లగొండ; గజ్జెల లక్ష్మయ్య – హెచ్‌సీ 1868, ఎస్‌బీ సైబరాబాద్; అన్ను దామోదర్‌రెడ్డి – హెచ్‌సీ 1969, కౌంటర్ ఇంటెలిజెన్స్‌సెల్, హైదరాబాద్; సిద్ద సదానందం – ఏఆర్‌పీసీ 2583, డీఏఆర్ వరంగల్; డీ సిద్దయ్య– ఎస్‌ఐ; సీ నాగరాజు– పీసీ 3004; ఎండీ యూసుఫ్ అలీఖాన్ – లీడింగ్ ఫైర్‌మెన్, లంగర్‌హౌస్; కే వెంకట్‌రెడ్డి– లీడింగ్ ఫైర్‌మన్, సాలర్‌జంగ్ మ్యూజియం; కే శ్రీశైలం – లీడింగ్ ఫైర్‌మన్, మాదాపూర్; ఎండీ యాసీన్ – లీడింగ్ ఫైర్‌మన్, మలక్‌పేట; బీ మల్లయ్య– లీడింగ్ ఫైర్‌మన్, కరీంనగర్; వీ ఈదయ్య– లీడింగ్ ఫైర్‌మన్, హుజూర్‌నగర్, సూర్యాపేట; కే శంకరయ్య – లీడింగ్ ఫైర్‌మన్, నారాయణపేట, మహబూబ్‌నగర్.

హరితమిత్ర

వై శేఖర్‌రెడ్డి– పీపుల్స్ రిప్రజెంటేటివ్, వరంగల్ (రూరల్); పెద్ది సుదర్శన్‌రెడ్డి– పీపుల్స్ రిప్రజెంటేటివ్, వరంగల్ (రూరల్); సీ శ్రీధర్‌రావు– డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్, సిద్దిపేట; ఎంపీపీఎస్– మురపల్లి, జగిత్యాల; అటవీశాఖ జనరల్ మేనేజర్– ఎస్‌సీసీఎల్, రామగుండం–1, ఏరియా పెద్దపల్లి.

సోషల్ వర్కర్ అండ్ స్కౌట్స్ అండ్ గైడ్స్


పీ బసంత్‌రెడ్డి – సోషల్‌వర్కర్ (గల్ఫ్ సమస్యలు), మనోహరాబాద్– నిజామాబాద్; భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సుదీర్ఘకాలం సేవలు అందించినందుకుగాను జీ పరమేశ్వర్ (ఎస్‌వోసీ (ఎస్), హైదరాబాద్), జీ లక్ష్మీనారాయణ (వైస్ ప్రెసిడెంట్ –కరీంనగర్), ఎం రాజగోపాల్ (స్టేట్ ట్రెజర్, హెడ్‌క్వార్టర్స్– హైదరాబాద్), ఏ సుగుణారాజేంద్రం (ఎస్టీసీ (జీ), స్టేట్ హెడ్ క్వార్టర్స్ – హైదరాబాద్), టీ వెంకటలక్ష్మి (మహబూబ్‌నగర్).

ఉత్తమ పాఠశాలలు

తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ (గర్ల్స్)– తాటిపల్లి, మల్యాల్ మండలం, జగిత్యాల; జెడ్పీ హైస్కూల్– మిర్దాపల్లి, ఆర్మూర్ మండలం, నిజామాబాద్.

ఒడిశా కంటిన్‌జెంట్ మెమెంటో– ఒడిశా బెటాలియన్‌కు..

నాడు తెలంగాణ ఉద్యమం.. నేడు హరిత విప్లవం



రెండోసారి హరితమిత్ర పురస్కారం గెలుచుకోవడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితోనే హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. ఉద్యమంలా ప్రతిఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రపంచంలోనే ఇంత పెద్దస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం ఎక్కడా జరుగలేదు. కేసీఆర్ ఆధ్వర్యంలో నాడు తెలంగాణ ఉద్యమం జరిగితే నేడు హరిత విప్లవం ప్రారంభమైంది.

పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ (హరితమిత్ర అవార్డుగ్రహీత)

వైరాలో నాలుగు ఇండ్లలో చోరీ

వైరా, నమస్తే తెలంగాణ: ఖమ్మం జిల్లా వైరాలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు వేసి ఉన్న నాలుగు ఇండ్లల్లో చోరీ చేసి రూ.41 లక్షల సొత్తును దోచుకెళ్లారు. గాంధీచౌక్‌కు చెందిన మిట్టపల్లి నాగి, సుందరయ్యనగర్‌కు చెందిన మున్నా శ్రీనివాసరావు, వెలగ నాగేశ్వరరావు, లగడపాటి ప్రభాకర్ ఇండ్లలో దోపిడీకి పాల్పడ్డారు. మిట్టపల్లి నాగి ఇంట్లో రూ.15లక్షల నగదు, రూ.15లక్షల విలువజేసే బంగారు నగలు, మున్నా శ్రీనివాసరావు ఇంట్లో రూ.2 లక్షలు విలువజేసే బంగారు ఆభరణాలు, వెలగ నాగేశ్వరరావు ఇంట్లో రూ.9లక్షల నగదును అపహరించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ తదితరులు చోరీ జరిగిన ఇండ్లను ఆదివారం పరిశీలించారు. నిందితులను వెంటనే పట్టుకునేలా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

మొబైల్ కాలింగ్ మరింత చౌక!



ఇంటర్‌కనెక్ట్ చార్జీలను తగ్గించనున్న ట్రాయ్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: మొబైల్ కాల్ చార్జీలు మరింత తగ్గే అవకాశం ఉంది. ఎందుకంటే, టెలికం నియంత్రణ మండలి 'ట్రాయ్'.. మొబైల్ కంపెనీలకు వర్తించే ఇంటర్‌కనెక్ట్ యూసేజ్ చార్జీలను(ఐయూసీ) మరింత తగ్గించనున్నదని సమాచారం. కాల్ అనుసంధానం కోసం ఒక మొబైల్ ఆపరేటర్ మరో ఆపరేటర్‌కు చెల్లించే రుసుమే ఐయూసీ. ప్రస్తుతం ఈ చార్జీ నిమిషం కాల్‌కు 14 పైసలుగా ఉంది. త్వరలో ట్రాయ్.. ఐయూసీని 10 పైసల దిగువకు తగ్గించవచ్చని అభిజ్ఞవర్గాల సమాచారం. ఏడాది క్రితం టెలికం రంగంలోకి రిలయన్స్ జియో ప్రవేశించడంతో మొబైల్ కాలింగ్, డాటా సేవలు అత్యంత చౌకగా మారాయి. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో.. డాటాకు చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ అపరిమిత ఉచిత కాలింగ్ సేవలందిస్తున్నది. ఇంటర్ కనెక్ట్ చార్జీలను ఎత్తివేయాలని జియో కోరుతుంటే.. ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా వంటి మొదటి తరం ప్రైవేట్ సంస్థలు మాత్రం ఐయూసీ రేటును ప్రస్తుతమున్న 14 పైసల నుంచి 30 పైసలకు పెంచాలని కోరుతున్నాయి. ఐయూసీ రేట్లను సమీక్షించేందుకు గత ఏడాది ఆగస్టు 5న ట్రాయ్ చర్చాపత్రాన్ని విడుదల చేసింది. సంబంధిత వర్గాలందరి నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనల ఆధారంగా నెల రోజుల్లో నియంత్రణ మండలి కొత్త మార్గదర్శకాలను విడుదల చేయనుంది. ఇందులోభాగంగా ఇంటర్నెట్ ద్వారా చేసే కాల్స్‌కు ఐయూసీ రేటును నిమిషానికి 3 పైసలకు తగ్గించవచ్చని తెలుస్తున్నది. నెట్‌వర్క్‌లన్నీ 4జీ లేదా వోల్టే టెక్నాలజీకి అప్‌గ్రేడ్ అవుతున్న నేపథ్యంలో ఐయూసీ కింద నిమిషానికి 14 పైసలు వసూలు చేయడం చాలా ఎక్కువని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ట్రాయ్ వెబ్‌సైట్‌లో టెల్కోల టారిఫ్ ప్లాన్లు

త్వరలో మొబైల్ వినియోగదారులు అన్ని టెలికం కంపెనీల టారిఫ్ ప్లాన్లను ట్రాయ్ వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. టారిఫ్ పథకాలను ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లోనూ సమర్పించాలని నియంత్రణ మండలి సంస్థలను కోరింది. టారిఫ్ ప్లాన్లను అందరికీ అందుబాటులోకి తేవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని ట్రాయ్ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ అభిప్రాయపడ్డారు.

9.3 కోట్ల పాన్-ఆధార్‌ల అనుసంధానం



న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఈ నెల 5వ తేదీ నాటికి 9.3 కోట్లకు పైగా శాశ్వత ఖాతా నంబర్లు (పాన్) ఆధార్‌తో అనుసంధానమయ్యాయని ఐటీ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం దేశంలో 30 కోట్ల పాన్ కార్డులు జారీ అయ్యాయి. అందులో దాదాపు 30 శాతం మంది పాన్ కార్డును వారి ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసుకున్నారని అధికారి వెల్లడించారు. గడిచిన రెండు నెలల్లోనే (జూన్, జూలై) 3 కోట్ల పాన్‌లు ఆధార్‌తో అనుసంధానమయ్యాయని అన్నారు. పాన్-ఆధార్ అనుసంధానానికి తుది గడువును ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఐటీ శాఖ సర్వోన్నత నిర్ణయాధికార మండలి 'ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు' (సీబీడీటీ) నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మున్ముందు ఆధార్‌తో అనుసంధానమయ్యే పాన్‌ల సంఖ్య మరింత పెరగనుందని అధికారి అన్నారు. జూలై 1 నుంచి ఐటీ రిటర్నులు దాఖలు చేసేందుకు పాన్-ఆధార్ లింకింగ్‌ను తప్పనిసరి చేసింది కేంద్ర ప్రభుత్వం. ఆగస్టు చివరికల్లా ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే వారి ఐటీ రిటర్నులను ప్రాసెస్ చేయడం జరుగదని సీబీడీటీ స్పష్టం చేసింది.

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	348-00	348-00
రంగారెడ్డి	348-00	348-00
మెదక్	348-00	348-00
కరీంనగర్	350-00	---
వరంగల్	350-00	---
రిటైల్ ప్రైస్	4-10	4-10

చికెన్ ధరలు

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	91.00
డ్రెస్డ్	127.00
స్కిన్‌లెస్	150.00

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ గ్రాడ్యుయేట్లకు భారీ ఆఫర్లు

INTERNATIONAL INSTITUTE OF INFORMATION TECHNOLOGY
HYDERABAD

హైదరాబాద్, ఆగస్టు 13: ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ) హైదరాబాద్ గ్రాడ్యుయేట్లకు కార్పొరేట్ కంపెనీల నుంచి భారీ ఆఫర్లు లభించాయి. బీటెక్ గ్రాడ్యుయేట్లకు కంపెనీలు రూ.13.4 లక్షల నుంచి రూ.18.8 లక్షల స్థాయిలో వార్షిక పారితోషికం ఆఫర్ చేశాయి. ఇక ఐటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసినవారికి రూ.14 లక్షల నుంచి రూ.17.7 లక్షల స్థాయిలో ప్యాకేజీ చెల్లించేందుకు కంపెనీలు ముందుకొచ్చాయని తాజాగా విడుదల చేసిన స్టేట్‌మెంట్‌లో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ వెల్లడించింది. దాదాపు 116 కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిపాయని, గ్రాడ్యుయేట్లందరికీ ఉద్యోగాలు లభించాయని తెలిపింది. శనివారం నాడు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో 16వ స్నాతకోత్సవ కార్యక్రమం జరిగింది. అందులో 473 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఆ కార్యక్రమానికి డాక్టర్ రెడ్డీస్ సీఈవో జీవీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వరుణ్ ఇండస్ట్రీస్ ప్రమోటర్ కైలాశ్ అగర్వాల్ అరెస్ట్



ముంబై, ఆగస్టు 13: దేశంలోని అతిపెద్ద రుణ ఎగవేతదారుల్లో ఒకరు, వరుణ్ ఇండస్ట్రీస్ కో-ప్రమోటర్ కైలాశ్ అగర్వాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. దేశంలోని ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల టాప్‌టెన్ జాబితాలో అగర్వాల్ కూడా ఉన్నారు. ఆయన బ్యాంకులకు రూ.2,500 కోట్ల మేర ఎగనామం పెట్టారు. ఇండియన్ బ్యాంక్‌కు రూ.330 కోట్లతోపాటు అదే బ్యాంక్ నేతృత్వంలో ఏర్పాటైన కన్సార్టియానికి మరో రూ.1,593 కోట్లు బకాయిపడ్డారు. బ్యాంకులకు బకాయిలు ఎగవేసిన కైలాశ్ అగర్వాల్, ఆయన వ్యాపార భాగస్వామి కిరణ్ మెహతా దర్యాప్తు నుంచి తప్పించుకునేందుకు విదేశాలకు పారిపోయారు. ఈనెల 5న దుబాయ్ నుంచి భారత్‌కు వచ్చిన అగర్వాల్‌ను సీబీఐ విమానాశ్రయంలోనే అరెస్ట్ చేసింది. స్థానిక కోర్టు ఆయనను రిమాండ్‌లోకి తీసుకోవాలని ఆదేశించింది. 2007 నుంచి అగర్వాల్, మెహతా కలిసి ఇండియన్ బ్యాంక్‌తోపాటు ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి వందల కోట్లలో రుణాలు తీసుకోవడం మొదలు పెట్టారు. ఆ తంతు 2012 వరకు కొనసాగింది. ఆ తరువాత సంవత్సరం(2013) నుంచి వారు బకాయిలు ఎగవేయడం మొదలు పెట్టారు. అంతేకాదు, సంస్థ షేర్లను తనఖా పెట్టి మార్కెట్ నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించారని సీబీఐ తెలిపింది. గత ఏడాది ఇండియన్ బ్యాంక్ ఫిర్యాదు మేరకు వరుణ్ ఇండస్ట్రీస్, దాని ప్రమోటర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది.

మాల్యాకు సమాచారాన్ని ఫిబ్రవరిలోనే నిలిపివేశాం: యూబీఎల్



న్యూఢిల్లీ, ఆగస్టు 13: సంస్థ గత చైర్మన్ విజయ్ మాల్యాకు వ్యాపార కార్యకలాపాలపై సమాచారాన్ని ఫిబ్రవరిలోనే నిలిపివేశామని యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) స్పష్టం చేసింది. స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన ఏ కంపెనీలోనూ డైరెక్టర్ లేదా మరే ఇతర కీలక పదవిలో కొనసాగకుండా లిక్కర్ కింగ్ మాల్యాపై సెబీ ఆంక్షలు విధించింది. కంపెనీ డైరెక్టర్ పదవి నుంచి మాల్యా తప్పుకున్న విషయంపై గతవారమే అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఆయన్ని పదవి నుంచి వైదొలగాలని ఈ ఏడాది తొలినాళ్లలోనే కోరినట్లు యూబీఎల్ తెలిపింది. మాల్యాకు బోర్డు సమావేశాలు లేదా ఇతర కీలక సమాచారాన్ని నిలిపివేయాలని ఫిబ్రవరి 6న జరిగిన భేటీలో సంస్థ స్వతంత్ర డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నట్లు తాజా రెగ్యులేటరీ ఫైలింగ్‌లో యూబీఎల్ వెల్లడించింది.

బేర్ పట్టు.. మరింత బిగిసేనా!

ఈవారంలోనూ మార్కెట్లో దిద్దుబాటు కొనసాగే అవకాశం

ద్రవ్యోల్బణ గణాంకాలు, గ్లోబల్ సంకేతాలతో దిశానిర్దేశం



గతవారం భారీ నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్‌లో మరి కొద్దికాలంపాటు బేరిష్ ట్రెండ్ కొనసాగవచ్చని ఈక్విటీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈవారం మొదట్లో సూచీలు కొద్దిగా బలపడే అవకాశమున్నప్పటికీ.. నిలదొక్కుకోలేకపోవచ్చని వారంటున్నారు. ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి వంటి స్థూల ఆర్థిక గణాంకాలతోపాటు అమెరికా-ఉత్తర కొరియా మధ్య మాటల యుద్ధం, ఇతర అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు మున్ముందు సూచీలకు దిశానిర్దేశం చేయనున్నాయి. శుక్రవారం విడుదలైన జూన్ నెల పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) -0.1 శాతానికి క్షీణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐఐపీ రుణాత్మకంలోకి జారుకోవడం ఇదే మొదటిసారి. ఇక సోమవారం సాయంత్రం గతనెల టోకు, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కానున్నాయి. జూన్ నెలకు టోకు ద్రవ్యోల్బణం 0.9 శాతంగా, రిటైల్ ద్రవ్యోల్బణం 1.4 శాతంగా నమోదయ్యాయి. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సెలవు అయినందున ఈవారం నాలుగు సెషన్లలో మాత్రమే ట్రేడింగ్ జరుగనుంది. కార్పొరేట్ కంపెనీల మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, షెల్ కంపెనీలపై దర్యాప్తులో పురోగతి, వర్షపాతం, డాలర్‌తో రూపాయి మారకం, ముడి చమురు ధరలు కూడా ఈక్విటీ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయగలవు. త్రైమాసిక ఫలితాల సీజన్ చివరిదశకు చేరుకుంది. సోమవారం నాడు టాటా పవర్, కోల్ ఇండియా, గ్రాసిమ్ రిజల్ట్స్ ప్రకటించనున్నాయి.

వరుసగా ఐదు వారాలపాటు బలపడుతూ వచ్చిన సూచీలు.. గతవారంలో భారీగా క్షీణించాయి. సెన్సెక్స్ 1,111.82 పాయింట్లు (3.43 శాతం), నిఫ్టీ 355.60 పాయింట్లు (3.53 శాతం) కోల్పోయాయి. వారాంతంలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 31,213, నిఫ్టీ 9,710 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్‌లోని టాప్ టెన్ కంపెనీల్లో తొమ్మిదింటి మార్కెట్ విలువ రూ.1.05 లక్షల కోట్లకు పైగా పడిపోయింది. మార్కెట్ టెక్నికల్స్‌ను పరిశీలిస్తే.. మార్కెట్లో ట్రెండ్ బేరిష్‌గా మారింది. స్వల్పకాలంలో సూచీలు మరింత కరెక్షన్‌కు గురయ్యే అవకాశాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నిఫ్టీ 9,668 దిగువకు పడిపోతే గనుక మార్కెట్లు మరింత దిద్దుబాటుకు లోనుకావచ్చు. మళ్లీ కొనుగోళ్లు పెరిగి సూచీలు ఊరట ర్యాలీ తీసినా నిఫ్టీకి 9,913 వద్ద నిరోధం ఏర్పడవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రిసెర్చ్ విభాగ హెడ్ దీపక్ జసానీ అన్నారు.

బాండ్‌మార్కెట్లోకి మరో 10వేల కోట్ల విదేశీ నిధులు

ఈనెలలో ఇప్పటివరకు దేశీయ బాండ్ మార్కెట్లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) నికరంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఆర్బీఐ కీలక వడ్డీ(రెపో)రేటును తగ్గించడం ఇందుకు దోహదపడింది. విదేశీ ఇన్వెస్టర్ల నుంచి బాండ్లకు ఆదరణ మరింత పెరిగినప్పటికీ.. ఈక్విటీలకు మాత్రం డిమాండ్ తగ్గింది. ఈనెలలో వారు స్టాక్ మార్కెట్ నుంచి రూ.2 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

భారీగా తగ్గిన జీఎంఆర్ ఇన్‌ఫ్రా నష్టం

క్యూ1లో రూ.107 కోట్లకు పరిమితం

GMR

హైదరాబాద్, ఆగస్టు 13: మౌలిక రంగానికి చెందిన ప్రముఖ సంస్థ జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ నష్టాలు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ 1) సంస్థ పూర్తి నష్టం 44 శాతం తగ్గి రూ.107 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నష్టం రూ.190 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్ -జూన్ కాలానికి స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 41 శాతం పెరిగి రూ.3,159 కోట్లకు చేరుకుందని ఆదివారం విడుదల చేసిన స్టేట్‌మెంట్‌లో జీఎంఆర్ ఇన్‌ఫ్రా పేర్కొంది. గత ఏడాది ఇదే సమయంలో సంస్థ స్థూల ఆదాయం రూ.2,239 కోట్లుగా ఉంది. సంస్థ విమానాశ్రయాల వ్యాపారం విషయానికొస్తే.. గోవాలో మోపా ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కోసం అవసరమైన రూ.1,330 కోట్ల రుణ నిధుల సేకరణ పూర్తయిందని జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఈ సందర్భంగా తెలిపింది. అంతేకాదు, గ్రీస్ దేశంలోని క్రీట్ ద్వీపంలో హెరాక్లియన్ విమానాశ్రయ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టు కూడా సంస్థకే దక్కింది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ.. గ్రీకు దేశ మౌలిక దిగ్గజం టెర్నా ఎస్ఏతో జతకట్టింది. ఈ ప్రాజెక్టు కాలపరిమితి 35 ఏండ్లు. ఇంధన రంగం విషయానికొస్తే.. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో వరోరా ప్లాంట్ మొత్తం సామర్థ్యంలో ఉత్పత్తి స్థాయి 77 శాతానికి పెరిగిందని సంస్థ తెలిపింది. గత ఏడాది ఇదేకాలంలో ఉత్పత్తి 44 శాతంగా ఉంది. కమలంగ ప్లాంట్ మొత్తం సామర్థ్యంలో ఉత్పత్తి స్థాయి వార్షిక ప్రాతిపదికన 72 శాతం నుంచి 65 శాతానికి తగ్గింది. ఈమధ్యకాలంలో బొగ్గు ధరలు, డిమాండ్ పెరుగడంతో గత త్రైమాసికంలో గోల్డెన్ ఎనర్జీ మైన్స్ (జీఎంఆర్, సినర్మాస్ గ్రూపుల సంయుక్త భాగస్వామ్య సంస్థ) రూ.210 కోట్ల లాభాన్ని నమోదు చేసుకుంది. ఏడాదిక్రితం ఇదేకాలానికి లాభం రూ.10 కోట్లుగా నమోదైందని సంస్థ పేర్కొంది.

వచ్చే ఏడాదిలో నిఫ్టీ @ 11,500!

ఎడెల్‌వైజ్ ఇన్వెస్ట్‌మెంట్ రిసెర్చ్ నోట్ అంచనా

న్యూఢిల్లీ, ఆగస్టు 13: భారత ఆర్థిక వ్యవస్థ సుస్థిర వృద్ధి దశలోకి అడుగుపెట్టబోతున్నదని, మున్ముందు పూర్తి స్థాయి బుల్ మార్కెట్‌ను చూడవచ్చని ఎడెల్‌వైజ్ ఇన్వెస్ట్‌మెంట్ రిసెర్చ్ తాజా నోట్ పేర్కొంది. దాంతో నిఫ్టీ వచ్చే ఏడాదిలో 11,500 పాయింట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం సూచీ 9,700 స్థాయిలో ట్రేడవుతున్నది. గతనెల 25న తొలిసారిగా 10,000 పాయింట్ల మైలురాయిని తాకింది. అయితే, ఈమధ్య మార్కెట్లు స్వల్ప దిద్దుబాటుకు లోనుకావడంతో మళ్లీ కిందికి జారుకుంది. సుస్థిర వృద్ధి దశలో ఈక్విటీలతోపాటు బాండ్లు, కమోడిటీలు.. ఇలా అన్ని మార్కెట్లలో ర్యాలీ కొనసాగుతుందని ఎడెల్‌వైజ్ అంటున్నది. వస్తు వినిమయం, ఎగుమతులు దేశ వృద్ధికి ప్రధాన చోదకాలన్న రిపోర్టు.. పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో ఈ ఏడాది తొలినాళ్లలో వినిమయం భారీగా పడిపోయినప్పటికీ మళ్లీ వేగంగా పుంజుకుందని పేర్కొంది. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వమే కీలకపాత్ర పోషిస్తున్నదని, ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకోవాల్సిన అవసరం ఉందని రిపోర్టు అభిప్రాయపడింది.

నాన్-ఏసీలో భోజనానికీ 18% జీఎస్టీ!

ఎయిర్ కండీషన్డ్ హోటల్‌లో ఏసీ, నాన్-ఏసీ విభాగాలకు ఒకే పన్నురేటు



న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఏసీ రెస్టారెంట్ లేదా హోటల్‌లోని ఏ ప్రాంతం నుంచి ఆహారం కొనుగోలు చేసినా 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. సాధారణంగా ఎయిర్ కండీషన్డ్ రెస్టారెంట్ అయినప్పటికీ పార్సిల్ (టేక్ అవే) కౌంటర్ల వద్ద ఏసీ సౌకర్యం ఉండదు. అలాగే కొన్ని ఏసీ రెస్టారెంట్‌లలో నాన్- ఏసీ డైనింగ్ విభాగం కూడా ఉంటుంది. జీఎస్టీ చట్టంలో నాన్-ఏసీ హోటళ్లలో ఆహారంపై పన్ను రేటును 12 శాతంగా నిర్ణయించారు. లిక్కర్ లైసెన్సు కలిగిన ఏసీ రెస్టారెంట్‌లో ఆహారంపై 18 శాతం, ఐదు నక్షత్రాల హోటళ్లయితే 28 శాతం పన్ను వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఏసీ రెస్టారెంట్‌లోని నాన్ ఏసీ ప్రాంతంలో విక్రయించే ఆహారంపై ఎంత శాతం పన్ను వర్తిస్తుందనే విషయంపై సందిగ్ధం నెలకొంది. దాంతో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఏసీ రెస్టారెంట్ లేదా హోటల్‌లోని ఏ ప్రాంతం నుంచి ఆహార సేవలందించినా 18 శాతం పన్ను వర్తిస్తుందని తెలిపింది.

సోలార్ యంత్రాలపై పన్ను సవరించే ఆలోచన లేదు: గోయల్

సోలార్ యంత్రాలపై 5 శాతం జీఎస్టీని పునఃసమీక్షించే యోచన కేంద్రానికి లేదని కేంద్ర బొగ్గు, విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి చాలా స్పష్టంగా ఉందని, అయినా వ్యాపారులకు సమస్యలుంటే ఏం చేయలేమని అన్నారు. సోలార్ మాడ్యూల్స్‌కు వర్తించే 5 శాతం పన్ను మిగతా యంత్రాలకు సైతం వర్తిస్తుందా అని తయారీదారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

'చంద్ర'పై మూర్తి ప్రశంసల జల్లు!

టాటా చీఫ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు సూచన



స్నాతకోత్సవ కార్యక్రమంలో టాటాగ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌కు డాక్టర్ ఆఫ్ లెటర్స్‌ను ప్రదానం చేస్తున్న ఎన్ఐటీ తిరుచి డైరెక్టర్ మినీ షాజీ. చిత్రంలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి

తిరుచి (తమిళ నాడు), ఆగస్టు 13: దేశంలో రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణమూర్తి.. నం.1 ఐటీ కంపెనీ టీసీఎస్‌తోపాటు టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌ను (చంద్ర) ప్రశంసలతో ముంచెత్తారు. టీసీఎస్‌లో సాధారణ ఉద్యోగిగా తన కెరీర్‌ను ప్రారంభించి.. తన అసామాన్య ప్రతిభ, విలువల ద్వారా అంచెలంచెలుగా ఎదుగుతూ కంపెనీతోపాటు టాటా గ్రూపు మొత్తానికి చైర్మన్‌గా ఎదిగారని, యువతకు ఆదర్శప్రాయుడయ్యారన్నారు. శనివారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)-తిరుచిలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో మూర్తి మాట్లాడుతూ.. 'చంద్రశేఖరన్ ప్రతి హోదాలోనూ నాయకుడు అన్పించుకున్నారు. పోటీతత్వం, ధైర్యం, నిబద్ధత, యోగ్యతను ప్రదర్శించేవారికి అడ్డుగోడలుండవని రుజువు చేశారు' అని అన్నారు. తరుచుగా ఉద్యోగం మార్చే యువత చంద్రశేఖరన్‌ను చూసి నేర్చుకోవాలన్నారు. ఎన్ఐటీ (గతంలో రూరల్ ఇంజినీరింగ్ కాలేజ్) తిరుచి నుంచే ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన చంద్ర.. 1987లో టీసీఎస్‌లో చేరారు. క్రమంగా ఒక్కో మెట్టు ఎదుగుతూ సంస్థకు చైర్మన్ అయ్యారు. స్నాతకోత్సవం కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ మినీ షాజీ చంద్రశేఖరన్‌కు డాక్టర్ ఆఫ్ లెటర్స్‌ను ప్రదానం చేశారు.

దివీస్ ల్యాబ్ ప్రాజెక్ట్‌కు 'గ్రీన్'సిగ్నల్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ప్రముఖ ఔషధ తయారీ సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్‌కు వైజాగ్‌లోని బల్క్ డ్రగ్ యూనిట్ ఆధునీకరణ ప్రాజెక్ట్‌కు పర్యావరణ శాఖ నుంచి అనుమతులు లభించాయి. ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా ఔషధాలను తయారు చేయడంతోపాటు ఎగుమతి లక్ష్యాలను సాధించేందుకు సంస్థ ఈ యూనిట్‌ను రూ.100 కోట్ల వ్యయంతో ఆధునీకరించతలపెట్టింది. కంపెనీ ప్రతిపాదనకు తొలుత నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ ప్రతిపాదనల మేరకు గతవారం కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తుది అనుమతులను జారీ చేసింది. రెండు దశల్లో చేపట్టబోయే ఈ ప్రాజెక్టుతో 8వేల మందికి ఉపాధి లభించనుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం సంస్థకు రెండు చోట్ల ప్లాంట్లు ఉన్నాయి. ఒకటి విశాఖ, మరొకటి నల్లగొండ జిల్లాల్లో ఉన్నాయి.

ఆ 331 కంపెనీలకు షోకాజ్ నోటీసులు



అనుమానిత షెల్ కంపెనీల లిస్టులో బాలీవుడ్ వర్గాలు, బిల్డర్లు, బ్రోకర్లు!

న్యూఢిల్లీ, ఆగస్టు 13: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ'.. 331 అనుమానిత లిస్టెడ్ షెల్ కంపెనీలకు షోకాజు నోటీసులు పంపడం మొదలుపెట్టింది. అనధికారిక సొమ్ముతో మనీ లాండరింగ్‌కు పాల్పడేందుకు ఈ కంపెనీలు సహకరించాయని కేంద్ర ప్రభుత్వం అనుమానిస్తున్నది. ఈ 331 లిస్టెడ్ కంపెనీల జాబితాను సెబీకి పంపిన కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వాటిపై చర్యలు తీసుకోవాలని, వాటి కార్యకలాపాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించింది. ఈ విషయంలో నియంత్రణ మండలి ఇప్పటికే చర్యలు మొదలు పెట్టింది. జాబితాలోని పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్క్యూఎస్, ప్రకాశ్ ఇండస్ట్రీస్, జే కుమార్ ఇన్‌ఫ్రాతోపాటు పలు లిస్టెడ్ కంపెనీలపై ట్రేడింగ్ ఆంక్షలు విధించింది. కానీ సెబీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సెక్యూరిటీస్ అపిల్లెట్ ట్రిబ్యునల్‌ను (శాట్) ఆశ్రయించిన పార్శ్వనాథ్‌తోపాటు పలు కంపెనీలకు కొంత ఊరట లభించింది. ఈ లిస్టెడ్ కంపెనీలతోపాటు వందకు పైగా అన్‌లిస్టెడ్ కంపెనీలపైనా సెబీ చర్యలను ప్రారంభించింది. ఈ కంపెనీలు నల్లధనంతో స్టాక్ మార్కెట్లో షేర్ల క్రయ, విక్రయాలు జరిపినట్లుగా సమాచారం.

అనుమానిత షెల్ కంపెనీల వ్యవహారంపై సెబీతోపాటు ఐటీ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో) కూడా దర్యాప్తు చేస్తున్నాయి. ఇందులో చాలా కంపెనీలు.. పెద్ద నోట్ల రద్దు తర్వాత భారీ మొత్తాల్లో లావాదేవీలు జరిపినట్లుగా అనుమానిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ కేసులో పరస్పర సహాయం కోసం నియంత్రణ మండళ్లు, దర్యాప్తు ఏజెన్సీల అధికారులు తమ విచారణ నివేదికలను ఒకరితో మరొకరు పంచుకుంటున్నారని ఆయన వెల్లడించారు. లిస్టెడ్, అన్ లిస్టెడ్ కలిపి దాదాపు 500 సంస్థలపై దర్యాప్తు జరుగుతున్నదని, కొన్నింటి పేర్లను ఇంకా బయటపెట్టలేదని ఆ ఉన్నతాధికారి అన్నారు. ఈ వ్యవహారంలో కొందరు ప్రముఖులకు కూడా సంబంధం ఉన్నందున, విచారణ పూర్తయ్యాకే వారిపై చర్యలు మొదలు పెడుతామన్నారు. షెల్ కంపెనీలుగా వ్యవహరించినట్లుగా అనుమానిస్తున్నవాటిలో రియల్ ఎస్టేట్, కమోడిటీస్ ట్రేడింగ్, స్టాక్ బ్రోకింగ్, ఫిల్మ్స్ అండ్ టెలివిజన్ (డిజిటల్ ప్లాట్‌ఫాంతో సహా), ప్లాంటేషన్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వ్యాపారాలకు చెందినవి ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన వాటితో సహా పలు కంపెనీలు మోసపూరిత పథకాల ద్వారా సేకరించిన నిధుల లాండరింగ్‌కు సహకరించినట్లుగా అనుమానాలున్నాయి. సెబీ నిషేధించిన పీఏసీఎల్ వంటి మనీ పూలింగ్ పథకాల నిర్వహణ సంస్థతో సైతం అనుమానిత షెల్ కంపెనీల్లో కొన్నింటికి సంబంధాలున్నట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు.

జోరందుకున్న వానలు

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: వానలు జోరందుకున్నాయి. ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ మీదుగా ద్రోణి ఏర్పడింది. దీనికితోడు బంగాళాఖాతంలో కోస్తాంధ్రా తీరం వెంట సముద్రతీరానికి 3.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఆదివారం పలు జిల్లాల్లో జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా చెరువులు కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పైర్లన్నీ మళ్లీ పచ్చగా మారుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వెల్లువెత్తుతున్నది. నల్లగొండ జిల్లాతో పాటు కరీంనగర్ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలోని హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో భారీ వర్షం పడింది. శంకరపట్నంలో భారీ వర్షపాతం నమోదైంది. చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాల్లో చిరుజల్లులు కురిశాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సుమారు 5 గంటలపాటు వర్షం కురిసింది. హుజూర్‌నగర్ పట్టణం, అర్వపల్లి మండలాల్లో రెండు గంటల పాటు వర్షం కురిసింది. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని 11 మండలాల్లో వర్షం పడింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లాలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జోరు వాన కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. నర్సంపేటలో 9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వరదతో పాకాల, మాదన్నపేట, కోపాకుల చెరువు కాల్వలు ఉప్పొంగుతున్నాయి. పాకాలవాగు, మున్నేరు, వట్టేవాగులు పొంగిపొర్లుతున్నాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. చెన్నారావుపేటలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువు కింద సాగవుతున్న వరి పంట నీట మునిగింది. పత్తి చేలల్లో నీళ్లు నిలిచాయి. ఎగువ ప్రాంతంలో వర్షం కురువడంతో పాకాల సరస్సులోకి నీరు చేరుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలో సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

గేట్లు ఎత్తిన కిన్నెరసాని..

పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి ఆదివారం రాత్రి రెండు గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పొంగిన వాగులతో రిజర్వాయర్‌లో వరదనీరు వచ్చి చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటి మట్టం 406.1 అడుగులు ఉంది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న బొగ్గుల వాగు



కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం




సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోడ్డుపై నిలిచిన నీటితో పండ్ల వ్యాపారుల అవస్థలు



వరంగల్ నగరంలో కురుస్తున్న వర్షం

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 333.593 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	6003	6003	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	4163	11753	1615	1610.33	37.646	31.39
జూరాల	3659	4712	1045	1040.22	9.66	6.841
తుంగభద్ర	6324	182	1633	1616.37	100.86	48.96
శ్రీశైలం	767	54	885	778.4	215.807	19.78
నాగార్జునసాగర్	863	863	590	500.40	312.045	115.943
పులిచింతల	1912	0	175	112.53	45.77	2.30
ప్రకాశం బ్యారేజీ	8244	8244	54.95	54.75	3.070	2.52

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	0	3280	1522	1511.82	102.732	65.63
కడెం	25	655	700	685.63	7.6	4.42
ఎస్సారెస్పీ	0	182	1091	1055	90.313	9.29
సింగూరు	0	265	1717.93	1708.79	29.91	17.68
నిజాంసాగర్	234	234	1405	1380.10	17.803	1.31
ఎల్లంపల్లి	1422	418	485	472.08	20.175	10.49
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	38459	38691	45	45	2.93	2.93



తీజ్ వేడుకల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లిలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

సంప్రదాయాలను బతికించుకుందాం

స్పీకర్ మధుసూదనాచారి

భూపాలపల్లి టౌన్, వెల్దండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఆదివారం సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ సంబురాల్లో స్పీకర్ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లంబాడీలతో కలిసి నృత్యం చేశారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మరోవైపు నాగర్‌కర్నూలు జిల్లా చెదరుపల్లి గ్రామ పంచాయతీ దుబ్బుతండాలో తుల్జాభవాని సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొలకల బుట్టలను ఆడపడుచుల నెత్తిన పెట్టి వేడుకలను ప్రారంభించారు. ఆ తర్వాత ఉయ్యాల ఊగారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీసింగ్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో సీఎం నాటిన మొక్కను పరిశీలిస్తున్న మంత్రులు జోగు రామన్న, ఈటల రాజేందర్

మొక్కల సంరక్షణా ప్రధానమే

మంత్రి జోగు రామన్న

కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: హరితహారంలో భాగంగా మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించడం కూడా ప్రధానమేనని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎల్‌ఎండీ వద్ద మూడో విడుత హరితహారం ప్రారంభోత్సవంలో భాగంగా సీఎం కేసీఆర్ నాటిన మొక్కను ఆదివారం మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి జోగు రామన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడో విడుతలో ఇప్పటివరకు 20 కోట్ల మొక్కలు నాటినట్టు తెలిపారు. నాటడంతోపాటు వాటిని బతికించే బాధ్యతను తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు సూచించారు. వీరి వెంట ఎమ్మెల్సీ భానుప్రసాద్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, కమిషనర్ శశాంక తదితరులు ఉన్నారు.



సిద్దిపేట జిల్లా చేర్యాలలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పోచారం

తెలంగాణ సుభిక్షమే సీఎం కేసీఆర్ ధ్యేయం

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల: తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా తయారు చేయడమే సీఎం కేసీఆర్ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. శ్రీరాంసాగర్ పునర్జీవ పథకాన్ని తక్కువ ఖర్చు, తక్కువ కాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రానున్న 10 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఈ మేరకు వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిందన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కందులు, పసుపు ఇతర పంటలను రైతులు సాగు చేశారన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నారెడ్డి దీక్షకు అర్థం లేదు: మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్ టౌన్: ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టులకు పునర్జీవం కల్పించాలని వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఈ నెల 10న చేపట్టిన దీక్షకు అర్థం లేదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చిన్నారెడ్డి ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నా.. ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. అయినప్పటికీ ఆర్డీఎస్, జూరాలకు పునర్జీవం కల్పించాలని దీక్ష చేయడం సరికాదన్నారు. పార్టీ పెద్దల మెప్పు పొందడానికే దీక్ష చేపట్టారని ఆయన ఎద్దేవా చేశారు.

గ్రంథాలయాలను మరువొద్దు

మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ



న్యూశాయంపేట (హన్మకొండ): సమాజంలో సామాజిక స్పృహను పెంపొందించేవి గ్రంథాలయాలని మహారాష్ట్ర అదనపు డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులు పాఠాలతోపాటు గ్రంథాలయాల్లోని విషయ పరిజ్ఞానం కూడా తప్పనిసరి అన్నారు. హన్మకొండలోని శ్రీవ్యాస ఆవాసంలో ఆదివారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. తర్వాత 'ఓ యువత మేలుకో నీ లక్ష్యం చేరుకో' అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య, వనజీవి దరిపెల్లి రామయ్య దంపతులు పాల్గొన్నారు.



చిన్నారి ఆరాధ్య అక్షర శ్రీకారంలో పాల్గొన్న ఎంపీ కవిత, కుటుంబ సభ్యులు

బాసరకు త్వరలో సీఎం కేసీఆర్

- నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత

బాసర: తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, బాసర సరస్వతీ క్షేత్రం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి సిద్ధం చేసిందని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం కుటుంబ సభ్యులతో అమ్మవారి ఆలయానికి వచ్చారు. తన మరిది దేవపెల్లి అరుణ్‌రావు-నవిత దంపతుల కుమార్తె ఆరాధ్యకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చైర్మన్ శరత్ పాఠక్, ఈవో సుధాకర్‌రెడ్డి అమ్మవారి ప్రతిమను ఎంపీ కవితకు బహూకరించారు. అనంతరం మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తరువాత ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి ఎంపీ కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి అధికారులు రూ.126 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారని, త్వరలోనే సీఎం కేసీఆర్ బాసరకు వచ్చి అభివృద్ధి పనులు ప్రారంభిస్తారన్నారు. ఆమె వెంట టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి, సర్పంచ్ శైలజ, నాయకులు అరుణ్‌రావు, లక్ష్మణ్‌రావు, పోతన్న, శ్యాం, నర్సింగ్‌రావు, డీఎస్పీ అందె రాములు, సీఐ రఘుపతి, తహసీల్దార్ వెంకటరమణ తదితరులున్నారు.

'సురవరం' స్ఫూర్తితో ముందుకెళ్దాం

- మన సాహిత్యం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుదాం
- తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎంపీ కవిత



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత,చిత్రంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

బాసర: తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తితో తెలంగాణ సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. 'జాగృతి కవింతాజలి' పేరిట తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం బాసరలోని జీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎంపీ కవిత హాజరై మాట్లాడారు. తెలంగాణలో కవులే లేరన్న సమయంలో సురవరం ప్రతాపరెడ్డి 300 పైచిలుకు కవులు, కవయిత్రులతో గోల్కొండ కవుల ప్రత్యేక సంచికను వెలువరించి ఆంధ్ర పాలకులను విస్మయానికి గురిచేశారన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో నిర్మల్ జిల్లాలోని 60 మంది కవులు, కవయిత్రులను, తెలుగు పండితులను గుర్తించి ఘనంగా సన్మానిస్తామన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీనాచారి, బాసర సర్పంచ్ శైలజ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈటల కవిత, యువజన విభాగం నాయకులు జగదీశ్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



కందకుర్తిలో మెగా హెల్త్ క్యాంపు

బోధన్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత దత్తత గ్రామమైన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు మూడువేల మందికి వైద్య సేవలందించారు.



కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఎంపీ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు

కరీంనగర్‌లో మిడ్‌వైఫరీ నర్సింగ్ కోర్సు

ఎంపీ బీ వినోద్‌కుమార్

కరీంనగర్ హెల్త్: రాష్ట్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కరీంనగర్‌లో మిడ్‌వైఫరీ నర్సింగ్ కోర్సును ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నదని ఎంపీ బీ వినోద్‌కుమార్ తెలిపారు. అమెరికా, యూరోపియన్ వంటి పాశ్చాత్య దేశాల్లోనే ఉన్న మిడ్ వైఫరీ నర్సింగ్ కోర్సును తెలంగాణలోనూ ప్రారంభించాలని సీఎం కేసీఆర్ కోరడంతో కేంద్ర ప్రభుత్వం ఈ కోర్సును కరీంనగర్‌లో అమలు చేసేందుకు ఏడాదికి రూ.కోటి దాకా విడుదల చేసిందన్నారు. ఈ కోర్సుకు సంబంధించి త్వరలో నియమ నిబంధనలు ప్రకటిస్తామన్నారు. ఆదివారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి కరీంనగర్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. వార్డులను పరిశీలించి, శిశువులను ఎత్తుకున్నారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంపీ వినోద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాల పాలనలో మాతా శిశు సంరక్షణ కేంద్రం కోసం కేవలం రూ.10 కోట్లు విడుదల చేస్తే, తమ ప్రభుత్వం మరో రూ.10 కోట్లను విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసుల సేవలు భేష్

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్

నల్లగొండక్రైం: తెలంగాణ పోలీసుల సేవలు భేషుగ్గా ఉన్నాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పోలేటి దామోదర్ అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా జైలును సందర్శించిన అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పోలీసుల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.375 కోట్లు మంజూరు చేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో పోలీస్‌స్టేషన్ల నిర్మాణం, కొత్త కమిషనరేట్లలో భవనాల నిర్మాణాలు తదితర వాటిపై దృష్టిసారిస్తామన్నారు. కరీంనగర్ జిల్లాపై సీఎం కేసీఆర్ ప్రత్యేకశ్రద్ధ వహించి రూ.వంద కోట్లతో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారితోపాటు శ్రీలక్ష్మీతాయారు అమ్మవారిని, అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. -భద్రాచలం



యాదాద్రికి భక్తులు పోటెత్తారు. విష్ణు పుష్కరిణి, ధర్మదర్శనం క్యూలైన్లు, ఆలయ తిరు వీధులు భక్తులతో కిటకిటలాడాయి. సామూహిక వ్రతాల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - యాదగిరిగుట్ట



వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భగుడిలో ఆర్జితసేవలను రద్దుచేశారు. - వేములవాడ కల్చరల్

అమ్మాయి వేషధారణలో వరుడు



బోనకల్లు: ఖమ్మం జిల్లాలో ఓ పెండ్లికొడుకు అమ్మాయి వేషధారణతో అందరిని ఆశ్చర్యానికి గురిచేశాడు. బోనకల్లు మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కాటేపల్లి పుల్లయ్య కుమారుడు కాటేపల్లి చంద్రశేఖర్ వివాహం ఆదివారం జరిగింది. కృష్ణాజిల్లా అనిగండ్లపాడుకు చెందిన కృష్ణవేణితో పెండ్లైన వెంటనే తమ కుటుంబ ఆచారం ప్రకారం స్త్రీ వేషధారణలో ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించుకున్నాడు.



'పరుగు'కు గాయం

కెరీర్ ఆఖరి రేసులో పతకం గెలువని బోల్ట్

■ గాయంతో 4X100 మీటర్ల రేసును పూర్తి చేయలేకపోయిన జమైకా బృందం

పరుగు ప్రపంచాన్ని జయించిన ధీరుడు..
స్ప్రింట్ దిగ్గజాలను మైమరిపించిన యోధుడు..
పసిడి వన్నెలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన వీరుడు..

అర్ధరాత్రి చంద్రుడు ఆశగా ఎదురుచూశాడు
అతని పరుగు కోసం ..
అశేష జనవాహిని ఆసక్తిగా వీక్షించారు
అతని స్వర్ణకాంతుల కోసం..
అంబరాన్నంటే సంబురాలు ఉత్కంఠగా వేచి చూశాయి
అతని ఆఖరి వీడ్కోలు కోసం..
కానీ..
ఆశలు ఫలించే ఆ తరుణం.. అర నిమిషంలో దూరమైంది.
ఏండ్లుగా ఎదురుచూసిన ఆ స్వప్నం.. అర సెకనులో ఆవిరైంది.
పసిడితో విరాజిల్లాల్సిన ఆ ఘట్టం.. అగాధంలోకి వెళ్లిపోయింది.
కాలం ఇచ్చిన ఓ గొప్ప అవకాశాన్ని... విధి రాత జయించింది.
దేహం ఇచ్చిన ఓ గొప్ప పరుగుకు.. ఆఖరి మజిలీలో గాయమైంది.
మొత్తానికి ఇన్నాళ్లూ ప్రపంచ స్ప్రింట్‌ను ఏలిన పరుగుల రారాజు
ఉసేన్ బోల్ట్ ఆఖరాట అభిమానుల గుండె పగిలేలా చేస్తే..
అంతులేని ఆవేదనతో.. బరువెక్కిన హృదయంతో..
కన్నీటి సంద్రాలను కనురెప్పలోనే దాచుకున్న ట్రిపుల్ ఒలింపియన్..
పెదవి దాటని మాటలకు సైగలతో సరిపెడుతూ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.



ఆగని కన్నీళ్లు..

బోల్ట్ రేసును పూర్తి చేయలేకపోయాడే అన్న బాధతో అథ్లెటిక్స్ ప్రపంచం భావోద్వేగంలో మునిగిపోయింది. ట్రాక్‌పై పడిపోయిన బోల్ట్‌ను చూసి పరుగెత్తుకొచ్చిన ఫిజియో.. ఎలాగైనా బోల్ట్‌ను వీల్‌చైర్‌పై కూర్చోబెట్టి ఫినిషింగ్ లైన్ దాటించాలని ప్రయత్నాలు చేశాడు. అయితే అతని సహచరులు మాత్రం మరోలా స్పందించారు. ఇన్నాళ్లూ తమ దేశానికి పేరు తెచ్చిన ఓ దిగ్గజాన్ని తమ భుజాల మీద చేతులు వేసుకొని మెల్లగా తీసుకెళ్లి ఫినిషింగ్ లైన్‌ను దాటించి గౌరవంగా వీడ్కోలు పలికారు. అయితే సమయం మించిపోడంతో జమైకా రేసు పూర్తి చేయలేదని నిర్వాహకులు ప్రకటించారు. ట్రాక్ మధ్యలో మోకాళ్ల మీద కూర్చొని చేతుల్లో తలను పెట్టుకుని బోల్ట్ తన బాధను దిగమింగుకోవడం చూపరులను ఉద్వేగానికి గురి చేసింది. ఏదో కోల్పోయిన వాడిలా కాసేపు అలా ట్రాక్‌పై ఒంటరిగా మిగిలిపోయాడు. గతంలో ఇదే వేదికపై మూడు స్వర్ణాలు సాధించిన బోల్ట్.. ఈసారి ఒకే ఒక్క పతకం (కాంస్యం)తో వెళ్లడం అభిమానులను మూగబోయేలా చేసింది. బ్రిటన్ స్వర్ణం నెగ్గడంతో స్థానిక అభిమానులు సంబురాలు చేసుకోవడం, బోల్ట్ నిరాశగా మెడికల్ రూమ్‌కు వెళ్లిపోవడం క్షణకాలంలో జరిగిపోయింది. ఫినిషింగ్ లైన్‌ను ముద్దాడే క్షణాలు.. మెరుపును ఆస్వాదిస్తున్నట్టు పెట్టే ఫోజులు ఏమీ లేకుండా ఓ దిగ్గజం కెరీర్‌కు వీడ్కోలు చెప్పేశాడు. బోల్ట్‌ను సాగనంపడం ఇది కాదనుకున్నారో ఏమోగానీ చాంపియన్‌షిప్ ఆఖరి రోజు బోల్ట్‌కు 'ల్యాప్ ఆఫ్ హానర్'ను ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

లండన్:

ఎంతో ఉద్వేగం.. అంతకుమించిన అరుదైన క్షణాలు.. ఈసారి తప్పితే మళ్లీ చూడలేమోనన్న ఉత్సాహం, ఉత్కంఠ.. గడిచిన కాలాన్ని నెమరేసుకుంటూ.. సాధించిన ఘనవిజయాలను లెక్కబెట్టుకుంటూ.. ఆశకు ఆసక్తిని తోడు చేసుకొని ఆశేష జనవాహిని ఆతృతగా ఎదురుచూసిన 4X100 మీటర్ల రేసులో ప్రపంచ పరుగు కిరీటధారుడు ఉసేన్ బోల్ట్.. తన ఆఖరాటలో మెప్పించలేకపోయాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ రేసును.. మెక్లీయాడ్, ఫోర్ట్, బ్లేక్, బోల్ట్‌లతో కూడిన జమైకా బృందం పూర్తి చేయలేకపోయింది. ఆఖరి అంచెలో పరుగెత్తిన బోల్ట్.. ఎడమ కాలి పిక్క గాయంతో రేసు మధ్యలోనే ట్రాక్‌పై కుప్పకూలిపోయాడు. దీంతో స్వర్ణంతో కెరీర్‌కు వీడ్కోలు పలుకాలన్న బోల్ట్ ఆశలు నెరవేరలేదు. ఆద్యంతం భావోద్వేగంతో నిండిన ఈ రేసులో గ్రేట్ బ్రిటన్ 37.47 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణాన్ని ఎగురేసుకుపోయింది. వంద మీటర్ల వ్యక్తిగత రేసులో బోల్ట్‌కు షాకిచ్చి స్వర్ణాన్ని ఎగురేసుకుపోయిన జస్టిన్ గాట్లిన్ సారథ్యంలోని అమెరికా జట్టు 37.52 సెకన్లతో సీజన్ బెస్ట్‌ను నమోదు చేస్తూ రజతాన్ని సొంతం చేసుకోగా.. జపాన్ బృందం 38.04 సెకన్లతో కాంస్య పతకం దక్కించుకుంది.

ఆఖరి అడుగు కోసం..

పరుగు పోటీలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన బోల్ట్.. ఆఖరి రేసులోనూ అంతే ఉత్సాహంతో కనిపించాడు. తన బృందంతో కలిసి ఒలింపిక్ స్టేడియంలోకి అడుగుపెట్టగానే వేలాది మంది అభిమానులు అతని నామస్మరణలో ఊగిపోయారు. చిరుమందహాసం చిందిస్తూనే.. ఫ్లయింగ్ కిస్‌లు ఇస్తూ.. భావోద్వేగంతో కూడిన కన్నీళ్లను రెప్పచాటున ఒడుపుగా బిగిసిపట్టుకుంటూ రిలే కోసం సిద్ధమయ్యాడు. ఇక అంతా అనుకున్నట్లుగానే రిఫరీ ట్రిగ్గర్ నొక్కాడు.. రేసు మొదలైంది. బ్యాటన్‌తో తొలి అంచె పరుగును ప్రారంభించిన మెక్లీయాడ్ అంచనాలను అందుకున్నాడు. రెండో అంచెలో ఫోర్ట్ పరుగును మొదలుపెట్టాడు.. ప్రపంచం గుండెలు వాయువేగంతో కొట్టుకుంటున్నాయి.. మూడో అంచెలో బ్లేక్ దూసుకొస్తున్నాడు.. ఓ అపురూప క్షణం కోసం బోల్ట్ చిరుతలా ఎదురుచూస్తున్నాడు.. అంతే లిప్తపాటులో బ్యాటన్‌ను అందించి బ్లేక్ తప్పుకున్నాడు. అలా అందుకున్నాడో లేదో.. పరుగుల వీరుడు పోరాటం మొదలుపెట్టాడు.. ఒక్కో అడుగు లంఘిస్తుంటే.. ఒకటి, రెండు, మూడు లెక్కపెట్టడానికి కూడా సమయం లేనంత వేగం.. ఆఖరి ల్యాప్‌లో ప్రత్యర్థులను ఓరకంట చూస్తూ పరుగు తీస్తున్న బోల్ట్.. ఇక స్వర్ణం ఖాయమే అనుకుంటున్న తరుణంలో.. 'విధి రాత' ఓ గొప్ప నాటకానికి తెరతీసింది. తన కాలి వేగంతో పరుగు ప్రపంచాన్ని ఏలిన ధీరుడికి గొప్ప వీడ్కోలు లేకుండా కండరాన్ని మెలిపెట్టేసింది. అంతే.. వాయువేగంతో దూసుకెళ్తున్న బోల్ట్.. క్షణకాలంలో నొప్పితో విలవిల్లాడుతూ ట్రాక్‌పై కుప్పకూలిపోయాడు. ఆ క్షణం భూగోళమంతా చీకటి ఆవరించినట్లైంది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే రేసు ముగిసిపోయింది.



బోల్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు

200 మీటర్లలో రజతం (ఒసాకా 2007)
4X100 మీటర్లలో రజతం (ఒసాకా 2007)
100 మీటర్లలో పసిడి (బెర్లిన్ 2009)
200 మీటర్లలో పసిడి (బెర్లిన్ 2009)
4X100 మీటర్లలో పసిడి (బెర్లిన్ 2009)
100 మీటర్లలో పసిడి (డేగూ 2011)
200 మీటర్లలో పసిడి (డేగూ 2011)
4X 100 మీటర్లలో పసిడి (డేగూ 2011)
100 మీటర్లలో పసిడి (మాస్కో 201)
200 మీటర్లలో పసిడి (మాస్కో 2013)
4X 100 మీటర్లలో పసిడి (మాస్కో 2013)
100 మీటర్లలో పసిడి (బీజింగ్ 2015)
200 మీటర్లలో పసిడి (బీజింగ్ 2015)
4X 100 మీటర్లలో పసిడి (బీజింగ్ 2015)
100 మీటర్లలో కాంస్యం (లండన్ 2017)

ఒలింపిక్స్ పతకాలు

100 మీటర్లలో స్వర్ణం (2008 బీజింగ్)
200 మీటర్లలో స్వర్ణం (2008 బీజింగ్)
100 మీటర్లలో స్వర్ణం (2012 లండన్)
200 మీటర్లలో స్వర్ణం (2012 లండన్)
4X 100 మీటర్లలో స్వర్ణం (2012 లండన్)
100 మీటర్లలో స్వర్ణం (2016 రియో)
200 మీటర్లలో స్వర్ణం (2016 రియో)
4X 100 మీటర్లలో స్వర్ణం (2016 రియో)

సాటెవ్వరు!



నమస్తే తెలంగాణ ఖేల్ విభాగం

ఉసేన్ బోల్ట్ జీవితం పూలపాన్పు కాదు. కష్టాల కడలి ఈదాడు. చెడు సావాసాలకు దూరంగా ఉండాలని.. దొంగతనాలు చేయరాదని.. జీవితంలో నిజాయితీగా ఎదిగి పదిమందికి ఆదర్శంగా నిలువాలని నిరంతరం తండ్రి బోధించాడు. ఇవన్నీ తూచా తప్పకుండా పాటించిన బోల్ట్ జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు. పరుగునే కెరీర్‌గా ఎంచుకుని ఎవరెస్ట్ అంత ఎత్తు ఎదిగిన తీరు అతని అంకితభావాన్ని తెలుపుతుంది. పుష్కరకాలంగా అథ్లెటిక్స్‌ను ఏలుతూ 100 మీటర్ల పరుగును శాసించిన ఉసేన్ బోల్ట్ కెరీర్ ఆసాంతం హిమాలయమంత సమున్నతం. వివాదాలు లేవు, నిషేధిత ఉత్ప్రేరకాలు వాడలేదు, ఫాం కోల్పోయిన దాఖలా లేదు. గాయాలు వేధించినా.. ఫీనిక్స్ పక్షిలా మళ్లీ ట్రాక్‌పై తళుక్కుమన్నాడు. అందుకే దిగ్గజాలంతా అతనికి జేజేలు పలికారు..అభిమానులు బ్రహ్మరథం పట్టారు.. బహుళజాతి కంపెనీలు కోట్లు కుమ్మరించాయి.వాణిజ్యప్రకటనలు, స్టార్ హోదా, అవన్నీ కెరీర్ ఆసాంతం నిలుపుకున్న ధీరోదాత్తుడు.. ప్రపంచ క్రీడా మార్గదర్శి బోల్ట్.

క్రమశిక్షణ.. అంకితభావం

చిన్నప్పుడు బోల్ట్ పేదరికాన్ని అనుభవించాడు. అతడి తల్లితండ్రుల ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఈ పరుగుల చిరుతను పెంచారు. జమైకాలోని ట్రెలానీ అనే చిన్నగ్రామంలో 1986 ఆగస్టు 21వ తేదీన బోల్ట్ జన్మించాడు. అతని తండ్రి వెలస్లీ ట్రైలాన్. తల్లి జెన్నిఫర్. వారికి ముగ్గురు పిల్లలు. బోల్ట్ తండ్రి ఓ కాఫీషాప్‌లో పని చేసేవారు. చిన్న ఉద్యోగం, చాలీచాలని జీతం. ఐనా కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకున్నారు. ఉన్న డబ్బునే పొదుపుగా వాడుకుంటూ పిల్లల సరదాలు, కోరికలు తీర్చేవారు. అదే సమయంలో డబ్బు కోసం పిల్లలు తప్పుడు మార్గాలు అన్వేషించకూడదంటూ చెప్పేవారు. ఇలా చిన్న వయసులోనే వారికి క్రమశిక్షణ పాఠాలు నేర్పుతూ ఉత్తమ జీవితం గడిపేలా వారిని జాగ్రత్తగా పెంచారు. ఎందుకంటే బోల్ట్ కుటుంబం నివసించే ప్రాంతంలో దొంగలు ఎక్కువ. చుట్టూ అలాంటి వాతావరణం ఉన్నా.. తన పిల్లలు ముగ్గురినీ మాత్రం కఠినమైన క్రమశిక్షణతో ఆయన పెంచారు. అంతేకాదు స్థానికంగా ఉండే రాజకీయాల ప్రభావం కూడా వారిపై పడనీయలేదు. 'చిన్నతనంలో మా దగ్గర డబ్బు ఉండేది కాదు. అయితే ఆ విషయంలో మేం ఎప్పుడూ బాధ పడలేదు. నువ్వు కూడా కష్టపడితేనే ఎవరి సహాయం లేకుండా బతుకవచ్చు. డబ్బు కోసం ఎప్పుడూ తప్పు డు మార్గాల్లోకి వెళ్లకు. అని నిరంతరం నాన్న బోధించేవారు. అందువల్లనే నేను ఇలా రాణించగలిగాను' అని బోల్ట్ తన జీవిత చరిత్ర 'ఉసేన్ బోల్ట్-మై స్టోరీ' పుస్తకంలో రాశాడు. చిన్ననాటి నుంచి కుటుంబ విలువలు, నిజాయితీ, మానవత్వం ఇవన్నీ తనను తీర్చిదిద్దాయని బోల్ట్ చాలా ఇంటర్వ్యూల్లో స్పష్టం చేశా డు. సాధారణ కుర్రాడు అత్యుత్తమ ఆటగాడిగా ఎదగడం ఏదో అదృష్టవశాత్తు జరిగింది కాదని.. తండ్రి పెంపకమే తన విజయాలను రచించిందని బోల్ట్ తన మనసులోని మాటను వెల్లడించాడు.



బోల్ట్ ప్రపంచ రికార్డులు
100 మీటర్లలో 9.58 సెకన్లు (2009 బెర్లిన్)
200 మీటర్లలో 19.19 సెకన్లు (2009 బెర్లిన్)

అథ్లెటిక్స్ ఎందుకంటే..

పాఠశాల విడిచిపెట్టగానే అందరికంటే ముందు ఇల్లు చేరేది బోల్టే. బడిలో ఉన్న అందరు పిల్లలకంటే వేగంగా పరుగెడుతాడని అతనికి పేరుండేది. అయితే ఈ ఒక్క కారణమే తనను పరుగుల చిరుతగా మార్చలేదని బోల్ట్ చెబుతాడు. 'జట్టుగా ఆడే క్రీడ ఏదైనా రాజకీయాలు ఉంటాయి. ఒకవేళ బాగా ఆడినా అవకాశం దక్కకపోవచ్చు. అథ్లెటిక్స్ నీకు ఎంత చేతనైతే నువ్వు అంత సాధించగలవు. ఒక్క గడియారం మాత్రమే నీ సత్తాను నిర్దేశించగలదు' అంటూ తండ్రి చేసిన మార్గనిర్దేశంతో తాను అథ్లెటిక్స్ ఎంచుకున్నట్లు బోల్ట్ వివరించాడు. ఎందుకొచ్చిన పరుగులని తల్లి జెన్నిఫర్ అసంతృప్తి వ్యక్తం చేసినా.. తండ్రి మాత్రం కొడుకు పరుగుకోసం తన జీవితాన్ని, జీతాన్ని ధార పోశారు. పాఠశాలలో చదువుతున్న సమయంలోనే పెద్దవాళ్లతో పరుగు పందెంలో పాల్గొనేవాడు బోల్ట్. పన్నెండేండ్లకే 100 మీటర్ల పరుగులో అత్యంత వేగవంతమైన సమయాన్ని నమోదు చేసిన విద్యార్థిగా రికార్డు నెలకొల్పాడు. మెమోరియల్ స్కూల్‌లో ప్రవేశం అనంతరం బోల్ట్ ఇతర క్రీడలపై దృష్టి సారించాడు. క్రికెటర్‌గా మారాలనుకున్న బోల్ట్ పరిస్థితిని ఇక్కడే మారింది. పిచ్‌పై అతని పరుగు వేగాన్ని చూసిన పాఠశాల శిక్షకులు డాయ్నే, బారెట్ కలిసి అతన్ని అథ్లెటిక్స్ వైపు మళ్లించారు. ఈ పాఠశాలలో పూర్వ విద్యార్థులు పరుగు పందేలలో చాలా పతకాలు సాధించిన చరిత్ర ఉంది. దీంతో బోల్ట్‌ను కూడా అలాగే తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వారిద్దరూ కలిసి శిక్షణ ఇచ్చారు. ఆ శిక్షణలో రాటుదేలిన బోల్ట్ సహజంగానే దూకుడు స్వభావం.. అంతకంటే అంకితభావాన్ని అలవర్చుకొని దిగ్గజంగా ఎదిగాడు.

ఫరా.. రజతంతో వీడ్కోలు



రేసు ముగిశాక భార్యా పిల్లలతో మో ఫరా

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బోల్ట్ తర్వాత అందరి దృష్టిని ఆకర్షించిన సుదూర పరుగు వీరుడు మో ఫరా ఆఖరి రేసును అనుకున్న స్థాయిలో ముగించలేకపోయాడు. ఈ టోర్నీనే తనకు కెరీర్‌లో ఆఖరిదని ముందే ప్రకటించిన ఈ బ్రిటన్ స్టార్ 5వేల మీటర్ల రేసును రజతంతో ముగించాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ రేసులో ఫరా రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఫరాకు షాకిస్తూ ఇథియోపియా అథ్లెట్ ముక్తార్ ఎడ్రిస్ స్వర్ణం గెలిచాడు. ఈ టోర్నీలో ఇప్పటికే 10వేల మీటర్ల రేసులో విజేతగా నిలిచిన 34ఏండ్ల ఫరాకిది 5వేల మీటర్లలో నాలుగో ప్రపంచ పతకం. అంతకుముందు మూడు పతకాలు స్వర్ణాలే. ఓవరాల్‌గా ఎనిమిదో ప్రపంచ పతకం.

యువీకి నో చాన్స్

న్యూఢిల్లీ: ఊహించినట్లుగానే సీనియర్ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్‌కు చుక్కెదురైంది. శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్ కోసం ఆదివారం సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిన 15 మందితో కూడిన జట్టులో యువీకి చోటు దక్కలేదు. 2019 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టును ఎంపిక చేసినట్లు బోర్డు అధికారి పేర్కొన్నాడు. బిజీ షెడ్యూల్‌ను ఆధారంగా చేసుకుని సీనియర్ బౌలర్లు అశ్విన్, జడేజా, షమీ, ఉమేశ్‌కు విశ్రాంతినిచ్చారు. రోహిత్‌శర్మ, లోకేశ్ రాహుల్, మనీశ్‌పాండే తిరిగి జట్టులోకి వచ్చారు. అక్షర్‌పటేల్, చాహల్, బుమ్రా బౌలింగ్ బాధ్యతలను పంచుకోనున్నారు. ఇక సీనియర్ క్రికెటర్ సురేశ్ రైనాకు మరోసారి నిరాశే ఎదురైంది. ఈ నెల 20 నుంచి ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ మొదలవుతుంది.

షూటింగ్‌లో భారత జోడీకి స్వర్ణం

అస్టానా: కజకిస్థాన్‌లోని అస్టానాలో ముగిసిన ఆసియా షాట్‌గన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత జోడీ స్వర్ణం సాధించింది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మైరాజ్ అహ్మద్‌ఖాన్-రష్మీ రాథోడ్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లో 28-27తో చైనా జంటను ఓడించి విజేతగా నిలిచింది.

లంక కుదేలు

■ తొలి ఇన్నింగ్స్‌లో 135 ఆలౌట్
■ ఫాలోఆన్‌లోనూ తడబాటు
■ భారీ విజయం దిశగా భారత్
■ హార్దిక్ రికార్డు సెంచరీ

సిరీస్ ఆరంభం నుంచి సమిష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న కోహ్లీసేన.. చివరిదైన మూడోటెస్టుపై మరింత పట్టు సాధించింది. హార్దిక్ పాండ్యా మెరుపు సెంచరీకి తోడు కుల్దీప్ యాదవ్ స్పిన్ కమాల్‌తో శ్రీలంకను ఫాలోఆన్‌లో పడేశారు. మరో మూడు మూడు రోజులు మిగిలున్న టెస్ట్‌లో భారత్‌కు 'రికార్డు' విజయం దాదాపుగా ఖరారు కాగా.. లంకకు హ్యాట్రిక్ ఓటమి ఖాయమైంది.



హార్దిక్ పాండ్యా (96 బంతుల్లో 108)

2 విదేశీ గడ్డపై వేగవంతమైన (86 బంతుల్లో) సెంచరీ కొట్టిన రెండో భారత బ్యాట్స్‌మెన్‌గా హార్దిక్ నిలిచాడు. 2006లో వెస్టిండీస్‌పై సెహ్వాగ్ 78 బంతుల్లో సెంచరీ చేశాడు.

3 ఒక ఓవర్లో 26 పరుగులు సాధించిన మూడో బ్యాట్స్‌మన్ హార్దిక్. ఇంతకుముందు లారా (28), జార్జ్ బెయిలీ (28), అఫ్రీది (27) ఉన్నారు.

పల్లెకెలె:

టీమ్ ఇండియా.. మూడో టెస్ట్‌లో ఇన్నింగ్స్ విజయంపై కన్నేసింది. మొదటిరోజు ధవన్ దంచికొడితే.. తానేం తక్కువ కాదన్నట్లు అరంగేట్రం టెస్ట్ సిరీస్‌లో హార్దిక్ పాండ్యా (96 బంతుల్లో 108, 8ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో కదం తొక్కాడు. ఆఖరి వరుస బ్యాట్స్‌మెన్‌తో కలిసి బౌండరీలతో చెలరేగిన పాండ్యా భారత్‌కు భారీ స్కోరు కట్టబెట్టడంలో కీలకమయ్యాడు. తన ఇన్నింగ్స్‌లో లంక బౌలర్లను ఉతికారేస్తూ టెస్ట్ కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసుకున్నాడు. దీంతో 329/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజు ఆట కొనసాగించిన భారత్ తొలిఇన్నింగ్స్‌లో 487 పరుగుల స్కోరు నమోదు చేసింది. సందకన్ 5 వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన లంక.. చైనామన్ కుల్దీప్ (4/40), షమీ (2/17), అశ్విన్ (2/22) ధాటికి 135 రన్స్‌కే కుప్పకూలింది. అప్పటికే 352 పరుగుల వెనుకంజలో ఉన్న లంకను ఫాలోఆన్‌కు ఆహ్వానించిన కెప్టెన్ కోహ్లీ ప్రయత్నం ఫలించింది. రెండోరోజు ఆట ముగిసేసరికి ఓపెనర్ ఉపుల్ తరంగ (7) వికెట్ కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. కురణరత్నే(12), పుష్పకుమార(0) క్రీజులో ఉన్నా రు. మరో మూడు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో లంక ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఇంకా 333 పరుగులు చేయాలి. రెండోరోజు ఆటలో మొత్తం 15 వికెట్లు నేలకూలాయి.

హార్దిక్ ధనాధన్: 329/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన భారత్‌కు సాహా(16) రూపంలో ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. విశ్వ ఫెర్నాండో(2/87) బౌలింగ్‌లో సాహా క్యాచ్ ఇచ్చి ఏడో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కుల్దీప్, హార్దిక్ కలిసి 8వ వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో ఇన్నింగ్స్ 110వ ఓవర్లో భారత్ 400మార్క్‌ను అందుకున్నది. ఇలా వరుసగా మూడు టెస్ట్‌ల్లో 400, అంతకుపైగా పరుగులు నమోదు చేసిన తొలి పర్యాటక జట్టుగా భారత్ నిలిచింది. ఇన్నింగ్స్ కుదుటపడిందనుకున్న దశలో కుల్దీప్ నిష్క్రమించాడు. షమీ(8) నిరాశపరిచినా, ఉమేశ్(3నాటౌట్) మాత్రం హార్దిక్‌కు సహకారం అందించాడు. ఉమేశ్ అండగా హార్దిక్ వీరవిహారం చేశాడు. 61బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న ఈ బరోడా బాంబర్.. మిగిలిన 50 పరుగులను 25 బంతుల్లోనే కొట్టేశాడు. పుష్పకుమార వేసిన ఇన్నింగ్స్ 116వ ఓవర్లోనైతే పాండ్యా దుమ్ముదులిపాడు. తొలి రెండు బంతులను ఫోర్లుగా మలిచి..తర్వాత వరుస మూడు బంతులను భారీ సిక్సర్లుగా సంధించాడు. దీంతో ఒకేఓవర్లో 26 పరుగులు స్కోరు బోర్డుకు జతకలిశాయి. ఉమేశ్‌తో కలిసి ఆఖరి వికెట్‌కు 66 పరుగులు జోడించడంతో టీమ్‌ఇండియా 487 స్కోరు అందుకుంది.

స్కోరుబోర్డు:

భారత్ తొలి ఇన్నింగ్స్: ధవన్(సి) చండీమల్ (బి)పుష్పకుమార 119, రాహుల్(సి) కరుణరత్నే(బి)పుష్పకుమార 85, పుజారా(సి) మాథ్యూస్(బి) సందకన్ 8, కోహ్లీ(సి) కరుణరత్నే(బి) సందకన్ 42, రహానే(బి) పుష్పకుమార17, అశ్విన్(సి) డిక్వెల్లా(బి) ఫెర్నాండో 31, సాహా(సి)పెరెర(బి)ఫెర్నాండో16, హార్దిక్(సి)పెరెర(బి)సందకన్ 108, కుల్దీప్(సి)డిక్వెల్లా(బి)సందకన్ 26, షమీ (సి&బి) సందకన్ 8, ఉమేశ్(నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు:** 24; **మొత్తం:** 487 ఆలౌట్; **వికెట్లపతనం:** 1-188, 2-219, 3-229, 4-264, 5-296, 6-322, 7-339, 8-401, 9-421, 10-487; **బౌలింగ్:** ఫెర్నాండో 26-3-87-2, కుమా ర 23-1-104-0, కరుణరత్నే 7-0-30-0, పెరెర 8-1-36-0, సందకన్ 35.3-4-132-5, పుష్పకుమార 23-2-83-3.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) సాహా (బి) షమీ 4, తరంగ (సి) సాహా (బి) షమీ 5, మెండిస్ (రనౌట్) 18, చండీమల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 48, మాథ్యూస్ (ఎల్బీ) హార్దిక్ 0, డిక్వెల్లా(స్టంప్/సాహా) (బి) కుల్దీప్ 29, పెరెర (సి) హార్దిక్ (బి) కుల్దీప్ 0, పుష్పకుమార (బి) కుల్దీప్ 10, సందకన్(సి) ధవన్ (బి) అశ్విన్ 10, ఫెర్నాండో (బి) కుల్దీప్ 0, కుమార (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు:** 11; **మొత్తం:** 135 ఆలౌట్; **వికెట్లపతనం:** 1-14, 2-23, 3-38, 4-38, 5-101, 6-107, 7-125, 8-125, 9-135, 10-135; **బౌలింగ్:** షమీ 6.5-1-17-2, ఉమేశ్ 3.1-0-23-0, హార్దిక్ 6-1-28-1, కుల్దీప్ 13-2-40-4, అశ్విన్ 8.4-2-22-2.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్): కరుణరత్నే (నాటౌట్) 12; తరంగ (బి) ఉమేశ్ 7, పుష్పకుమార 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 0; **మొత్తం:** 19/1; **వికెట్లపతనం:** 1-15; **బౌలింగ్:** షమీ 4-2-7-0, అశ్విన్ 6-4-5-0, ఉమేశ్ 2-0-3-1, కుల్దీప్ 1-0-4-0.



అసోంలోని నగావ్ జిల్లాలో ఆదివారం వరద బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సైన్యం

ఉత్తరాదిలో వరద బీభత్సం

సైన్యం సహాయం కోరిన బీహార్, అసోం రాష్ట్రాలు
ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు, బాలిక మృతి

గౌహతి, ఆగస్టు 13: ఉత్తరాదిలో వరద బీభత్సం కొనసాగుతున్నది. అసోంలో తాజా వరదల్లో ఆదివారం వరకు 14 మంది మృతి చెందారు. రాష్ట్రంలో 21 జిల్లాలు వరదలతో అల్లాడుతున్నాయి. నగాం, కొక్రాజర్ జిల్లాల్లో వరదల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సైన్యం సహాయాన్ని అర్థించింది. వైమానిక దళ హెలికాప్టర్లు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజీబ్ ప్రకాశ్‌బారు తెలిపారు. మరోవైపు బీహార్‌లోని కిషన్‌గంజ్, అరారియా, పూర్ణియా, కటీహార్ జిల్లాల్లోని లక్షల మంది ప్రజలు వరద ముంపును ఎదుర్కొంటున్నారు. ఆదివారం సీఎం నితీశ్‌కుమార్ ఆధ్వర్యంలో అత్యవసరంగా మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. వరద సహాయ చర్యల నిమిత్తం సైన్యం సహకారం కోరామని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా భారీవర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లోని మద్రమా గ్రామంలో శనివారం రాత్రి ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో 16ఏండ్ల బాలిక మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు, మరికొందరు గల్లంతయ్యారు. గల్లంతైన వారికోసం అన్వేషణ కొనసాగుతున్నదన్నారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని మదురై ఎయిర్‌పోర్టు గోడ శనివారం రాత్రి కూలిపోయింది. సీఐఎస్‌ఎఫ్ దళాలు దెబ్బతిన్న భాగాలను పునరుద్ధరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో భారీ వర్షాల కారణంగా సియాల్దా, హౌరా నుంచి బయల్దేరిన పలు రైళ్లను మార్గమధ్యలోనే నిలిపివేశారు. పలు ప్రధాన రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్టు అధికారులు చెప్పారు.

-చైనాలో సురక్షిత ప్రాంతాలకు 700మంది గ్రామస్తులు

చంగ్‌షా: మధ్య చైనాలోని హనాన్ ప్రావిన్స్‌లో యుయాంగ్ కౌంటీ గ్రామానికి చెందిన 700మంది నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శుక్రవారం యువాన్‌జింగ్ నదిపై ఉన్న జలాశయం గోడ కూలిపోవడంతో వందలాది ఇండ్లు జలమయం అయ్యాయి.

నేపాల్‌లో చిక్కుకున్న 200 మంది భారత పర్యాటకులు

ఖాట్మండు: నేపాల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం చిట్వాన్‌లో 600మంది టూరిస్టులు వరదల్లో చిక్కుకున్నారు. ఇందులో 200మంది భారతీయులు ఉన్నారు. నేపాల్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మృతుల సంఖ్య ఆదివారానికి 55కి పెరిగింది. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొత్తం 13మంది గాయపడగా.. 17మంది గల్లంతయ్యారని హోంశాఖ తెలిపింది. 21 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 35,843 ఇండ్లు జలమయమవగా.. వేయి ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. నేపాల్ ప్రధాని షేర్‌బహదూర్ నేతృత్వంలో అత్యవసర క్యాబినెట్ మీటింగ్ నిర్వహించారు. సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని స్థానిక ప్రభుత్వాలను పీఎం ఆదేశించారు.



ఇంటర్నెట్ స్పీడ్‌లో నంబర్ వన్ నార్వే!

ఓస్లో, ఆగస్టు 13: ప్రపంచవ్యాప్తంగా వేగంగా మొబైల్ ఇంటర్నెట్ సేవలందించడంలో నార్వే మొదటి స్థానంలో నిలిచింది. రెండోస్థానంలో నెదర్లాండ్స్, మూడో స్థానంలో హంగరీ ఉన్నాయి. ఇదే రంగంలో నార్వే 13 నెలల క్రితం 11వ స్థానానికి పరిమితమైందని చైనా అధికార వార్తాసంస్థ 'సిన్హువా' పేర్కొన్నది. ఇంటర్నెట్ స్పీడ్‌ను అంచనా వేసే సంస్థ 'ఓక్లా' మొబైల్ ఇంటర్నెట్ వేగాన్ని కనుగొనేందుకు స్పీడ్ టెస్ట్ డాట్ నెట్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఓక్లా గణాంకాల ప్రకారం గతేడాదితో పోలిస్తే సగటున నార్వే మొబైల్ ఫోన్లలో ఇంటర్నెట్ స్పీడ్ సెకన్‌కు 52.6 మెగాబిట్స్ చొప్పున 69 శాతం వేగం పెరిగింది. నార్వేలోని ప్రధాన టెలికం ఆపరేటర్లలో ఒకటైన టెలీనార్.. వేగంగా మొబైల్ ఇంటర్నెట్ సేవలు అందించడంలో మొదటిస్థానంలో నిలిచింది. నార్వేలో మూడు టెలికం సంస్థలు మొబైల్ సేవలందిస్తున్నాయి. ఇటీవలి కాలంలో 4జీ సేవలందిస్తున్న టెలీనార్ సంస్థ సెకన్‌కు 58.6 మెగాబిట్స్, టెలియా సంస్థ సగటున 45.9 మెగాబిట్స్ సమాచారం డౌన్‌లోడ్ అవుతున్నది.

శ్వేతజాతీయుల ర్యాలీలో హింస


- **ప్రదర్శకులపైకి దూసుకెళ్లిన కారు, ఒకరి మృతి**
- **హెలికాప్టర్ కూలిన ఘటనలో ఇద్దరు పోలీసులు దుర్మరణం**



ప్రదర్శకులపైకి దూసుకెళ్లిన కారు

వాషింగ్టన్, ఆగస్టు 13: అమెరికా వర్జీనియా రాష్ట్రంలోని చార్లెట్‌విల్లే పట్టణంలో శ్వేతజాతీయులు, వారి వ్యతిరేకవర్గం పరస్పరం చేపట్టిన నిరసన కార్యక్రమాలు హింసాత్మకంగా మారాయి. శ్వేతజాతీయులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వారిపైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా 19 మంది గాయాలపాలయ్యారు. దీంతోపాటు ర్యాలీని పర్యవేక్షించేందుకు వచ్చిన ఓ హెలికాప్టర్ దురదృష్టవశాత్తూ కూలిపోవడంతో ఇద్దరు పోలీసు అధికారులు మృత్యువాతపడ్డారు. జాతీయవాదులు కాన్ఫడరేట్ జనరల్ రాబర్ట్ ఈ లీ విగ్రహాన్ని తొలిగించడానికి వచ్చి ఆ పార్కులో తిష్ఠ వేశారని శ్వేతజాతీయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. శ్వేతజాతీయలకు వ్యతిరేకంగా జాతీయవాదులు శాంతియుత పద్ధతిలో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారు వారిపైకి దూసుకెళ్లడంతో ఓ మహిళ (32) చనిపోగా 19 మందికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ జేమ్స్ ఫీల్డ్స్ (20)ను అరెస్టు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా నిరసన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించడానికి వచ్చిన ఓ హెలికాప్టర్ కూలిపోవడంతో వర్జీనియా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే ఇద్దరు పోలీసు అధికారులు చనిపోయారు. ఈ రెండు ఘటనల కంటే ముందు రాబర్ట్ ఈ లీ విగ్రహాన్ని తొలిగించడాన్ని వ్యతిరేకిస్తూ శ్వేతజాతీయులు చేపట్టిన ర్యాలీ సందర్భంగా 15 మంది గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. జాతీయవాదులు, శ్వేతజాతీయులు ఒకరిపై ఒకరు వాటర్ బాటిళ్లు విసురుకుంటూ.. పరస్పరం నినాదాలు చేశారని స్థానిక మీడియా తెలిపింది. ర్యాలీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. అల్లర్లు జరుగుతున్న ప్రాంతంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి.

ఇది 'యోధ' గబ్బిలం!



లండన్, ఆగస్టు 13: స్టార్ వార్స్ సినిమా గుర్తుందా.. అందులో జేడీ మాస్టర్ పాత్ర రూపురేఖలతో ఉండే ఓ గబ్బిలాల జాతిని ఇటీవలే శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పుపువా న్యూగినియా ద్వీపంలోని దట్టమైన అరణ్యాల్లో ఉన్న గుహల్లో ఈ కొత్త జాతిని అమెరికాకు చెందిన యార్క్ యూనివర్సిటీ పరిశోధకులరాలు నాన్సీ ఇర్విన్ గుర్తించారు. వీటి ముక్కు పొడుగ్గా సాగి ఉండడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3000 గబ్బిలాల జాతులను పరిశీలించి.. వీటిని కొత్త జాతిగా గుర్తించారు. 'హమ్మన్స్' అనే పేరుతో దీనిని ప్రపంచానికి పరిచయం చేశారు. స్థానిక భాషలో ఈ పదానికి అర్థం 'సంతోషం'. ఈ గబ్బిలం ముఖం స్టార్‌వార్స్ సినిమాలోని జేడీ మాస్టర్ ముఖాన్ని పోలిఉండడంతో 'యోధ గబ్బిలం'గా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇప్పుడు శాస్త్రవేత్తలు దీని శాస్త్రీయ నామాన్ని 'నైక్టిమెన్ రైఫ్టి'గా మార్చారు.

భారత ప్రయాణికుడి పట్ల చైనా ఎయిర్‌లైన్స్ అనుచిత ప్రవర్తన

బీజింగ్, ఆగస్టు 13: భారత ప్రయాణికుల పట్ల చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారు. ఈ విషయం విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ దృష్టికి రావడంతో షాంఘైలోని చైనా విదేశాంగశాఖ, పొడొంగ్ విమానాశ్రయ అధికారులకు భారత్ ఫిర్యాదు చేసింది. అయితే తొలుత ఈ ఆరోపణలను తిరస్కరించిన చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం.. సీసీటీవీ కెమెరా క్లిప్పింగ్స్ తనిఖీ చేసిన తర్వాత పొరపాటు జరిగినట్లు ధ్రువీకరించినట్లు చైనా అధికార వార్తాసంస్థ 'షిన్హువా' తెలిపింది. ఈ నెల ఆరో తేదీన న్యూఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరి వెళుతున్న ఉత్తర అమెరికా పంజాబ్ సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్నాం సింగ్ ఛాహల్ పట్ల షాంఘైలోని పొడుంగ్ విమానాశ్రయంలో చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగి అనుచితంగా ప్రవర్తించాడు. దీనిపై సదరు సంస్థ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ ఉద్యోగిపై మండిపడ్డారని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌కు రాసిన లేఖలో సత్నాం సింగ్ చాహల్ తెలిపారు.



